PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 250 | విజయవాడ, గురువారం 13 ఏప్రిల్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Thursday 13 April 2023 | Rs

'వందేభారత్' సరే... ప్యాసింజర్ రైళ్లేవి..?

- కోవిడ్ పేరుతో సికింద్రాబాద్- తిరుపతి మధ్య 16 ప్యాసింజర్ రైళ్లు రద్దు
- ఆదాయమే పరమావధిగా 'రైల్వేశాఖ'

లోపలి పేజీలో..


మాకినేని బసవపున్నయ్య 31వ వర్థంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు మధు, తులసీదాస్, తులసీరావు, మాల్యాద్రి తదితరులు

పేదల పక్షాన పనిచేసిన మాకినేని
వర్థంతి సభలో వక్తలు

లోపలి పేజీలో..



ఆర్మీ స్టేషన్‌పై దాడి

- నలుగురు జవాన్లు మృతి
- రైఫిల్, గొడ్డలితో వచ్చిన ఇద్దరు దుండగులు
- ఉగ్రవాద చర్యేనా?
- కొనసాగుతున్న దర్యాప్తు

భటిండా : పంజాబ్‌లోని భటిండా మిలటరీ స్టేషన్‌లో బుధవారం ఉదయం దాడి జరిగింది, ఈ దాడిలో నలుగురు ఆర్మీ జవాన్లు మరణించారు. ఇది ఉగ్రవాదుల పనేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. తెల్లవారు జామున 4.30గంటల సమయంలో ఇన్సాస్ రైఫిల్, గొడ్డలి పట్టుకుని, కుర్తా పైజామాల్లో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఈ దారుణానికి తెగబడ్డారని పంజాబ్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు.. ఘటన జరిగిన వెంటనే రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను మోహరించి, ఆ ప్రాంతాన్నంతా గాలిచారు.. ఆ వచ్చిన ఇద్దరు వ్యక్తులు కూడా తమ ముఖాలు కనబడకుండా ముసుగులు ధరించి వున్నారని, . గాలింపు బృందానికి ఆ ప్రాంతంలో ఇన్సాస్ రైఫిల్, తూటాలు దొరికాయని సైన్యం తెలిపింది. ఆ ఆయుధాన్ని పంజాబ్ పోలీసులు, సైన్యానికి చెందిన సంయుక్త బృందాల ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. రైఫిల్‌లోని మిగిలిన తూటాలు ఫోరెన్సిక్ విశ్లేషణ తర్వాత మాత్రమే అందుబాటులోకి వస్తాయని ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. పంజాబ్ పోలీసులతో కలిసి సంయుక్త దర్యాప్తు సాగుతోందని, ఈ ఘటనకు సంబంధించి ఇంతవరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని ఆర్మీ తెలిపింది. ఘటనా స్థలిలో 19తూటాలు మిలటరీ స్టేషన్‌లో లభ్యమైనట్లు పంజాబ్ పోలీసులు తెలిపారు. నలుగురు జవాన్లు తమ బ్యారక్‌ల్లో నిద్ర పోతుండగా, వారిపై దాడి జరిగిందని భటిండా ఎస్‌పి అజయ్ గాంధీ తెలిపారు, కాల్పుల్లో చనిపోయిన నలుగురు జవాన్లు ఆర్టిలరీ యూనిట్‌కి చెందిన సాగర్ బన్నె (25), కమలేష్. ఆర్(24), యోగేష్‌కుమార్(24), సంతోష్ నాగరల్ (25)గా గుర్తించారు. వారి కుటుంబాలకు సమాచారం అందజేశారు. చనిపోయిన నల్గురు జవాన్లలో తమిళనాడుకు చెందిన ఇద్దరు, కర్ణాటకకు చెందిన ఇద్దరు ఉన్నారు. కాల్పులు జరిపిన వెంటనే దుండగులు సమీపంలోని అడవిలోకి పరారయ్యారని ఒక జవాన్ తెలిపారు.

ఈ కాల్పుల్లో మరెవరూ గాయపడలేదని, ఇతరత్రా ఆస్తినష్టం సంభవించలేదని సౌత్ వెస్ట్రన్ కమాండ్ తెలిపింది. జరిగిన విషయమంతా ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు నివేదించారు. ఇతర అంశాలతో పాటు సోమవారం అదృశ్యమైన ఇన్సాస్ రైఫిల్, 28 బుల్లెట్లపై విచారణ జరుగుతున్నదని పంజాబ్ పోలీసులు తెలిపారు.

నవరత్నాల్లో అత్యధికం మహిళలకే

అక్టోబరులో 'వెలుగొండ'ను ప్రారంభిస్తా

'వైఎస్‌ఆర్ ఇబిసి నేస్తం' రెండో విడత ప్రారంభోత్సవంలో సిఎం జగన్

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో, మార్కాపురం

నవరత్న పథకాల్లో అధిక భాగం మహిళలకే కేటాయించామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సెల్ఫీ ఛాలెంజ్ అంటే నాలుగు ఫేక్ ఫొటోలు దిగడం కాదని టిడిపి అధినేత చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. 'వైఎస్‌ఆర్ ఇబిసి నేస్తం' రెండో విడత ప్రారంభోత్సవంలో భాగంగా ప్రకాశం జిల్లా మార్కాపురంలోని ఎస్‌వికెపి కళాశాల మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో రూ.2.7 లక్షల కోట్లను వివిధ పథకాల ద్వారా ఎలాంటి వివక్షా లేకుండా, లంచానికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశామన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందితే రాష్ట్రం బాగుంటుందని తెలిపారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా అవకాశాలు కల్పించామన్నారు. మహిళలకు 50 శాతం అన్నింటా వాటా ఉండేలా చట్టం తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల పేరుతో ఇంటి స్థల పట్టాలు 30 లక్షల వరకు ఇచ్చామని, అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని అన్నారు. ఒక్కో ఇంటి విలువ రూ.5 నుంచి రూ. 10 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. 'కట్టకుండా టిడ్కో ఇళ్ల వద్దకు వెళ్లి నాలుగు ఫేక్ ఫొటోలు దిగుతాడు. మీ బిడ్డ హయాంలో పూర్తిగా కట్టి వేగంగా పనులు జరుగుతుంటే, ఆ టిడ్కో ఇళ్ల వద్దకు వెళ్లి ఫొటోలు దిగుతాడు. సెల్ఫీ అంటాడు. ఈ 75 సంవత్సరాల ముసలాయన. ఫొటోలు దిగడమే కాకుండా సెల్ఫీ ఛాలెంజ్ అంటాడు' అంటూ చంద్రబాబును జగన్ ఎద్దేవా చేశారు. ప్రతి అక్కాచెల్లెమ్మ మన ప్రభుత్వం వల్ల మేలు జరిగిందని చిరునవ్వుతో ఆశీర్వదిస్తే, అప్పుడు సెల్ఫీ ఛాలెంజ్ అవుతుందని తెలిపారు. 'మీ హయాంలో ఏం జరిగిందో, మా హయాంలో ఏం జరిగిందో అభివృద్ధిని బేరీజు వేసుకునే సత్తా ఉందా? ఇదే నా ఛాలెంజ్' అని చంద్రబాబును ఉద్దేశించి సిఎం జగన్ అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశావని, మా ఇళ్లకు స్టిక్కర్లు ఎందుకు వేస్తున్నావని ఇబిసి నేస్తం లబ్ధిదారులు, ఆసరా, విద్యాదీవెన, చేయూత పథకాల కింద లబ్ధిపొందిన ప్రతి అక్కాచెల్లెమ్మలు చంద్రబాబును నిలదీయాలని కోరారు. మేనిఫెస్టోలో లేకున్నా ఇబిసి నేస్తం కింద అగ్రవర్ణ పేద మహిళల అభ్యున్నతికి సాయం అందిస్తున్నామని తెలిపారు. సెప్టెంబరు నాటికి రెండో సొరంగం పనులు కూడా పూర్తి చేసి వెలుగొండ ప్రాజెక్టును అక్టోబరులో వచ్చి ప్రారంభిస్తామని ప్రకటించారు. అనంతరం మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి బటన్ నొక్కి 4.39 లక్షల మంది ఇబిసి నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లో రూ.659 కోట్లు నేరుగా జమచేశారు. సభలో మంత్రి చెల్లుబోయిన గోపాలకృష్ణ మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి నియోజకవర్గంలోని పలు సమస్యలను నివేదించి నిధులు కోరారు. అందుకు సిఎం జగన్ సానుకూలంగా స్పందించి మంజూరు చేస్తామని ప్రకటించారు.



బాలినేనితో కలిసి బటన్ నొక్కుతున్న ముఖ్యమంత్రి జగన్, చిత్రంలో మంత్రి సురేష్ తదితరులు

ప్రోటోకాల్ రగడ

సిఎం హెలిప్యాడ్ వద్దకు వెళ్తున్న వైసిపి కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కారును పోలీసులు అడ్డుకున్నారు. కారు దిగి నడిచి వెళ్లాలని కోరారు. దీంతో, ఆయన పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి వెనుదిరిగి ఒంగోలుకు బయలుదేరారు. ఈ విషయం సిఎంకు తెలిసిన వెంటనే మంత్రి ఆదిమూలపు సురేష్‌తో మాట్లాడారు.

సిఎంఒ అధికారులు జోక్యం చేసుకుని బాలినేనితో మాట్లాడి సర్ది చెప్పారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతామన్నారు. దీంతో, బాలినేని తిరిగి మార్కాపురం వచ్చారు. సిఎం ప్రసంగం ముగిసే ముందు వేదికపైకి చేరుకున్నారు. సిఎం జగన్ తెలివిగా బాలినేనితో బటన్ నొక్కించి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు వేయించారు.

సిపిఎం నిరసన

సిఎం పర్యటనలో సిపిఎం నేతలు నిరసన తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, నిర్వాసితులను ఆదుకోవాలని, మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా గుర్తించాలని నినాదాలు చేశారు. మార్కాపురంలోని లూథరన్ చర్చి వద్దకు ముఖ్యమంత్రి రాగానే సిపిఎం నేతలు మార్కాపురం జిల్లా జెండాలతో ఆందోళనకు దిగారు. నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో పోలీసులకు, సిపిఎం నాయకుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది.

మద్దిపాడు @ 43.27 డిగ్రీలు

ప్రజాశక్తి- ఒంగోలు

వేసవిలో ఎండలు బెంబేలెత్తిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో జనం విలవిలలాడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి ఉంటోంది. ప్రకాశం జిల్లాలో బుధవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మద్దిపాడులో అత్యధికంగా 43.27 డిగ్రీలు నమోదు కాగా, మద్రిపూడిలో 43.2, అర్థవీడులో 42.9, దొనకొండలో 42.84, కంభంలో 42.66, కురిచేడులో 42.56, బల్లికురవలో 42.45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో, రోడ్లపై జనసంచారం చాలా తక్కువగా ఉంటోంది. మంగళవారం నుంచి అధికమైన ఎండలు బుధవారం మరింత తీవ్రమయ్యాయి. ముందుముందు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

డిమాండ్‌కు తగ్గట్లు ముందస్తు ఏర్పాట్లు

- విద్యుత్ కోతలు లేకుండా చర్యలు : సిఎస్ జవహర్‌రెడ్డి

లోపలి పేజీలో..

పులివెందులలోనూ గెలుస్తాం : చంద్రబాబు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, విజయవాడ

'రాబోయే ఎన్నికల్లో కుప్పంలో గెలుస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పదేపదే చెబుతున్నాడు. కుప్పంలో గెలవడం తర్వాత సంగతి. ముందు పులివెందులలో ఆయన ఓడిపోవడం, టిడిపి జెండా ఎగరడం ఖాయం' అని టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ కృష్ణలంకలోనూ, కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని హిందూ కాలేజీ గ్రౌండ్స్‌లోనూ బుధవారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

వైసిపి ప్రభుత్వ పాలనలో సిఎం జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు లేవని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, దళితులకు గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వానికి ఎదురుతిరిగిన వారి ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని దుయ్యబట్టారు. జగన్ పాలనపై ప్రజలు తిరుగుబాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితాలే దీనికి రుజువని తెలిపారు. ఏ రాజకీయ పార్టీ అయినా ఇంటి గోడలపై స్టిక్కర్లు అతికించాలన్నా, రాతలు రాయాలన్నా యజమాని అనుమతి తప్పనిసరిగా అన్నారు. జగన్ ఫొటోతో వలంటీర్లు అతికిస్తున్న స్టిక్కర్లకు ప్రజల అనుమతి తీసుకోలేదని విమర్శించారు. ఈ నాలుగేళ్లలో ప్రజలకు ఏ మంచి జరిగిందో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. మహిళల జీవితాలు చితికిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని, విద్యుత్తు ఛార్జీలు పెంచి వినియోగదారులపై రూ.5,500 కోట్లు భారం వేశారని అన్నారు. నెలనెల యూనిట్‌పై 80 పైసలు పెంచుతున్నారని తెలిపారు. పథకాల పేరుతో పది రూపాయలు ఇచ్చి భారాల మోపడం ద్వారా రూ.100 లాక్కుంటున్నారని విమర్శించారు. జగనన్న మీ భవిష్యత్తు కాదని, రాష్ట్రానికి పట్టిన దరిద్రమని దుయ్యబట్టారు. వైసిపి పాలన నుంచి విముక్తి కలిగినప్పుడే రాష్ట్ర భవిష్యత్తుకు అంధకారం తొలగిపోయి వెలుగులు వస్తాయన్నారు. మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, మండలి బుద్ధప్రసాద్ తదితరులు మాట్లాడారు.


కృష్ణలంకలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

టీచర్లకు కుర్చీలు వద్దట !

- జాతీయ పాఠ్యప్రణాళిక నూతన ముసాయిదా సిఫార్సు

న్యూఢిల్లీ : పాఠశాల తరగతి గదిలో విద్యను బోధించే ఉపాధ్యాయులకు కూర్చునేందుకు కుర్చీలు ఇవ్వకూడదట ! వారు నిల్చొనో, అటూ ఇటూ తిరుగుతూనో పాఠాలు చెప్పాలట ! పాఠశాల విద్యకు సంబంధించిన జాతీయ పాఠ్యప్రణాళిక నూతన ముసాయిదా (ఎన్‌సిఎఫ్) ఈ మేరకు సిఫార్సు చేసింది. దీనిని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గతవారం విడుదల చేసింది. తరగతి గదిలో సింబల్స్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ముసాయిదా సూచించింది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చిహ్నాలు, దృశ్య రూపాలు, గోడలపై రాతలు, పెయింటింగులు, ప్రతిమలు, భౌతిక వస్తువులు వంటి వాటిని ఏర్పాటు చేయాలని తెలిపింది. ప్రధానోపాధ్యాయుడు కూర్చునే కుర్చీ, ఇతర ఉపాధ్యాయులు కూర్చునే కుర్చీలు భిన్నంగా ఉండాలని సూచించింది. సింబల్స్‌ను సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలో బాధ్యులు నిర్ణయించుకోవాలని, దీనివల్ల విద్యార్థులు తమ ఆలోచనలు పంచుకుంటూ మంచి వాతావరణంలో మెలగుతారని అభిప్రాయపడింది.


మల్లికార్జున ఖర్గే నివాసంలో ఖర్గేతో నితీష్, తేజస్వి యాదవ్ భేటీ

బిజెపిపై ఐక్య పోరు

- ప్రతిపక్షాలన్నిటినీ ఏకతాటిపైకి తీసుకొస్తాం:రాహుల్
- ఖర్గేతో నితీష్ కుమార్, తేజస్వియాదవ్ భేటీ
- కేజ్రీవాల్ తోనూ సంప్రదింపులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జెడియు చీఫ్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఉపముఖ్యమంత్రి, తేజస్వి యాదవ్ బుధవారం సమావేశమయ్యారు. రాహుల్ సమక్షంలో ఖర్గేతో వారు చర్చలు జరిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భావ సారూప్యత గల పార్టీలన్నీ ఉమ్మడి వేదికగా ఏర్పడతాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నిటిని ఏకతాటిపైకి తీసుకురావాలని ప్రతిన బూనింది..ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే ట్వీట్ చేస్తూ, ఇది చారిత్రక సమావేశమని అన్నారు. అన్ని ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తేవడమే తమ లక్ష్యమని తెలిపారు.రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తాను, రాహుల్ గాంధీ కలసి నితీష్, తేజస్వియాదవ్ తదితరులతో మాట్లాడామని అన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ "మేము ఇక్కడ ఒక చారిత్రాత్మక సమావేశాన్ని నిర్వహించాము. చాలా విషయాలు చర్చించాం. మేము అన్ని పార్టీలను ఏకం చేసి రాబోయే ఎన్నికల్లో ఐక్యంగా పోరాడాలని నిర్ణయించుకున్నాము" అని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలను సమైక్యపరచడం ఓ ప్రక్రియ అని, దేశం కోసం ప్రతిపక్షాల దార్శనికతను ఇది తీర్చిదిద్దుతుందన్నారు.

మిగతా 7లో

రుషికొండపై అనుమతించిన మేరకే నిర్మాణాలు

- హైకోర్టుకు కేంద్ర కమిటీ నివేదిక

లోపలి పేజీలో..



వేలిముద్రల క్లోనింగ్‌తో ఖాతాల్లో సొమ్ములు స్వాహా

- ఒక్కడే 126 కేసుల్లో నిందితుడు


శాసన మండలి ఛైర్మన్ మోషేన్ రాజుతో నూతన ఎమ్మెల్సీల గ్రూఫ్ ఫోటో

9 మంది వైసిపి ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి నుంచి రాష్ట్ర శాసన మండలికి ఎన్నికైన తొమ్మిది మంది ఎమ్మెల్సీలు ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం శాసనసభ ప్రాంగణంలో ఎమ్మెల్సీలతో శాసన మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ప్రమాణస్వీకారం చేయించారు. శాసనసభ కోటాలో ఎన్నికైన మర్రి రాజశేఖర్, చంద్రగిరి యేసురత్నం, పోతుల సునీత, బొమ్మి ఇజ్రాయిల్, జయమంగళ వెంకటరమణ, పివివి సూర్యనారాయణతోపాటు తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎన్నికైన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎంవి రామచంద్రారెడ్డి, అనంతపురం స్థానిక సంస్థల నుంచి గెలుపొందిన ఎస్ మంగమ్మతో మండలి ఛైర్మన్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు అంబటి రాంబాబు, కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్ ఎం ప్రసాదరాజు, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసనసభ సెక్రటరీ జనరల్ పిపికె రామాచార్యులు, శాసనపరిషత్ ఒఎస్‌డి సత్యనారాయణ, డిప్యూటీ సెక్రటరీ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కిన డిఎస్‌సి 1998 అభ్యర్థులు

- పోస్టుల భర్తీలో రోస్టర్ పద్ధతి పాటించాలి
- ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అన్యాయంపై ఆందోళన
- నిరసనకు కెవిపిఎస్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ మద్దతు

లోపలి పేజీలో..

విశాఖ ఉక్కుపై కేంద్రం కొత్త నాటకం

- స్టీల్‌ప్లాంట్ కోసం జగన్ ఢిల్లీ యాత్ర చెయ్యాలి
- రేపటి నుంచి సిపిఎం, సిపిఐ ప్రచార భేరి : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను గుండుగుత్తగా అమ్మే అవకాశాలు లేకపోవడంతో ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్త నాటకానికి తెరతీసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. బిజెపి నాయకులు ఆంధ్రప్రదేశ్ ద్రోహులుగా మిగిలిపోకుండా ఉండాలంటే ప్రధాని మోడీ దగ్గర కూర్చుని స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నిధులు మంజూరు చేయించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తోన్న బిఆర్‌ఎస్ పార్టీని కేంద్ర ప్రభుత్వం, బిజెపి నాయకులు విమర్శించడమే పనిగా పెట్టుకోవడం శోచనీయమన్నారు. విశాఖపట్నం జగదాంబ సెంటర్ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం ఆయన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడులతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, బాధల్పూర్ ఎయిర్ పోర్టులను కేంద్రం ప్రయివేట్‌పరం చేయాలని ప్రయత్నిస్తే ఆ రాష్ట్ర బిజెపి సర్కారు వ్యతిరేకంగా పోరాడడంతో కేంద్రం వెనక్కి తగ్గిందన్నారు. మన రాష్ట్రంలో ఆ ప్రభుత్వం కంటే వైసిపి బలహీనంగా ఉందా? అని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో వైసిపి నాయకులు పాల్గొని ముందుకు సాగుతారో? పోరాటానికి వెన్ను చూపి రాష్ట్ర ద్రోహులుగా మిగిలిపోతారో? తేల్చుకోవాలన్నారు. ప్రశ్నించడానికి ఉన్నానంటున్న పవన్ కల్యాణ్ కూడా ఈ విషయంలో మోడీకి వంత పాడుతున్నారని విమర్శించారు. టిడిపి కూడా ఏం మాట్లాడడం లేదన్నారు.

టిడిపి, జనసేన ఈ పోరాటంలో భాగస్వాములైకార్మిక వ్యతిరేక బిజెపి పాలనను ఎదుర్కోవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ యాత్రలు తన కేసుల కోసం కాకుండా, స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేయాలని అన్నారు. దేశంలో మోడీ ముదనష్టపు పాలన అంతం కావాల్సి ఉందని తెలిపారు.

బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు సిపిఐ, సిపిఎం సంయుక్తంగా ప్రచార భేరి నిర్వహిస్తున్నట్టు వి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తామని చెప్పారు. విజయవాడలో జరిగే ప్రారంభ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, సిపిఐ పార్లమెంటరీ నాయకులు వినయ్ విశ్వం, పలువురు సీనియర్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. 26న విశాఖలో జరిగే సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిపిఐ నాయకులు నారాయణ హాజరవుతారని చెప్పారు. బిజెపి పాలనలో ఇంతకుముందు ఎన్నడూలేని విధంగా నిరంకుశ పాలన సాగుతోందన్నారు. అదాని వ్యవహారంపై ప్రపంచ వ్యాప్తంగా పలు విమర్శలు వస్తోన్నా, దేశ ప్రతిష్ట దిగజారుతున్నా పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ కనీసం చర్చించకపోవడాన్ని ఏమనాలో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు రాహుల్ గాంధీ మీద ఉన్న చిన్న కేసును తీసుకొని రాజ్యాంగానికి వ్యతిరేకంగా

మిగతా 7లో

మార్గదర్శి చిట్‌ఫండ్‌లో అక్రమాలు

- దర్యాప్తు చేయాలని ఇడి, సిబిడిటిని కోరాం
- సిఐడి ఎడిజి ఎన్ సంజయ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మార్గదర్శి చిట్‌ఫండ్‌లో అక్రమాలు జరిగాయని, దర్యాప్తు చేయాలని ఇడి, సిబిడిటిని కోరామని సిఐడి ఎడిజి సంజయ్ అన్నారు. బుధవారం నాడు ఎపి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంజయ్ మాట్లాడారు. చిట్‌ఫండ్ చట్టం-1982ను మార్గదర్శి ఉల్లంఘించిందని, చిట్ చందాదారుల డబ్బును అక్రమంగా దారి మళ్లించారని అన్నారు. చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నప్పుడు ప్రభుత్వం మౌన ప్రేక్షకుడిగా ఉండదని పేర్కొన్నారు. మొత్తం మునిగిపోయేంత వరకు ప్రభుత్వం చేతులు ముడుచుకుని ఉండదని, ఎవరో వచ్చి ఫిర్యాదు ఇచ్చేవరకు వేచి చూడదని అన్నారు. ప్రజల్ని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, శ్రీరామ్ చిట్స్ కేసు తీర్పులో సుప్రీం కోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ చట్టాన్ని ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయిందని, ఇందులో మనీ లాండరింగ్, నిధుల మళ్లింపు జరిగిందని పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు జరపాలని ఇడి, సిబిడిటిని కూడా కోరినట్లు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అత్యుత్తమ ప్రమాణాలతో ఆరోగ్యశ్రీ సేవలు

- వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో వైద్యసదుపాయం అందించాలని వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య పథకాలు, 108, 104 సేవల నిర్వహణపై మంగళగిరిలోని ఎపిఐఐసి భవనంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నమోదిత ఆస్పత్రులను నిరంతరం పర్యవేక్షిస్తూ ట్రస్టు నియమ, నిబంధనల మేరకు అక్కడ వైద్య సేవలు అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో అందేలా చూడాలని కృష్ణబాబు అన్నారు. జిల్లా సమన్వయకర్తలు అన్ని అంశాలపై ఆరోగ్యమిత్రలకు శిక్షణ ఇవ్వడంతోపాటు అవగాహన కల్పించాలని పేషెంట్లను ఆస్పత్రులకు తరలించడం, అక్కడ వారికి సూచనలు చేసి సలహాలివ్వడం, ఆరోగ్యశ్రీ సేవలతో కలిగే ప్రయోజనాలను వివరించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పేషెంట్లకు అవసరమైన వైద్య సేవలందించేలా నెట్‌వర్క్ ఆస్పత్రులకు సూచనలు జారీ చేయాలన్నారు. ఆస్పత్రుల నాణ్యతను గుర్తించి వర్గీకరించేందుకు ఏజెన్సీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. 104 సేవల కోసం కొత్త వాహనాలు ప్రవేశపెట్టిన నేపథ్యంలో మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయులు) నిర్దేశిత గ్రామ సచివాలయాన్ని సక్రమంగా సందర్శిస్తున్నాయో, లేదో పర్యవేక్షించే వ్యవస్థను అమలులోకి తేవాలన్నారు. 108 అంబులెన్స్‌లను పూర్తిస్థాయి పరికరాలతో సిద్ధం చేశామని, సుశిక్షితులైన ఇఎంటిలను నియమించామని కృష్ణబాబు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను అదానీకి అప్పగించేందుకు యత్నం

- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి అదానీకి అప్పగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్నాయని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా గుంటూరులో మూడు వేల మంది పేద ముస్లిములకు పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రుద్రరాజు మీడియాతో మాట్లాడుతూ ఇందిరా గాంధీ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనలో భాగంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటైందన్నారు. కాంగ్రెస్ హయాంలో స్టీల్ ప్లాంట్ అభివృద్ధి పథంలో నడిచిందని, ఇప్పుడు మోడీ హయాంలో రూ.3 లక్షల కోట్ల ప్లాంట్‌ను తక్కువ ధరకు అదానీకి అప్పగించే యత్నం జరుగుతోందని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3500 కోట్ల పెట్టుబడి పెడితే 50 వేల టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేయొచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే బిడ్డింగ్‌లో పాల్గొని స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసే లక్ష కుటుంబాలను కాపాడాలని కోరారు. సమావేశంలో డిసిసి అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు ఉస్మాన్ పాల్గొన్నారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణపై ముసాయిదా

- మంత్రుల బృందం



సమావేశంలో పాల్గొన్న బొత్స, జవహర్, సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటుచేసిన నేపథ్యంలో జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాలపై విస్తృత స్థాయిలో సమావేశాలు నిర్వహించి, ఉద్యోగ సంఘాలు, ఇతరులతో కూడా చర్చించి వారి సూచనలు, సలహాలు తీసుకోవడంతోపాటు ముసాయిదాను రూపొందించాలని మంత్రుల బృందం అభిప్రాయపడింది. జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాల్లో చేపట్టాల్సిన మార్పులకు సంబంధించి 1975 రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ అంశాలపై బుధవారం సచివాలయంలో మంత్రుల బృందం సమావేశమైంది. పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి పంపి రాష్ట్రపతి ఉత్తర్వులు పొందాల్సి ఉందన్నారు. ఈ అంశంపై మొదటి సమావేశం కావడంతో మంత్రుల బృందం ప్రాథమికంగా వివిధ అంశాలపై చర్చించడంతోపాటు సమీప రాష్ట్రాల్లో జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాలు ఏ విధంగా అమలవుతుందన్న విషయం అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర సర్వీసెస్‌శాఖ కార్యదర్శి పి భాస్కర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రస్తుతం ఉన్న జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాలపై వివరించారు. 1975 రాష్ట్రపతి ఉత్తర్వులకు సంబంధించిన ముఖ్యాంశాలను వివరించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు, సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పరిస్థితులపై హరీష్‌రావు మాట్లాడటమేంటి? : మంత్రి బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర పరిస్థితితులపై మాట్లాడటానికి తెలంగాణ మంత్రి హరీష్‌రావు ఎవరని, ఆయనకు ఏమి సంబంధం ఉందని వ్యాఖ్యలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ లేదు, రోడ్లు బాగాలేవు, మీరు ఇక్కడ ఓటర్లుగా నమోదు చేసుకుని ఇక్కడే వుండాలి' అని రాష్ట్రం నుంచి వెళ్లిన వలసకూలీలను ఉద్దేశించి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను మంత్రి బొత్స సత్యనారాయణ ఖండించారు. రాష్ట్రాన్ని ఎలా పాలిస్తున్నామో ఇక్కడి ప్రజలకు తెలుసునని, హరీష్‌రావు ముందు తెలంగాణను చూసుకోవాలని సూచించారు.

ధనిక రాష్ట్రాన్ని ఎలా చేసారో అందరికీ తెలుసు : మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

మంత్రి హరీష్‌రావు ముందు తెలంగాణ గురించి మాట్లాడాలని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సూచించారు. తెలంగాణను ఒక ధనిక రాష్ట్రంగా వారి చేతుల్లో పెడితే ఏమి చేశారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. హరీష్‌రావు రాష్ట్రానికి వస్తే ఇక్కడ అభివృద్ధి ఏమిటో చూపిస్తామన్నారు. జిడిపిలో నెంబర్ 1 స్థానంలో ఉన్నామన్నారు. తెలంగాణను అడ్డగోలుగా దోచుకున్నవారు ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడటం తగదని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. హరీష్‌రావు వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు వుందని అన్నారు. హైదరాబాద్‌లో చినుకుపడితే పడవల్లో తిరిగే పరిస్థితి ఉందన్నారు.

డిమాండ్‌కు తగ్గట్లు ముందస్తు ఏర్పాట్లు

- విద్యుత్ కోతలు లేకుండా చర్యలు
- సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేసవిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మెరుగుపరుచుకునేందుకు ప్రణాళికా బద్ధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఇంధనశాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. అవసరాలకు తగ్గట్టు డిమాండ్ మేరకు విద్యుత్‌ను సమకూర్చుకోవాలని, కోతలు విధించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వీల్లేదని అన్నారు. ఇంధనశాఖ అధికారులతో సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

ప్రస్తుత వేసవిలో విద్యుత్ డిమాండ్ ఏ విధంగా ఉంటుంది? పెరిగే అవసరాలను తీర్చేందుకు అమలు చేస్తున్న ముందస్తు ప్రణాళికలు ఏమిటని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. మే వచ్చేసరికి వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గుతుందని, డిమాండ్ మేరకు విద్యుత్‌ను సమకూర్చుకోవచ్చని సిఎస్ అభిప్రాయపడ్డారు. ఈ నెలలో భారీగా విద్యుత్ డిమాండ్ ఉంటుందని, కొరత లేకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు.

ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మాట్లాడుతూ.. వేసవిలో రోజువారీ విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా 240 నుంచి 250 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. రోజువారీ డిమాండ్ 240 మిలియన్ యూనిట్లు దాటితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గతేడాది ఏప్రిల్‌లో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా 212.33 మిలియన్ యూనిట్లు కాగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో 238.40 మిలియన్ యూనిట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఎపి ట్రాన్స్‌కో లోడ్ ఫోర్కాస్టింగ్ సిస్టమ్ ద్వారా రాబోయే రోజు విద్యుత్ డిమాండ్ ఎంత ఉంటుందో ముందురోజే అంచనా వేసి సరఫరాకు అవసరమైన ఏర్పాట్లను ప్రణాళికా బద్ధంగా చేసుకుంటున్నట్లు సిఎస్‌కు విజయానంద్ వివరించారు. ప్రస్తుతం రోజువారీ విద్యుత్ డిమాండ్‌లో 45 శాతం (102 మిలియన్ యూనిట్లు) ఎపి జెన్‌కో ఉత్పత్తి చేసి సరఫరా చేస్తుందన్నారు. మిగిలిన విద్యుత్‌ను మార్కెట్లో కొనుగోలు చేస్తున్నామన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టరు కెవిఎన్ చక్రధరబాబు, ట్రాన్స్‌కో జెఎండి పృథ్వీతేజ్, ఇంధనశాఖ జాయింట్ సెక్రటరీ కుమార్ రెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్, జెన్‌కో డైరెక్టరు బి వెంకటేశులరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణపై ముసాయిదా

- మంత్రుల బృందం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటుచేసిన నేపథ్యంలో జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాలపై విస్తృత స్థాయిలో సమావేశాలు నిర్వహించి, ఉద్యోగ సంఘాలు, ఇతరులతో కూడా చర్చించి వారి సూచనలు, సలహాలు తీసుకోవడంతోపాటు ముసాయిదాను రూపొందించాలని మంత్రుల బృందం అభిప్రాయపడింది. జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాల్లో చేపట్టాల్సిన మార్పులకు సంబంధించి 1975 రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ అంశాలపై బుధవారం సచివాలయంలో మంత్రుల బృందం సమావేశమైంది. పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి పంపి రాష్ట్రపతి ఉత్తర్వులు పొందాల్సి ఉందన్నారు. ఈ అంశంపై మొదటి సమావేశం కావడంతో మంత్రుల బృందం ప్రాథమికంగా వివిధ అంశాలపై చర్చించడంతోపాటు సమీప రాష్ట్రాల్లో జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాలు ఏ విధంగా అమలవుతుందన్న విషయం అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర సర్వీసెస్‌శాఖ కార్యదర్శి పి భాస్కర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రస్తుతం ఉన్న జోనల్ వ్యవస్థ, స్థానికత అంశాలపై వివరించారు. 1975 రాష్ట్రపతి ఉత్తర్వులకు సంబంధించిన ముఖ్యాంశాలను వివరించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు, సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పిలేట్ వ్యవస్థ లేక ఆర్‌టిసి ఉద్యోగుల అవస్థలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అప్పిలేట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పులను సైతం ఉన్నతాధికారులు ఖాతరు చేయడం లేదు. ఏదైనా క్రమశిక్షణ చర్యలకు గురైన ఉద్యోగులు తమ తరుపు వాదన వినిపించుకునేందుకు గతంలో డిపో, రీజినల్, జోనల్ స్థాయిలో అప్పీల్ చేసుకునే వ్యవస్థ ఉండేది. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం అయ్యాక అలాంటి అప్పిలేట్ అథారిటీ లేకుండాపోయింది. మరోవైపు వివిధ కారణాలతో క్రమశిక్షణ చర్యలు కొనసాగుతూనేవున్నాయి. ఇంక్రిమెంట్లు నిలిపేయడం, సస్పెన్షన్‌లు, తొలగింపులు కూడా జరిగాయి. ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం తర్వాత ఇప్పటి వరకు దాదాపు 200 మంది ఉద్యోగులు క్రమశిక్షణ చర్యలకు గురయ్యారు. ఇటు అప్పిలేట్ వ్యవస్థ లేకపోవడం, అటు ప్రభుత్వ ఉద్యోగులు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 60 మంది ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకున్నా.. వాటిని ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. అప్పిలేట్ వ్యవస్థ ఏర్పాటు చేయకుండా ఉద్యోగులను వేధించడం సరైంది కాదని ఆర్‌టిసి ఉద్యోగ, కార్మిక సంఘాలు వాపోతున్నాయి. ఇప్పటికైనా జిల్లాల్లో అప్పిలేట్ అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా విజ్ఞప్తి చేశారు.

వేలిముద్రల క్లోనింగ్‌తో ఖాతాల్లో సొమ్ములు స్వాహా

- ఒక్కడే 126 కేసుల్లో నిందితుడు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

బ్యాంకు ఖాతాదారులకు దాచుకున్న తమ నగదుపై ఆందోళన పెరిగిపోతోంది. కొంతమంది ముఠాగా ఏర్పడి ఖాతాదారుల వేలిముద్రలను సేకరించి, వాటిని ఆధార్‌తో అనుసంధానం చేసి బ్యాంకుల్లోని వారి ఖాతాల్లో ఉన్న నగదును స్వాహా చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇదే అంశంపై రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ (ఎస్‌ఎల్‌సిసి) కూడా సమీక్షించింది. ఇందులో అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులు కూడా ఉన్నట్లు పోలీసు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటికే లక్ష మందికిపైగా ఖాతాదారుల ఆధార్, వేలిముద్రల క్లోనింగ్‌లు ముఠా చేతుల్లో ఉన్నట్లు తేలింది.

ఇటువంటి కేసు ఇటీవల కడప జిల్లాలో బయటపడింది. ఇక్కడ ఆధార్ నెంబరును ఉపయోగించి, లబ్ధిదారుని వేలిముద్రను క్లోనింగ్ ద్వారా సిద్ధంచేసి బ్యాంకు ఖాతాలోని నగదును దొంగిలించినట్లు తేల్చారు. ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా జరిగిన ఈ కేసులో నిందితులు ఇంటర్మీడియరీ పేమెంట్ గేట్‌వే యాప్ ద్వారా వేలిముద్రలను సేకరించినట్లు గుర్తించారు. నిందితులు వేలిముద్రలను క్లోనింగ్ చేసేందుకు అవసరమైన మిషన్లను కూడా సేకరించుకుంటున్నట్లు గుర్తించారు. ఈ విధానం ద్వారా ఖాతాదారులకు వచ్చిన వన్‌టైమ్ పాస్‌వర్డ్‌లను కూడా తెలుసుకుంటున్నట్లు భావిస్తున్నారు. ఈ కేసులో కడప పోలీసులు అరెస్ట్ చేసిన విశ్వకర్మ అనే వ్యక్తి నుంచి మరిన్ని వివరాలు తెలుసుకున్న అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఇతనిది ఉత్తరప్రదేశ్ కావడంతో ఇటువంటి కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠాలు కూడా ఉన్నట్లు తేలిందని రాష్ట్ర స్థాయి అధికారులు చెబుతున్నారు.

వారు పాలిమర్ షీట్, బటర్ పేపర్, ఫొటోషాప్‌లను ఉపయోగిస్తున్నట్లు కూడా కనుగొన్నారు. కడప కేసులో అరెస్టు చేసిన నిందితుడే తెలంగాణలోని 117 కేసుల్లో, ఉత్తరాఖండ్‌లో రెండు కేసుల్లో, జార్ఖండ్‌లో మూడు కేసుల్లో, మధ్యప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్, హర్యానాల్లో ఒక్కో కేసులో ఉన్నట్లు కూడా గుర్తించడం వల్ల ఈ సమస్య దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు తేలింది. నిందితుల్లో కొంత మంది కస్టమర్ సర్వీస్ పాయింట్లను ఏర్పాటుచేసుకుని, ఈ-గవర్నెన్స్, బ్యాంకింగ్ సర్వీస్ పేరుతో వేలిముద్రలు, ఆధార్ కార్డులను సేకరిస్తున్నట్లు తేలింది.

రుషికొండపై అనుమతించిన మేరకే నిర్మాణాలు

- హైకోర్టుకు కేంద్ర కమిటీ నివేదిక



ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం రుషికొండపై రిసార్ట్ ప్రాజెక్టు పునరుద్ధరణ పేరుతో చేస్తున్న పనుల తీరును వివరిస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ (ఎంఒఇఎఫ్) నేతృత్వంలోని జాయింట్ కమిటీ హైకోర్టుకు నివేదిక సమర్పించింది. 'కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) 19,967.97 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, 7 బ్లాకుల్లో రిసార్ట్‌లను నిర్మించేందుకు అనుమతిస్తే పర్యాటకాభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) 15,364 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 4 బ్లాకులను నిర్మించింది. మొత్తం 61 ఎకరాల్లోని 5.18 ఎకరాల్లో నిర్మాణాలకు అనుమతిస్తే అంతకంటే తక్కువ భూమిలోనే నిర్మాణాలు జరిగాయి. ల్యాండ్ స్కేప్, హార్డ్ స్కేప్ కోసం 4.70 ఎకరాల్లో పనులు ప్రారంభించలేదు. కొన్ని బ్లాకుల్ని అదనపు విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఈ విధమైన మార్పులకు అనుగుణంగా చేసే నిర్మాణాలకు అనుమతులు పొందలేదు. చోళ, పల్లవ బ్లాకుల నిర్మాణాన్ని పూర్తిగా ఉపసంహరించింది. నిర్మాణాల నిమిత్తం తవ్విన మట్టిని రుషికొండ దక్షిణం వైపున సిఆర్‌జెడ్-2లో ఎపిటిడిసి వేస్తోంది' అని కమిటీ నివేదికలో పేర్కొంది. యండాడ గ్రామంలోని సర్వే నెంబరు 19 పరిధిలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలు చట్ట వ్యతిరేకంగా జరుగుతున్నాయని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వేర్వేరుగా దాఖలు చేసిన పిల్స్‌ను విచారించిన హైకోర్టు సర్వే నిమిత్తం కమిటీని ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిటీ నివేదికను హైకోర్టుకు బుధవారం అందజేసింది. నివేదికపై తమ వాదనలను తెలియజేసేందుకు గడువు కావాలని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కెఎస్ మూర్తి కోరడంతో విచారణ ఈ నెల 26కు వాయిదా పడింది.

సిబిఐకి బదిలీ చేయలేం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసు దర్యాప్తును సిబిఐకి బదిలీ చేయబోమని హైకోర్టు మరోసారి తేల్చి చెప్పింది. హత్య కేసులన్నిటినీ సిబిఐకి బదిలీ చేయాలంటే ఎలాగని పిటిషనరును ప్రశ్నించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే ఇవ్వాలంటూ దాఖలైన అనుబంధ పిటిషన్‌లో పోలీసులు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలంది. విచారణను 2 వారాలకు వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. తమ కొడుకు సుబ్రమణ్యం హత్య కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలంటూ తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ వేసిన పిటిషన్‌ను గతంలో సింగిల్ జడ్జి కొట్టేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ వేసిన అప్పీల్ పిటిషన్‌లో స్టే ఇచ్చేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది.

వాల్మీకి, బోయలను ఎస్‌టిల్లో చేర్చొద్దు

హైకోర్టులో పిల్ దాఖలు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని బోయ, వాల్మీకి కులాలను ఎస్‌టిల జాబితాలో చేర్చాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈలోగా స్టే ఇవ్వాలని విశాఖపట్నం జిల్లాకు చెందిన న్యాయవాది రొబ్బా నానిబాబు సహా ఆరుగురు పిల్ దాఖలు చేశారు. ఎస్‌టిల్లో 700 కులాలు ఉన్నాయని, వారు 70 శాతానికి కనీస అవసరాలకు దూరంగా ఉన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆరు శాతం రిజర్వేషన్లలో వాల్మీకి, బోయ కులాలను కలిపితే ఎస్‌టిలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి, సామాజిక న్యాయం, సాధికారితశాఖ కార్యదర్శి, జాతీయ ఎస్‌టి కమిషన్ ఛైర్మన్, రాష్ట్ర గిరిజనశాఖ ముఖ్య కార్యదర్శి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్, గిరిజన సలహా కమిటీ ఛైర్మన్‌ను ప్రతివాదులుగా చేశారు.

ఎద్దుల పోటీలకు అనుమతి నిరాకరణ

కర్నూలు జిల్లా, రేమట గ్రామంలో గోకరామయ్య స్వామి ఉరుసు వేడుకలు సందర్భంగా ఎద్దుల పోటీలకు (బండలాగుడు) అనుమతివ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఎద్దుల పోటీలు నిర్వహించడం జంతు హింస కిందకే వస్తుందని చెప్పింది. జంతుహింస చట్ట నిబంధనలకు వ్యతిరేకమన్న ప్రభుత్వ వాదనను ఆమోదించింది. ఉరుసు వేడుకల సందర్భంగా ఆలయం వద్ద ఎద్దుల పోటీలు, పౌరాణిక నాటక ప్రదర్శనకు పోలీసులు అనుమతివ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ కె పెద్ద వెంకన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ బిఎస్ భానుమతి విచారణ జరిపారు. ఎద్దుల పోటీలకు అనుమతి కోరడం సుప్రీం కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకమన్నారు. పౌరాణిక నాటక ప్రదర్శనకు అనుమతిచ్చారు.



స్టీల్‌ప్లాంట్‌లో పర్యటిస్తున్న సింగరేణి అధికారుల బృందం

ఏ పోరాటానికైనా సిద్ధం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు ఏ పోరాటానికైనా సిద్ధమేనని పోరాట కమిటీ చైర్మన్ ఎం.రాజశేఖర్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంనాటికి 790వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎల్‌ఎంఎం, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి రాజశేఖర్ మాట్లాడుతూ.. ఈ నెల 15న కూర్మన్నపాలెం నుంచి సింహాచలం వరకు చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సింగరేణి అధికారుల బృందం విశాఖ స్టీల్ ప్లాంట్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌లో బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు ముందుకు రావడాన్ని హర్షించారు.

స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించిన సింగరేణి బృందం

విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్యాటరీ -5 విభాగంలో సింగరేణి కాలరీస్ అధికారులు పర్యటించారు. బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు సాధ్యాసాధ్యాలపై చర్చిస్తున్నట్లు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న ఉత్పత్తి, పరికరాల పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించుకుంటున్నారు. సింగరేణి అధికారులతోపాటు స్టీల్‌ప్లాంట్ ఇడి ఇన్‌ఛార్జి స్వామి, సిఐసిసిపి విభాగ అధికారులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పనిచేసిన మాకినేని

- వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గొప్ప సిద్ధాంత కర్త, అణగారిన పేదల పక్షాన తన జీవితాంతం పనిచేసిన వ్యక్తి మాకినేని బసవపున్నయ్య అని ఎంబివికె ట్రస్టు ఛైర్మన్ పి మధు అన్నారు. మాకినేని బసవపున్నయ్య 31వ వర్ధంతి సభ బుధవారం ఎంబివికె వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి మధు, సీతారం, బి తులసీదాస్, బిఆర్ తులసీరావు, పి మురళీకృష్ణ తదితరులు ఎంబి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. బసవపున్నయ్య ఆస్తులన్నీ జాతీయోద్యమ కాలంలోనే ప్రజల కోసం ఖర్చు చేశారని తెలిపారు. 1936లోనే విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా రెండు ముఖ్యమైన కర్తవ్యాలకు పునరంకితం కావాలన్నారు. అప్పట్లో కందుకూరి రచనలను సేకరించి వాటిని అధ్యయనం చేసి సంస్కరణ ఉద్యమాల ప్రాధాన్యత, అందుకోసం అభ్యుదయవాదులు చేయాల్సిన కర్తవ్యాలను వివరించారని తెలిపారు. బసవపున్నయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం కోసం విజ్ఞాన కేంద్రం వెనుకబడిన తరగతుల కోసం కంప్యూటర్ శిక్షణ, ఉచిత కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తోందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రాభివృద్ధి పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన ప్రాంతాలకు రావాల్సిన నిధులు రావడం లేదని అన్నారు. రైతాంగం దళితులు, గిరిజనులు తమ హక్కుల సాధన కోసం ప్రజా సంఘాలు ప్రచారం నిర్వహిస్తున్నాయని తెలిపారు. దీనిలో ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు. పి మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఎంబి స్ఫూర్తితో సాంస్కృతిక రంగంలో విశేష కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మే 19వ తేదీన సుందరయ్య వర్ధంతి సందర్భంగా నిత్యజీవితంలో వైజ్ఞానిక స్పృహ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, రామన్న, యు.వి.రామరాజు, గుండు నారాయణరావు, టి.క్రాంతికిరణ్, డి.వి.రాజు, అజయ్‌కుమార్, పి.విజయ పాల్గొన్నారు.




హైకోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తిరుపతిలో న్యాయవాదిపై అక్రమ కేసులు

- పోలీసుల తీరును నిరసిస్తూ హైకోర్టు న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

తిరుపతి జిల్లా బాలయ్యపల్లిలో హైకోర్టు న్యాయవాదిపై పోలీసులు అనుచితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ హైకోర్టు ఆవరణ వెలుపల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం నిరసన తెలిపారు. న్యాయవాదిపై 353, 506 సెక్షన్‌ల కింద అక్రమ కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అడ్వకేట్ గుండుబోయిన వెంకటేశ్వర్లు మంగళవారం వెంకటగిరివైపు నుంచి బాలాయపల్లి మండలం చుట్టి గ్రామం వైపు వెళ్తుండగా బాలాయపల్లి వద్ద పోలీసులు వాహనాన్ని అడ్డుకుని అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా అక్రమ కేసులు బనాయించిన విషయం తెలిసిందే. పోలీసుల తీరుపై హైకోర్టు న్యాయవాదులు మాట్లాడుతూ.. గతంలో కాకినాడలో న్యాయవాదిపై దాడి జరిగిందని తెలిపారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ పార్లమెంట్‌లో చట్టం కాలేదన్నారు. ఢిల్లీ, రాజస్థాన్‌లో న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు ఆ రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి తెలిపాయన్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో న్యాయవాదులు నర్రా శ్రీనివాసరావు, గొడవర్తి కిరణ్‌బాబు, ఎం.నరేంద్రబాబు, సిహెచ్ గోపాలరాజు, తిరుపతి న్యాయవాది బి.ఉషాకిరణ్ పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

బైపాస్ కోసం ఎమ్మెల్యే దీక్ష

- నిర్మాణ సంస్థ హామీతో విరమణ

ప్రజాశక్తి - పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

బైపాస్ సమస్యను పరిష్కరించేంత వరకూ భారీ వాహనాలను పిడుగురాళ్ల పట్టణంలోకి అనుమతించబోమని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. బైపాస్ నిర్మాణాన్ని డిమాండ్ చేస్తూ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువులోని టోల్‌ప్లాజా వద్ద బుధవారం ఆయన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలో జటిలమైన ట్రాఫిక్ సమస్య తీరాలంటే బైపాస్ రోడ్డు పూర్తవ్వాల్సి ఉందని తెలిపారు. దీనిపై గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తాను ఎమ్మెల్యే అయ్యాక సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి అన్ని అనుమతులూ తెప్పించానని అన్నారు. అయినా పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్ట్ సంస్థ అయిన క్యూబ్ హైవేస్ లిమిటెడ్ నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఏప్రిల్ 14వ తేదీ లోపు పూర్తి చేస్తామని కాంట్రాక్ట్ సంస్థ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న క్యూబ్ హైవేస్ సంస్థ ఎండి డాక్టర్ సుధాకర్‌రెడ్డి దీక్షా శిబిరం వద్దకు వచ్చారు. జూన్ 30వ తేదీలోపు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే తన దీక్షను విరమించారు. ఈ సారైనా మాట నిలబెట్టుకోకుంటే నిరవధిక దీక్ష చేస్తానని ఎమ్మెల్యే హెచ్చరించారు.

కమ్యూనిస్ట్ యోధుడు మాకినేని బసవ పున్నయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
కమ్యూనిస్టు యోధుడు మాకినేని బసవ పున్నయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రెడ్డి శంకర్రావు అన్నారు. బసవ పున్నయ్య వర్థంఇ సందర్భంగా బుధవారం ఎల్‌బిజి భవనంలయాయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రాజ్యసభ సభ్యుడిగా, కమ్యూనిస్టు నేతగా, తెలంగాణ సాయుధ పోరాట యోధుడిగా ,ఆయన పీడితిప్రజల కోసం తనజీవితాన్ని అంకితం చేశాడని అన్నారు. తన జీవితాతం పేదలు,కష్ట జీవులు అభ్యున్నతి కోసం పోరు నడిపిన కమ్యూనిస్టు యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి రమణ, నాయకులు పి.రమణమ్మ, వి.లక్ష్మి,వెంకటేష్, బి.రమణ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స జయనగరం రాక

ప్రజాశక్తి-విజయనగరం
రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం జిల్లాకు వస్తున్నారు. విద్యా శాఖ మంత్రి గురువారం సాయంత్రం 8 గంటలకు నగరానికి చేరుకుంటారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని బాలాజీ జంక్షన్ వద్ద డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులు అర్పిస్తారు. 11 గంటలకు గుర్ల మండలం పల్లి గంద్రేడు లో గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 4 గంటలకు మెరకముడిదాం మండలం గుంటపల్లి లో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్ నెస్ కేంద్రం భవనాలను ప్రారంభిస్తారు.

నూతన ఆలోచనలు కార్యరూపం దాల్చాలి

- జెఎన్‌టియు విసి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)
విద్యార్థులు చేసే నూతన ఆలోచనలు ఎప్పుడైతే కార్యరూపం దాల్చుతాయో వారి జీవిత లక్ష్యాలను సులువుగా చేరుకునే అవకాశాలు ఉంటాయని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ రంగ జనార్ధన అన్నారు. బుధవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని తరంగ్-2023 పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్టీయూ విసి రంగ జనార్ధన మాట్లాడుతూ జేఎన్టీయూ పరిధిలోని 9 జిల్లాలలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో విద్యార్థులకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి అనుగుణంగా రెగ్యులేషన్-2020ని జేఎన్టీయూ ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సులోని సబ్జెక్టులతో పాటు అదనపు కోర్సులను ఎంచుకొని వాటిలోనూ ప్రావీణ్యం చెందే అవకాశం దీనిద్వారా కలుగుతుందన్నారు. ఇండియా ఇప్పటికీ అభివద్ధి చెందుతున్న దేశంగానే పిలవబడుతోందని, దీనికి కారణం మ్యాథమెటిక్స్ లో ఎంతో ప్రావీణ్యం కలిగిన మనం మన ఆలోచనలకు కార్యరూపం దాల్చకపోవడమే ప్రధానమైన కారణమన్నారు. మన రెండు తెలుగు రాష్ట్రాలు ఆస్కార్ రావడంతో చాలా సంతోషంగా ఉన్నాయని, నాటు నాటు పాటలో నాటి స్వాతంత్ర్య పోరాటం రోజుల్లో మన దేశ ప్రజలు పడిన కష్టాలను అక్షరాల రూపంలో రచయిత చంద్రబోస్ అందించారని ఈ ఆస్కార్ అవార్డు రావడానికి ఇదే కారణమన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి రానున్న నాలుగేళ్లలో శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అనేక మార్పులు చేస్తున్నామన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి ఎంతో ముందు చూపుతో కళాశాలలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు.కళాశాల క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. సినీ నేపద్య గాయకులు సూధన్స్, శతిక పాల్గొని వారి పాటలతో విద్యార్థులను అలరింపజేశారు. డైరెక్టర్ మన్నెం వెంకటరామిరెడ్డి, కళాశాల సెక్రెటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ జయచంద్ర పాల్గొన్నారు.



విశాఖ ఉక్కుపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

- ఎఐసిసి సభ్యులు కొలనుకొండ శివాజి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, ప్రైవేటీకరణ చేయకూడదని, అటువంటి ప్రయత్నాలను అడ్డుకునేదాని కోసం ప్రజల డిమాండ్ మేరకు ఎపి ప్రభుత్వం తక్షణమే అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని ఎఐసిసి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ బిసి నాయకులు కొలనుకొండ శివాజి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటీకరణ కోసం జరుగుతున్న ప్రక్రియను నిలిపేసే ప్రయత్నం చేయకుండా.. రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేశానికి వజ్రాభరణమైన విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం కానీయబోమని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొచ్చి దాన్ని కాపాడుకుంటామని ప్రత్యేక హోదా ఇస్తానన్న రాహుల్ గాంధీతోనే అది సాధ్యమని, ఆయనకు మద్దతు ఇవ్వాలని రాష్ట్ర ప్రజలను కోరారు. లాభాల్లో ఉన్న స్టీల్ ప్లాంటును కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా నష్టాలబాట పట్టించిందని పేర్కొన్నారు. దీనిపై వైసిపి, టిడిపి, జనసేన నోరెత్తడం లేదన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి డిజైన్ మార్పు చేయాలి

- ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌ను కలిసిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ డిజైన్ మార్పు చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం నాయకులు బుధవారం రాజమండ్రిలో పోలవరం ఎడమ కాలువ సూపరిండెంట్ ఇంజనీర్ ఏసుబాబును కలిసి సమస్యను వివరించారు. కొద్దిరోజుల క్రితం నీటిపారుదలశాఖా మంత్రి అంబటి రాంబాబును కలిసి రైతు సంఘం నాయకులు సమస్యను వివరించగా ఇరిగేషన్ అధికారులను కలవాలని ఆయన సూచించారు. ఈనేపథ్యంలో ఎస్ఇని కలిసి కాలువ డిజైన్ మార్పు గురించి వివరించారు. స్పందించిన ఆయన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచిస్తానని తెలిపారు. అధికారులను కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, సుజల స్రవంతి పోరాట కమిటీ గౌరవాధ్యక్షులు బోధంకి గౌరినాయుడు, పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించని కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
జిల్లాలోని పలు విద్యాసంస్థలు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ యధేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నాయని, వెంటనే వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు.
బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డి. రాముతో కలిసి మాట్లాడారు. ఒక పక్క ఎండలు మండిపోతుంటే విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒంటి పూట బడులు నిర్వహించకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు అనధికారకంగా తరగతులు నిర్వహిస్తున్నారని, వీటిపై అర్ఐఒకు తెలిపినా మెతక వైఖరితో వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేయడంతో ప్రతి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా పదుల సంఖ్యలోవిద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇటువంటి కళాశాలల్లో చేర్పించకుండా కాపాడుకోవాలని కోరారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని యెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు డి. దీవెన తదితరులు పాల్గొన్నారు.

ఆకలి మరణాలు సంభవించకుండా చర్యలు

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి - రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)
జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం పేదల ఆకలి మరణాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్, 11 మండలాలకు చెందిన సివిల్ సప్లై, విద్యశాఖ అధికారులు, ఐసిడిఎస్ సిడిపిఓలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లతో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సమక్షంలో విజయ ప్రతాప్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిర్వహిస్తున్న భోజన పథకాలకు అన్ని నిబంధనల ప్రకారం మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులు ఇతర జిల్లాలకు వెళ్లినప్పుడు ఆన్లైన్ ద్వారా ఎక్కడైనా రేషన్ తీసుకొని వెసులుబాటు ఉందని తెలిపారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలో సమర్పించాలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే సరుకులు తాజాగా ఉండాలన్నారు. ఈ ఫుడ్ కమిషన్ ద్వారా అవినీతి లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.
మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రం, వివిధ రకాలైన వసతి గృహాలకు సరఫరా చేసే గుడ్లు 45 నుండి 50 గ్రాముల బరువు ఉండాలని సూచించారు. వసతి గృహ విద్యార్థులకు వారానికి రెండు రోజులు 80 గ్రాముల తాజా కోడి మాంసం పెట్టాలన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎక్కడైనా మరుగుదొడ్లకు సంబంధించిన డోర్లు రిపేర్లు ఉంటే వెంటనే చేయించాలన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై డిప్యూటీ డైరెక్టర్ పి సురేష్, జిల్లా అధికారి ఆర్.శివ ప్రసాద్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, డిఎంఓ గణేష్ కుమార్, ఎడిఎంహెచ్ఓ డాక్టర్ అనూష, ఎఎంఓ సి.శ్రీహరి, జిసిసి డివిజనల్ మేనేజర్ జి పార్వతీశ్వరరావు, సిడిపివోలు సంధ్యారాణి. ప్రసన్నకుమారి, ఎంఇఒలు ఎం.సత్యనారాయణ దొర, మల్లేశ్వరరావు, ఏటిడబ్ల్యూఓ రామ తులసి, జిసిసి మేనేజర్లు ముర్ల నాగరాజు రెడ్డి, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
నగర ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. బుధవారం 32వ డివిజన్ లోని తోటపాలెం మౌర్య రెసిడెన్సీ గార్డెన్స్ స్థానికులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అపార్టుమెంట్ వాసులు డిప్యూటీ స్పీకర్ దృష్టికి తీసుకుని వచ్చారు. స్పందించిన ఆయన అక్కడున్న సిబ్బందికి సమస్యల పరిష్కారానికి తగు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వీధి దీపాలను తక్షణమే ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులు ఆదేశించారు. రహదారి సౌకర్యాన్ని కల్పించాలని, ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని ప్రజారోగ్యధికారి డాక్టర్ సత్యనారాయణకు ఆదేశించారు. అనంతరం అపార్ట్మెంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. సకాలంలో పన్నులు చెల్లించే కాలనీవాసులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం పైన, పాలక పక్షాల పైన ఉంటుందని అన్నారు. పనిచేసే వారికి, నిత్యం అందుబాటులో ఉన్న వారినే ప్రజలు గెలిపించాలని కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు ఎంఎస్ఎన్ రాజు, భోగాపురపు రవిచంద్ర, మారెం బాల బ్రహ్మారెడ్డి, రెడ్డి గురుమూర్తి, బొద్దాన అప్పారావు, మౌర్య గార్డెన్ అధ్యక్షులు వి.వి.ప్రసాద్, కార్యదర్శి మోహన్ రావు, నగరపాలక సంస్థ డిఇ అప్పారావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం
నగరంలోని 43వ డివిజన్లో రూ.26.05 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభోత్సవాలు చేశారు. పాల్ నగర్ ప్రాంతంలో రహదారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో జరుగుతున్న అభివృద్ధి గతంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ నాయకులు వంతరం సురేష్ పాల్గొన్నారు.

1998 డిఎస్‌సి పోస్టుల భర్తీకి కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
1998 డిఎస్‌సి పోస్టుల భర్తీకి బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. క్వాలిఫై అయిన 504 మందికి గాను ఖాళీగా ఉన్న 489 పోస్టులకు కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేసే ప్రక్రియను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా భర్తీకి నోచుకోని పోస్టులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చారని తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి , రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో ఈ అవకాశం కలిగిన మీరంతా సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్ కుమార్, డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్, డిఇఒ లింగేశ్వర్ రెడ్డి, అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

5,738 మందికి ఇబిసి నేస్తం

రూ.8.6 కోట్ల చెక్కును అందజేసిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం
జిల్లాలోని 5,738 మంది ఆర్థికంగా వెనుకబడిన, అగ్రవర్ణాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాల వయసు గల మహిళలకు, రెండో విడత ఇబిసి నేస్తం విడుదల అయ్యింది. ఈ పథకంలో భాగంగా ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున మొత్తం రూ.860.70 లక్షల విలువైన చెక్కును లబ్దిదారులకు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అందజేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ప్రకాశం జిల్లా మార్కాపురంలో రెండో విడత ఇబిసి నేస్తం కార్యక్రమాన్ని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించిన అనంతరం, మహిళలకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, ఎపి స్టేట్ రెడ్డిక వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి, రాష్ట్ర బిసి యాత వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గొంప అప్పలరాజు, ఎపి నాగవంశం వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, బిసి కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల : భువనేశ్వర్‌కు చెందిన శివం కాండెవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బుధవారం ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందించింది. ఈ సంస్థ తరఫున ప్రతినిధి వై.రాఘవేంద్ర ఈ మేరకు విరాళం డిడిని తిరుపతిలోని పరిపాలన భవనంలో టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు.

ఢిల్లీకి చేరుకున్న సచిన్‌పైలెట్

న్యూఢిల్లీ : రాజస్తాన్ కాంగ్రెస్‌కు చెందిన నాయకులు సచిన్‌పైలెట్ బుధవారం ఢిల్లీ చేరుకున్నారు. బిజెపికి చెందిన వసుంధరా రాజె హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలంటూ సొంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా జైపూర్‌లో సచిన్ మంగళవారం నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ దీక్ష తరువాత కొన్ని గంటల్లోనే సచిన్ ఢిల్లీకి చేరుకోవడం విశేషం. ఈ దీక్షను పార్టీ ధిక్కార చర్యగా భావిస్తామని హెచ్చరించినప్పటికీ.. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఉదయం 11 గంటల నుండి 4 గంటల వరకు నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు సంబంధించిన బ్యానర్‌లో ఎక్కడా కూడా కాంగ్రెస్ పార్టీ ప్రస్తావన లేకపోవడం గమనార్హం. దీక్ష అనంతరం సచిన్ మాట్లాడుతూ.. అవినీతి, ఆర్థిక అవతవకలపై రాహుల్‌గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు ఏకమయ్యాయని, తన ఉద్యమం వారి పోరాటాన్ని మరింత ముందుకు తీసుకువెళుతుందని అన్నారు. బిజెపి పాలనలో జరిగిన అవినీతిపై రాజస్తాన్ ముఖ్యమంత్రి గెహ్లాట్‌కు రెండు లేఖలు రాశానని, కానీ ఆయన స్పందించలేదని అన్నారు. గెహ్లాట్ తన నాలుగేళ్ల పాలనలో అవినీతిపై చర్యలు తీసుకోలేకపోయారని మండిపడ్డారు. అవినీతికి వ్యతిరేకంగా తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

పిడుగుపాటుతో గిరిజనుడు మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా)
మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ పిడుగుల శబ్దాలతో కూడిన భారీ కారణంగా ఓ గిరిజన యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు పరిస్థితి విషమంగా ఉంది. మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ పిడుగుల వర్షం కురిసింది. ఆ సమయంలో పశువుల మేతకు తీసుకెళ్లిన ఖండ్రుమ్ పంచాయతీ ఉజ్జంగి గ్రామంలోని పాంగి జోయో (28) అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు దొంబుకు తీవ్ర గాయలై పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో అరకులోయ ఏరియా హాస్పిటల్ కు తరలించారు.

సంపాదకీయం

ఉక్రెయిన్‌లో అమెరికా దుర్నీతి

వారం రోజుల క్రితం ట్విట్టర్, టెలిగ్రామ్‌లలో ప్రత్యక్షమైన పెంటగాన్ రహస్య పత్రాలు అమెరికా అసలు స్వరూపాన్ని మరోసారి నగ్నంగా బయటపెట్టాయి. 'టాప్ సీక్రెట్' అని మార్కు చేసిన ఈ పత్రాలు ఉక్రెయిన్ మిలిటరీ ఘర్షణలో అమెరికా పోషిస్తున్న దుర్మార్గమైన పాత్రను కళ్లకు కట్టినట్టు చూపాయి. ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారం కనుగొనకుండా అతి పెద్ద అడ్డంకి అమెరికాయేనని తేల్చి చెప్పాయి. రష్యా, ఉక్రెయిన్ ఘర్షణకు సంబంధించి 2022 ఫిబ్రవరి నుంచి అమెరికన్ సామ్రాజ్యవాదం, దాని అధీనంలోని ప్రచార బాకాలు ఊదరగొడుతున్నదంతా పచ్చి అబద్ధాలని తేలిపోయింది. ఉక్రెయిన్ యుద్ధంలో 'నాటో ప్రమేయం లేదు', 'ఇది ఎలాంటి కవ్వింపు లేకుండా జరుగుతున్న యుద్ధం', 'అమెరికన్ సైనికులు ఉక్రెయిన్‌లో ఒక్కరు కూడా లేరు'. 'విజయం అతి చేరువలో ఉంది'...వంటి డైలాగులతో వైట్‌హౌస్ అధినేత బైడెన్ అమెరికన్లను, మిగతా ప్రపంచ ప్రజలను ఎలా తప్పుదారి పట్టించినదీ పెంటగాన్ పత్రాలు తిరుగులేని రీతిలో రుజువు చేశాయి. నాటో జోక్యం ఏ స్థాయిలో ఉందో, ఉక్రెయిన్ ప్రభుత్వం సైనికంగా ఎలాంటి గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నదో, 150 అమెరికన్, నాటో బలగాలు ఉక్రెయిన్‌లో ఎలా తిష్ట వేశాయో ఈ పత్రాలు సోదాహరణంగా వివరించాయి.

ఉక్రెయిన్ సైన్యం, రష్యన్ దళాలపై పైచేయి సాధించిందని, ఈ యుద్ధంలో 2 లక్షల మంది దాకా సైనికులను రష్యా కోల్పోయిందని ఫిబ్రవరి తొలి వారంలో 'న్యూయార్క్ టైమ్స్', 'వాషింగ్టన్ పోస్ట్' వంటి పత్రికలు ప్రచురించిన కథనాలు ఎంత బూటకమో ఈ పత్రాలు తెలియజేస్తున్నాయి. అమెరికా తన ప్రపంచాధిపత్యం కోసం ఉక్రెయిన్ యుద్ధాన్ని ఒక పాచికగా వాడుకుంటుందన్నది దాచేస్తే దాగని సత్యం. రష్యా దురాక్రమణకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు మద్దతిస్తున్నామని చెప్పడం అమెరికా మోసకారితనాన్ని తెలియజేస్తోంది. మీరు ఉక్రెయిన్ వైపా? రష్యా వైపా? అన్న విభజన తీసుకురావడం ద్వారా ప్రచ్ఛన్న యుద్ధాన్ని మళ్లీ రుద్దాలని అది చూస్తోంది. అవతలి పక్షాన్ని ప్రపంచ శాంతికి ప్రమాదకరమైన శత్రువుగా చూపడం ద్వారా నాటో, ఐరోపా దేశాలను తనవైపు ఉండేలా చూసుకుంది. ప్రపంచాన్ని రెండు శిబిరాలుగా చీల్చ గలిగితే తన ఆధిపత్యాన్ని సులువుగా కొనసాగించుకోవచ్చన్నది అగ్ర రాజ్యం దుర్నీతి. నయా ఉదారవాద విధానాల ఫలితంగా ముసురుకున్న ప్రపంచ ఆర్థిక మాంద్యం, కోవిడ్ మహమ్మారి సృష్టించిన విధ్వంసం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇలా ఒకటి తరువాత ఒకటి రావడంతో ఆర్థిక మాంద్యం నుంచి ఇప్పట్లో అమెరికా బయటపడే సూచనలు కానరావడం లేదు.

మరో వైపు ప్రపంచ పరిణామాలు బహుళధ్రువ ప్రపంచం వైపుగా సాగుతండడంతో అగ్రరాజ్యం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం సరికొత్త పన్నాగం పన్నింది. ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేలా చూడడం అందులో ఒకటి. యుద్ధం ఎంత కాలం కొనసాగితే ఆయుధాలు అంతగా అమ్ముకుని ప్రస్తుత మాంద్యం నుంచి గట్టెక్కవచ్చని అమెరికా ఆశ. ఉక్రెయిన్‌కు ఆర్థిక, మిలిటరీ సాయం అందించడం వల్ల ఐరోపా ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యే పరిస్థితి వస్తుంది. దానిని కూడా తనకు అనుకూలంగా మార్చుకోవాలని అమెరికా చూస్తున్నది. అందుకే ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారం చూపేందుకు చైనా వంటి దేశాలు చేస్తున్న యత్నాలను అది అడ్డుకుంటున్నది. ప్రపంచ శాంతికి, అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగించే అమెరికా కుతంత్రాలకు అడ్డుకట్టవేయాలి. ఇందుకుగాను రష్యా- ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారం కనుగొనేందుకు ఐరోపాతో సహా ప్రపంచ దేశాలన్నీ ఐక్యంగా కృషి చేయాలి. ఉక్రెయిన్, రష్యాలను రెండింటిని చర్చల టేబిల్ దగ్గరకు తీసుకొచ్చి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలి. అమెరికా దుర్నీతికి చెక్ పెట్టాలి.

మహనీయుల మాట



ఎదుటివారు నీ మాటలను శంకించినా...
నీ పనిని చూసి నమ్ముతారు.
పనికి వున్న విలువ అది.

\- గోర్కీ



విశ్లేషణ

ప్రైవేటీకరణతో సామాజిక న్యాయానికి విఘాతం



> పర్మినెంట్ పనులకు పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు భిన్నంగా పర్మినెంట్ పనుల్లో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు జరుగుతున్నాయి. దీనివల్ల రిజర్వేషన్ వ్యవస్థ కనుమరుగు అవుతుంది. సామాజిక న్యాయం అందని ద్రాక్షగా మారిపోతుంది. ఉత్పత్తి అయిన సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం అవుతుంది. ప్రశ్నించే తత్వాన్ని కోల్పోతాం. ఇక ప్రైవేట్ రంగంలో ఎలాంటి రిజర్వేషన్లూ అమలు కావు.



నక్కా వెంకటేశ్వర్లు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి అక్షరాస్యత 12 శాతం మాత్రమే. ప్రాచీన కాలం అద్భుతమైనదని గొప్పగా చెప్పుకున్న తర్వాత కూడా భారతదేశంలో అక్షరాస్యత శాతం అత్యంత స్వల్పంగానే వుంది. అంటే ఏదో ఒకటి రెండు కులాలకు తప్ప మిగిలిన కులాలు చదువుకోకుండా, అణగారిన వర్గాలు చైతన్యం పొందకుండా విద్యను దూరం చేసే అత్యంత కర్కశ విధానాలు అమలులో వున్నాయనే విషయం అర్థం చేసుకోవాలి. భారత దేశంలో కులం పేరుతో కొందరికి విద్య, విజ్ఞానం, భూమి, ఆస్తులు నిరాకరించబడ్డాయి. రాజకీయాలకు దూరంగా ఉంచారు. కుల వివక్ష కారణంగా ఊరికి దూరంగా కనీస సదుపాయాలు లేని దుర్భర జీవితం గడపాల్సి వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చాక ఈ కులాలకు అందరితో సమానంగా అవకాశాలు లభించేందుకు... విద్య, రాజకీయ రంగాల్లో సామాజిక న్యాయం సాధించేందుకు... రాజ్యాంగంలోని ఆర్టికల్ 330, 332, 243(డి)లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించారు. ఆర్టికల్ 15(4), 16(4), 335లో విద్య, ఉద్యోగాలలో, పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. స్వతంత్రం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత రాజ్యాంగం అమలు తీరు, రిజర్వేషన్లపై చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయం పరిస్థితి ఎలా ఉంది?

సామాజిక న్యాయం

అణగారిన వర్గాలకు ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగాలలో సమాన అవకాశాలను కల్పించి భాగస్వాములను చేయటం ద్వారా సమజాభివృద్ధి చెందుతుంది. దీనికోసం ఎందరో కృషి చేశారు. ఏప్రిల్ 5 బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, ఏప్రిల్ 11 జ్యోతిబా పూలే జయంతి, ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి. వీరు ముగ్గురు దేశంలో ఉన్న అణగారిన వర్గాలకు సామాజిక వివక్షతను రూపుమాపటం కోసం తమ జీవితాంతం కృషి చేసినటువంటి వారు. వీరి బాట లోనే పెరియార్ రామస్వామి, శ్రీ నారాయణగురు, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి మహోన్నత వ్యక్తులు...భారతదేశంలో సామాజిక న్యాయాన్ని సాధించకుండా, అందరికీ సమాన అవకాశాలు ఇవ్వకుండా భారత స్వాతంత్ర్య ఉద్యమ ఫలాలు అందరికీ అందుబాటులోకి రావని విశ్వసించారు. జీవితాంతం సామాజిక న్యాయ సాధన కోసం పోరాడారు. తమ జీవితాన్ని సంఘసంస్కరణ ఉద్యమాలకు అంకితం చేశారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత 1950 నుంచి 1990 వరకు భారతదేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అమలు చేయబడింది. ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే బిహెచ్‌ఇఎల్, ఉక్కు కర్మాగారాలు, బిఎస్‌ఎన్‌ఎల్, రైల్వేలు, పోస్టల్, బీమా రంగాలన్నింటిని ప్రభుత్వ రంగంలో స్థాపించారు. యుజిసి అనుబంధంగా యూనివర్శిటీలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలు ప్రభుత్వ పాఠశాలలు అన్నిటినీ ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని నెలకొల్పింది. రిజర్వేషన్లు అమలు జరిగాయి. సామాజికంగా వెనకబడిన కులాలు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు పొందడానికివి ఉపయోగపడ్డాయి. రాజకీయాలలో రిజర్వేషన్ల వల్ల కొద్దిమందైనా చట్టసభలలోకి అడుగెట్టగలిగారు.

ఆర్థిక సంస్కరణలు

1991 నాటికి భారత దేశంలో విదేశీ మారక నిల్వలు తగ్గిపోవటం, బంగారాన్ని కుదవ పెట్టుకోవాల్సి రావడం, అప్పులు పెరిగిపోవడం వల్ల ఏర్పడిన ఆర్థిక మాంద్యాన్ని నివారించడానికి విరుగుడుగా ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు ఆర్థిక సంస్కరణలను అమలు చేశారు. దీనికి ఏ పేరు పెట్టినా సేవా రంగం, ఉత్పత్తి రంగం నుండి ప్రభుత్వం తప్పుకొని మార్కెట్ శక్తులకు అప్పగించడం ప్రధాన లక్ష్యంగా ఈ సంస్కరణ అమలు చేస్తున్నారు. మార్కెట్ శక్తులే సమస్తాన్ని నిర్దేశించాలని, ప్రభుత్వ జోక్యం తక్కువగా ఉండాలని, బడా కార్పొరేట్లకు అనుకూలంగా, సమాజ సంపద అంతటిని మళ్లించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారు. దీని పర్యవసానంగా... ప్రభుత్వ రంగం తగ్గిపోతున్నది. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు వారికి అప్పగించటం, అమ్మివేయటం జరుగుతున్నది. ప్రభుత్వాలు డిజిన్వెస్ట్‌మెంట్ శాఖను కూడా ఏర్పాటు చేయడం ఈ సంస్కరణలకు పరాకాష్ట. బిహెచ్‌ఇఎల్ అమ్మివేస్తున్నారు. ఓడ, విమానయానాలను ప్రవేటీకరిస్తున్నారు. ముడి సరుకు అందనివ్వకుండా చేసి ఉక్కు పరిశ్రమలను ప్రైవేటీకరిస్తున్నారు. 4జి, 5జి సదుపాయాన్ని బిఎస్‌ఎన్‌ఎల్ కి కల్పించకుండా ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పచెబుతున్నారు. ఎల్‌ఐసిలో ప్రభుత్వ రంగ వాటాలను తగ్గించివేస్తున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేస్తూ ప్రైవేటు బ్యాంకులను ప్రోత్సహిస్తున్నారు. పేదలు ఉపయోగించుకునే ప్యాసింజర్ రైళ్ళను తగ్గించి రైల్వే ప్రైవేటీకరణ దిశగా ముందుకు వెళుతున్నారు. విద్యుత్ ప్రవేటీకరణ అయిపోయింది. ప్రభుత్వ యూనివర్సిటీల స్థానంలో డీమ్డ్ యూనివర్సిటీలు వచ్చేశాయి. డిగ్రీ, జూనియర్ కాలేజీలు ప్రభుత్వ రంగం నుంచి కనుమరుగు అవుతున్నాయి. ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలో విలీనం పేరుతో, విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను కూడా కుదించేస్తున్నారు. దీనివల్ల కొన్ని వేల ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా మారుతున్నాయి.

ప్రైవేటీకరణ అయితే...

ఇలా ప్రైవేటీకరణ అయితే, రిజర్వేషన్ల అమలు సాధ్యమయ్యేది లేదు. ఆ మాటకొస్తే సామాజికంగా వెనకబడిన వారికే కాదు, మిగిలిన ఉన్నత వర్గాలు, కులాల వారికి కూడా ప్రభుత్వ ఉద్యోగాలు దొరకవు. దీని స్థానంలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల సంఖ్య పెరిగిపోతుంది. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ విభాగాల్లో 6 లక్షలకు పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి ఎలాంటి రిజర్వేషన్లు, సామాజిక న్యాయం వర్తించదు. మండల విద్యావనరుల కేంద్రంలో సైతం సమగ్ర శిక్షణ కింద 3000 పైచిలుకు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ట్రైబల్ ప్రాంతంలో 1700 మంది, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో 1200 మంది సీఆర్టీలు గా పనిచేస్తున్నారు. ప్రభుత్వ పర్మినెంట్ ఉద్యోగుల కంటే కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య ఎక్కువ. కె.జి.బి.వి లలో మొత్తం కాంట్రాక్టు ఉద్యోగులే. వీరికి మినిమమ్ టైమ్ స్కేల్ కూడా అమలు కావడం లేదు. పాఠశాల విద్యా రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మినిమమ్ టైమ్ టీచర్ల వ్యవస్థ కూడా ఏర్పడుతున్నది. వీటన్నిటిలోనూ ఎక్కడ రాజ్యాంగం నిర్దేశించిన నియమాలు, పని గంటలు, కనీస వేతనాలు ఉండవు.

ఇక్కడ ఏ రిజర్వేషన్లూ అమలు కావు. కాంట్రాక్టర్ ఇష్టాయిష్టాలు మీద, ప్రైవేట్ సంస్థల కోపతాపాల మీదే వీళ్ళ ఉద్యోగ భద్రత, జీతాలకు భరోసా ఆధారపడి ఉంటుంది. రియల్ ఎస్టేట్, సెజ్‌లు, ప్రైవేట్ పరిశ్రమలకు భూమిని కేటాయించడం వల్ల భూకేంద్రీకరణ జరిగి వ్యవసాయ పని దినాలు తగ్గుతాయి. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో ఉపాధి కోల్పోతారు. కొన్ని లక్షల పనిగంటలు తగ్గిపోతాయి. పేద ప్రజానీకానికి వచ్చే ఆదాయం కోల్పోతారు. అయితే పర్మినెంట్ ఉద్యోగాలు ఉత్పత్తిని పెంచడానికి అవరోధమని, ఉద్యోగిని నిరంతరం అభద్రతకు గురిచేస్తేనే అతని సామర్థ్యం పెరుగుతుందని విచిత్రమైన అంశాలు ప్రచారం చేస్తున్నారు. పర్మినెంట్ పనులకు పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు భిన్నంగా పర్మినెంట్ పనుల్లో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలు జరుగుతున్నాయి. దీనివల్ల రిజర్వేషన్ వ్యవస్థ కనుమరుగు అవుతుంది. సామాజిక న్యాయం అందని ద్రాక్షగా మారిపోతుంది. ఉత్పత్తి అయిన సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం అవుతుంది. ప్రశ్నించే తత్వాన్ని కోల్పోతాం. ఇక ప్రైవేట్ రంగంలో ఎలాంటి రిజర్వేషన్లూ అమలు కావు.

అస్తిత్వవాద అంశాలు

భూమి అందరికి లేదు. ప్రభుత్వ రంగం కుదించ బడుతున్నది. రండి అందరం కలసి పోరాడదాం, సామాజిక న్యాయాన్ని రక్షించుకుందాం అనే పిలుపు స్థానంలో మన కులం వారికి పలానా పదవి లేదు, మన కులం వారికి గౌరవం లేదు, రండి ...మనం అంతా పోరాడుదాం...అనే అస్తిత్వవాద రాజకీయాలు చేసే వారి సంఖ్య పెరిగిపోయింది. అనుభవించే వాడికి తెలుస్తుంది. బయట ఉన్న వారికి ఏం తెలుస్తుంది? మా సమస్య మేమే పరిష్కరించుకుంటాం! అనే వాదనలు ముందుకు వస్తున్నాయి. ఈ వాదనలలో తమ హక్కులు తమకు రావడం లేదనే ఆక్రోశం ఉంది. అయితే ప్రవేటీకరణ వల్ల అసలు రిజర్వేషన్లు వ్యవస్థకే మోసం వస్తున్నప్పుడు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా పోరాటం చేయకుండా సామాజిక న్యాయం సాధించడం సాధ్యం కాదు. గమనించవలసిన అంశం ఏమిటంటే ఈ అస్తిత్వవాదాలు సమిష్టి వాదానికి, సంఘ భావనలకు వ్యతిరేకంగా ఉంటాయి. అంతిమంగా ఆర్థిక రంగ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రైవేటీకరణను వెనక్కి కొట్టే సమిష్టి పోరాటాలకు ఈ రాజకీయాలు అవరోధంగా మారుతున్నాయి.

ప్రభుత్వ రంగం బలపడితేనే...

ప్రభుత్వ రంగం బలపడకుండా రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయాన్ని సాధించడం సాధ్యం కాదు. ప్రభుత్వమే ఉపాధి, ఉద్యోగ కల్పన చేయకుండా సమాన పనికి సమాన వేతనం అందే అవకాశం లేదు. భూమిని అందరికీ అందుబాటులోకి తేకుండా విద్య, వైద్యం కనీస మౌలిక సదుపాయాలు ప్రజలందరికీ అందించడం సాధ్యం కాదు. భూ పంపిణీ వల్ల ఒక స్థిర ఆదాయం వస్తుంది. ఇలా వచ్చిన ఆదాయాన్ని ప్రజలు తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, తమకు కావలసిన వస్తువుని కొనుగోలు చేయడానికి వినియోగిస్తారు. తద్వారా వస్తువులు తయారు చేసే కంపెనీలు పెరుగుతాయి. ఈ కంపెనీలలో పనిచేయటానికి కావలసిన వర్కర్ల సంఖ్య పెరుగుతుంది. కొద్దిమేరకైనా నిరుద్యోగం రూపుమాపబడుతుంది. ఇవన్నీ ప్రభుత్వ రంగంలో వుంటే సామాజిక న్యాయం కొంతైనా దక్కుతుంది.

(వ్యాసకర్త యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు)

సమస్య

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలయ్యేనా!



> ప్రభుత్వం ఉద్యోగుల ఆవేదనను ఆలకించి, సమస్యలను చర్చించి పరిష్కారం చేయవచ్చు. అయితే అందుకు భిన్నంగా పోరాటం చేస్తున్న ఉపాధ్యాయులపైన ఆంక్షలు విధించడమే కాకుండా... వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నది. ఇన్నేళ్ల కాలంలో ఎన్నడూ లేనంతగా కొన్ని వేల మంది ఉపాధ్యాయులపై బైండోవర్ కేసులు, ఏదో ఒక సెక్షన్ కింద రెండు లేదా అంతకు మించి ఎక్కువ కేసులు బనాయిస్తున్న పరిస్థితి. సానుకూల వైఖరితో చర్చించి పరిష్కరించడం ద్వారానే ఉద్యోగులను, ఉద్యమాలను శాంతింపచేయగలం తప్ప... ఆంక్షలు, నిర్బంధాలతో కాదన్నది చరిత్ర చెబుతున్న సత్యం.



జి. వెంకటేశ్వరరావు

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చే వారధులు ఉద్యోగులు. ప్రభుత్వ వ్యవస్థను నడపడంలో వీరిది ముఖ్య పాత్ర. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని నాటి ప్రతిపక్ష పార్టీ, నేటి పాలక పార్టీ వైసిపి...2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సమయంలో హామీలు ఇచ్చింది. అంతేకాక ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు సంబంధించిన 11 హామీలను చేర్చింది. "సిపిఎస్ రద్దు చేస్తాం, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తాం, అన్ని ప్రభుత్వ శాఖల లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తాం, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తాం, గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల మీద అరాచకాలు పెరిగిపోయాయి. మన ప్రభుత్వం రాగానే ఉద్యోగులు నిర్భయంగా పని చేసుకునే స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పిస్తాం..." వంటివి వాటిలో ముఖ్యమైనవి. గత ప్రభుత్వ కాలంలో పోరాడిన అనేక అంశాలను అమలు చేస్తామంటూ మేనిఫెస్టోలో చేర్చడంతో ఉద్యోగులు, వారి కుటుంబీకులలో అధిక భాగం ఎన్నికలలో మద్దతుగా నిలిచారు. దాంతో వైసిపి అత్యధిక సీట్లతో అధికారంలోకి రాగలిగింది. ఈ మూడున్నర సంవత్సరాల నుండి ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురుచూసిన ఉద్యోగులకు నిరాశ, నిస్పృహలే మిగిలాయి.

పిఆర్‌సి సకాలంలో అమలు జరుపుతాం. 27 శాతం ఐ.ఆర్ అమలు చేస్తామని మేనిఫెస్టోలో చేర్చారు. సహజంగానే ఉద్యోగులు 27 శాతం కన్నా అధికంగానే ఫిట్మెంట్ ఉంటుందని ఊహించారు. కానీ దీనికి భిన్నంగా 27 శాతం ఐ.ఆర్ లో కోత విధించి 23 శాతం ఫిట్మెంట్‌తో పిఆర్‌సి ని అమలు అమలు చేసింది. ఈ పిఆర్‌సి తో ఉద్యోగులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. అంతకు మించి ఇది అమలు జరిపిన తీరు, ఈ సందర్భంగా ఉద్యోగులపై తమ పత్రికలో రాసిన రాతలు వారిలో తీవ్రమైన అసంతృప్తిని, అవమానాన్ని మిగిల్చింది. దాని ఫలితమే ఫిబ్రవరి 3న విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డులో ఉద్యోగులు ఉద్యమించారు.

అధికారంలోకి వచ్చిన వారం లోగా సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తామన్న హామీ అమలు కోసం ఐదున్నర లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. మూడున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ ఈ హామీ అమలు కాలేదు. అమలు చేయకపోగా ఈ హామీ అవగాహన లేక ఇచ్చామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇప్పుడు సిపిఎస్ లోనే చిన్న చిన్న మార్పులు (గ్యారెంటీ లేని చివరి వేతనంలో 33 శాతం సర్వీస్ పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్, ఉద్యోగి ప్రమాద బీమా) చేసి జిపిఎస్ పేరుతో అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఇది కచ్చితంగా ఓపిఎస్ కు ప్రత్యామ్నాయం కాదు. సిపిఎస్ కు ఓపిఎస్ తప్ప మరో ప్రత్యామ్నాయాన్ని అంగీకరించమని ఉపాధ్యాయ సంఘాలు కరాఖండిగా తేల్చి చెప్పాయి. అన్ని ప్రభుత్వ శాఖలలో సుమారు కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. వీరంతా ఏళ్ల తరబడి రెగ్యులరైజేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో ఒక్కరిని కూడా రెగ్యులరైజ్ చేయలేదు. ఉద్యోగులకు 6 నెలలకు ఒకసారి పెరిగిన ధరలకు అనుగుణంగా డిఏలు ప్రకటించడం జరుగుతుంది. కానీ ఈ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డిఏలు అన్నింటిని కలిపి పిఆర్‌సి లో ఇచ్చి వాటి ఎరియర్లన్నింటిని రిటైర్మెంట్ తర్వాత తీసుకోమని చెప్పింది. ఇప్పటికీ మూడు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ సొమ్ము నుండి కుటుంబ అత్యవసరాల కోసం పెట్టుకునే లోన్ల కోసం ఉద్యోగులు సంవత్సరాల తరబడి ఎదురు చూడవలసి వస్తున్నది. చివరికి నెల మొత్తం పని చేసి ఒకటో తారీకు జీతం కోసం కూడా ఉపాధ్యాయులు, ఉద్యోగులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితులు వచ్చాయి.

ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం ప్రాతినిధ్యం చేయడం, ప్రశ్నించడం, ప్రతిఘటించడం చేస్తుంటారు. ఇది ప్రజాస్వామిక హక్కు. పిఆర్‌సి సమయంలో వేతనాల్లో కోత విధించడమే కాకుండా దాన్ని అమలు చేయడానికి వారిపై ప్రభుత్వం చేసిన వ్యతిరేక ప్రచారంతో విస్తుపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు 2021 ఫిబ్రవరి 3న విజయవాడలో లక్ష మందితో చేసిన పోరాటంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. సిపిఎస్ రద్దు కోసం ఉపాధ్యాయ సంఘాలు, సిపిఎస్ సంఘాలు సిఎం కార్యాలయం ముట్టడి, సచివాలయం ముట్టడి వంటి పోరాటాలు, ధర్మదీక్షలు నిర్వహించాయి. ఒకటో తారీకు జీతాల కోసం కూడా వినూత్న పద్ధతులలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం పోరాడడం కొత్తేమీ కాదు. పోరాటాలు ఇప్పుడే ప్రారంభం కాలేదు. ప్రభుత్వం వారి ఆవేదనను ఆలకించి, సమస్యలను చర్చించి పరిష్కారం చేయవచ్చు. అయితే అందుకు భిన్నంగా పోరాటం చేస్తున్న ఉపాధ్యాయులపైన ఆంక్షలు విధించడమే కాకుండా...వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నది. ఇన్నేళ్ల కాలంలో ఎన్నడూ లేనంతగా కొన్ని వేల మంది ఉపాధ్యాయులపై బైండోవర్ కేసులు, ఏదో ఒక సెక్షన్ కింద రెండు లేదా అంతకు మించి ఎక్కువ కేసులు బనాయిస్తున్న పరిస్థితి.

సానుకూల వైఖరితో చర్చించి పరిష్కరించడం ద్వారానే ఉద్యోగులను, ఉద్యమాలను శాంతింపచేయగలం తప్ప...ఆంక్షలు, నిర్బంధాలతో కాదన్నది చరిత్ర చెబుతున్న సత్యం. ఈ సత్యాన్ని మరిచిన అనేక ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకున్నాయి. ఉద్యోగులకు న్యాయంగా ఇవ్వవలసిన వాటిని అందించడం ప్రభుత్వ బాధ్యత. లేనిపక్షంలో వారి ముందు పోరు బాట వుండనే వుంది.

(వ్యాసకర్త సెల్: 9966135289)

★

జనవాక్యం

మద్యంతో భవిష్యత్తు అంధకారమే

రాష్ట్రంలో అధికారంలోకి వస్తే అంచెలంచెలుగా మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పిన పాలకులు అందుకు భిన్నంగా మద్యం ధరలు, అమ్మకాలు పెంచుకుంటూ మహిళలను మోసం చేశారు. నాసిరకం మద్యంతో మద్యానికి బానిస అయిన వాళ్ళు కాలేయ జబ్బులతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రభుత్వ మోసపూరిత విధానాలతో మధ్య తరగతి, పేద కుటుంబాలు దయనీయ స్థితిలో ఉన్నాయి. నవరత్నాలు ఓ బూటకం. ప్రజలపై పన్నుల భారం మోపి అందరికీ మేలు చేశామని చెప్పడం మరో దుర్మార్గం! ఇంటికి వచ్చిన నేతలను ప్రజలు ఎన్నికల వాగ్దాన పత్రం తీసుకురమ్మని అడగాలి! అప్పుడే బండారం బయట పడుతుంది.

\- జి. భారతీదేవి,
ఏలూరు, ఏలూరు జిల్లా.

స్పందించని ప్రభుత్వం

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర మంత్రి కెటిఆర్ కేంద్రానికి బహిరంగ లేఖ రాయడం అందరూ స్వాగతించాలి. మన రాష్ట్ర ముఖ్యమంత్రి గారు తరచూ ఢిల్లీ వెళ్ళినా ప్రైవేటీకరణ వద్దని కేంద్రాన్ని కోరడం లేదు. ప్రైవేటీకరణ తమకు ఆమోదయోగ్యమైతే అదే విషయం ప్రజలకు చెప్పాలి కదా? ఇది తెలుగు ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశం. ఇప్పటికే ఆంధ్రా బ్యాంక్ కనుమరుగై పోయింది. తెలుగు ప్రజలంతా ముక్త కంఠంతో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అందరినీ కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. దాగుడుమూతల రాజకీయాలకు కాలం చెల్లింది. రాష్ట్ర పాలకులు ఈ వాస్తవాన్ని గుర్తించాలి.

\- కంభంపాటి కోటేశ్వరరావు,
మురళినగర్, విశాఖపట్నం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

స్పందించకుంటే గద్దె దింపుతాం

రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగుల హెచ్చరిక
భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా
తరలివచ్చిన ఉద్యోగులు, పెన్షనర్లు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరుతుంటే ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని, ప్రభుత్వం కళ్లు తెరవకపోతే రాబోయే రోజుల్లో గద్దె దింపుతామని ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీర్ఘకాలంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ తమపై కక్షపూరితంగా వ్యవహరించడంతోపాటు ఉద్యోగులతో తమకు సంబంధం ఏంటి అన్న చందంగా ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు కలిపి రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మంది ఉన్నామని తామంతా తలుచుకుంటే ప్రభుత్వాన్ని నామరూపాలు లేకుండా చేస్తామని ముక్తకంఠంతో హెచ్చరించారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెండో దశ ఉద్యమాన్ని ఉద్యోగులు చేపట్టారు. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద బుధవారం నిర్వహించిన ధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు వందలాదిమంది తరలివచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో టెంట్ ఏర్పాటు చేసుకుని బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పటికైనా తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చుతుందని హెచ్చరించారు. తాము ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయమైన సమస్యలపై పోరాడుతున్నామని అయితే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కృష్ణమోహన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.జేమ్స్‌గాబ్రియేలు, సెక్రటరీ ఎస్.సత్యనారాయణరాజు, కో ఆపరేటివ్ అసోసియేట్ ప్రెసిడెంట్ జె.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పాలకొల్లు నాయకులు అజయ్ కుమార్, ఎపి జెఎసి అమరావతి జిల్లా ప్రెసిడెంట్ శివ శంకర్, కార్యదర్శి ఫణి, ఎపిఆర్ఎస్ఎ జిల్లా కార్యదర్శి ప్రసాదరాజు, కలెక్టరేట్ సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, పివి.సాంబశివ రావు, కె.సురేష్, సిబ్బంది, బుజ్జియ్య, సూర్యకాంతం, సత్యనారాయణ, వెంకట రత్నం వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



అమూల్‌కు వ్యతిరేకంగా నిరసనల హోరు

బెంగళూరు : కర్ణాటకలో అమూల్ ఉత్పత్తుల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ బెంగళూరులో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు. కన్నడిగుల జీవనంలో భాగమైన 'నందిని' పాల ఉత్పత్తుల సహకార సంస్థను గుజరాత్‌కు చెందిన అమూల్ సంస్థలో విలీనం చేయాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించినట్లు వార్తలు వెలువడటంతో అక్కడి ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం నాడు మోడీ సర్కార్ తీరును నిరసిస్తూ రాష్ట్ర మంతటా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

ఢిల్లీలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ : దక్షిణ ఢిల్లీలోని ఓ పాఠశాలకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో భయాందోళనలకు గురైన యాజమాన్యం విద్యార్థులను పాఠశాల నుండి ఖాళీ చేయించింది. అయితే అనుమానాస్పద వస్తువులు ఏమీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం... సాదిక్ నగర్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కి ఆవరణలో బాంబు పెట్టినట్లు ఉదయం 10.49 గంటలకు ఓ ఇమెయిల్ వచ్చింది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా పాఠశాలను ఖాళీ చేయించారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలో పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుమిగూడిన దృశ్యాలు మీడియాలో వైరల్‌గా మారాయి. పిల్లలను స్కూల్ నుండి ఇంటికి తీసుకు వెళ్లాల్సిందిగా మెసేజ్ వచ్చిందని విద్యార్థి తండ్రి ఒకరు తెలిపారు. అయితే స్కూల్ యాజమాన్యానికి బాంబు బెదిరింపులు రావడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది నవంబర్ లోనూ ఇలాగే ఓ ఇమెయిల్ వచ్చిందని అన్నారు. వెంటనే డాగ్ స్క్వాడ్‌తో పాటు సంఘటనా స్థలానికి చేరుకున్నామని చెప్పారు.

8 వేలకు దగ్గరగా కరోనా కేసులు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కరోనా మరోసారి విజృంభిస్తోంది. గత 24 గంటల్లో 7,830 కొత్త కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం ఉదయం వెల్లడించింది. దీంతో గత 223 రోజుల్లో గరిష్టానికి తాజా కరోనా కేసుల సంఖ్య చేరిందని తెలిపింది. ఇక దేశవ్యాప్తంగా ప్రస్తుతం 40,215 యాక్టివ్ కేసులున్నాయి. కరోనాతో మంగళవారం ఒక్కరోజే 16మంది మృతి చెందారు. ఢిల్లీ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఇద్దరు, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కరుచొప్పున మృతి చెందారు. అత్యధికంగా కేరళ రాష్ట్రంలోనే ఐదుగురు కరోనాకు బలయ్యారు. తాజా మరణాలతో కలిసి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మృతి చెందిన కరోనా మృతుల సంఖ్య 5,31,016కి చేరింది. క్రితంరోజు 5,676 కరోనా ఇన్ఫెక్షన్ల కేసులు నమోదవ్వగా.. ఒక్కరోజులోనే రెండువేలకు పెరిగి ప్రస్తుతం 7 వేలకు పైగా కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 4,47,76,002 కేసులు నమోదయ్యాయి. ఇక తాజా కేసుల్లో 1,774 కేసులు ఎక్స్‌బిబి1.16 వేరియంట్‌కు సంబంధించినవని.. వీటిని 22 రాష్ట్రాల్లోనూ, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ కనుగొన్నట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జెనోమిక్స్ కన్సార్టియం (ఐఎన్ఎస్ఎసిఓజి) తెలిపింది. ఇక 230 మంది ఒమిక్రాన్ సబ్ వేరియంట్ ఎక్స్‌బిబి 1.16.1కి బారినపడినట్లు ఐఎన్ఎస్ఎసిఓజి పేర్కొంది. దేశవ్యాప్తంగా కరోనా రికవరీ రేటు 98.72 శాతంగా ఉంది. మరణాల రేటు 1.19 శాతంగా ఉంది.

కార్పొరేట్లకు తొత్తుగా కేంద్రం

- ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవసాయాన్ని కార్పొరేట్ పరం చేసే విధానాలను అవలంభిస్తుందని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ఆల్ ఇండియా కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రంలో ఎపి రైతు సంఘం కార్యాలయం వద్ద రైతు సంఘం జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో రైతు సంఘం నాయకులు పాల్గొంటూ రైతు సంఘాలను ఏర్పాటు చేసి, రైతాంగ సమస్యలపై ఆనాడే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన చరిత్ర ఆల్ ఇండియా కిసాన్ సభకు ఉందని తెలిపారు. నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతాంగం పెద్ద ఎత్తున పోరాటం చేయాలన్నారు. ఎరువుల ధరలు, విత్తనాలు ధరలు పెరిగి, గిట్టుబాటు ధర లేక రైతు ఈ ప్రభుత్వ విధానాలతో చితికిపోతున్నాడని, దీనికి పోరాటమే సరైన మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలి : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో విద్యుత్‌శాఖ ప్రధానభూమిక పోషిస్తోందని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతిలో ఎలక్ట్రికల్ సేఫ్టీ వర్క్‌షాపును స్థానిక ఓ ప్రయివేట్ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ ప్రజలు, జంతువులకు ప్రాణనష్టం కలగకుండా, విద్యుత్ శాఖ ఉద్యోగుల ప్రాణనష్టం కలగకుండా, విద్యుత్ సరఫరా పరికరాలు దెబ్బ తినకుండా, సబ్‌స్టేషన్‌లు పవర్‌లైన్లకు నష్టం కలగకుండా చర్యలు ఉండాలన్నారు. సబ్‌స్టేషన్లు, పవర్‌లైన్ల నిర్వహణలో భద్రత ప్రమాణాలు అమలులో చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థిక అభివృద్ధికి విద్యుత్ శాఖ చాలా ముఖ్యమని ఇటీవల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో మరోసారి రుజువైందని గుర్తు చేశారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో 13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే అందులో 9 లక్షల కోట్లు విద్యుత్ శాఖకు వచ్చాయని, ఇది మంచి పరిణామం అన్నారు. అనంతపురంలో వరుసగా విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అధికారులను అప్రమత్తం చేసి చర్యలు చేపట్టామన్నారు. ఒకేసారి 15వేల మంది ఎనర్జీ అసిస్టెంట్స్‌ను ఇప్పటికే నియమించామని, వారి సేవలు సక్రమంగా ఉపయోగించు కోవాలన్నారు. ఒక పటిష్టమైన కమ్యూనికేషన్ వ్యవస్థ సిద్ధం చేయాలని సూచించారు. ముందుకు వచ్చిన పెట్టుబడిదారులకు సహకరించి వారికి విద్యుత్ అందజేసి ప్రక్రియ సులభంగా మారేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సేఫ్టీ విషయంలో ఎటువంటి రాజీపడటానికి వీల్లేదని ఆదేశించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా అందరికీ పూర్తిస్థాయి అవగాహన వస్తుందని అశిస్తున్నానని తెలిపారు. సమావేశ ప్రాంగణంలో విద్యుత్ భద్రత ఉపకరణాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎలక్ట్రికల్ సేఫ్టీ, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మి, రిటైర్డు సిఎండి గోపాల్‌రెడ్డి, ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్లు సుబ్బరాజు, జయబారతిరావు పాల్గొన్నారు.

దేశంలో మూడు ప్రాంతాల్లో భూకంపం

శ్రీనగర్ : ఒకే రోజు దేశంలో మూడు ప్రాంతాల్లో భూకంపం రావడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. జమ్మూకశ్మీర్, బీహార్, సిలిగురిలో బుధవారం భూకంపం సంభవించినట్లు అధికారులు తెలిపారు. జమ్మూకశ్మీరులో ఉదయం 10 గంటలకు 4.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ భూకంపం 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని అధికారులు తెలిపారు. దీనివల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. అలాగే బీహార్ రాష్ట్రంలోని అరారియా సమీపంలోని పూర్ణియా వద్ద బుధవారం ఉదయం 5.35 గంటలకు భూకంపం సంభవించింది. ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.3గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది.

మే 31లోపు 'శ్రీనివాస సేతు' పూర్తవ్వాలి : ఇఒ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీనివాస సేతు ప్రాజెక్టు పనుల పురోగతిపై టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి బుధవారం టీటీడీ పరిపాలన భవనంలోని తమ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ మే 31 నాటికి ప్రాజెక్టు మొత్తం పనులు పూర్తి చేసి జూన్ 15వ తేదీ నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరారు. రోడ్ల మధ్యలో మీడియన్స్ అభివద్ధి కోసం అవసరమైన స్థలాన్ని వెంటనే కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద గ్రిడ్డర్స్ పనులను త్వరగా చేపట్టాలని కోరారు. ప్రస్తుతం పూర్తయిన 92 శాతం పనుల పురోగతిని వచ్చే బోర్డు సమావేశంలో తెలిపేందుకు వీలుగా సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షలో జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎఫ్ఏసిఎఓ బాలాజీ, కార్పొరేషన్ ఎస్ఇ మోహన్, ఈఈ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చంద్రమౌళి పాల్గొన్నారు.

'మోడీ' కేసులో రాహుల్‌కు మరో కోర్టు సమన్లు

పాట్నా: 'మోడీ ఇంటిపేరు' వ్యాఖ్యల వివాదంలో కాంగ్రెస్ నాయుకులు రాహుల్ గాంధీకి మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వ్యాఖ్యలకు గానూ బిహార్‌లోనూ ఆయనపై పరువు నష్టం కేసు నమోదైంది. ఆ కేసులో విచారణకు రావాలని పాట్నా కోర్టు బుధవారం రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. ఈ నెల 25న కోర్టు ఎదుట హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. బిజెపి రాజ్యసభ ఎంపీ సుశీల్ కుమార్ మోడీ రాహుల్‌పై ఈ పరువు నష్టం దావా వేశారు. దీనిపై గతంలో విచారణ జరిపిన పట్నాలోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు.. ఏప్రిల్ 12న రాహుల్ కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. అయితే, ప్రస్తుతం సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ వ్యవహారంలో తాము బిజీగా ఉన్నందున విచారణ వాయిదా వేయాలని రాహుల్ న్యాయవాదుల బృందం కోర్టును కోరింది. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం.. ఏప్రిల్ 25వ తేదీకి విచారణ వాయిదా వేసింది. ఆ రోజున రాహుల్ వ్యక్తిగతంగా హాజరుకావాలని సమన్లు జారీ చేసింది.

వివిధ ఆర్థిక నేరాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన వ్యాపారవేత్తలు లలిత్ మోడీ, నీరవ్ మోడీల గురించి 2019 ఎన్నికల ప్రచారం వేళ కర్ణాటకలోని కోలార్‌లో రాహుల్ ప్రస్తావించారు. ఆ సందర్భంగా మోడీ అనే పేరు గురించి చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ గుజరాత్‌లోని సూరత్‌లో పరువునష్టం దావా దాఖలైంది. దీనిపై ఇటీవల విచారణ జరిపిన సూరత్ కోర్టు.. రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ తీర్పు వెలువడిన 24 గంటల్లోపే ప్రజా ప్రాతినిధ్య చట్టం నిబంధనల మేరకు లోక్‌సభ సచివాలయం ఆయనపై అనర్హత వేటు వేసింది. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. కాగా.. సూరత్ కోర్టు తీర్పుపై రాహుల్ పై కోర్టులో అప్పీల్ చేసుకున్నారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం నేడు (గురువారం) విచారణ జరపనుంది.

రష్యా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతం

మాస్కో: రష్యా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతమైనట్లు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. దక్షిణ రష్యాలోని కపుస్టిన్ యార్‌లో మొబైల్ లాంచర్ ద్వారా క్షిపణిని ప్రయోగించినట్లు తెలిపారు. రష్యా లీజుకి తీసుకున్న కజకిస్తాన్‌లోని సారీషాగన్ టెస్టింగ్ రేంజ్‌లో నిర్దేశించిన లక్ష్యాన్ని చేధించినట్లు ప్రకటించారు. కొత్త వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థల అభివృద్ధి సమయంలో తలెత్తే సాంకేతిక పరిష్కారాల కచ్చితత్వాన్ని నిర్ధారించడానికి ఈ ప్రయోగం మాకు అనుమతించిందని రక్షణ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఉక్రెయిన్‌పై సైనిక చర్యలతో రష్యా, మరియు నాటో దేశాల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా మారిన సమయంలో ఈ ప్రయోగం జరగడం గమనార్హం.

జైపూర్- ఢిల్లీ వందేభారత్‌ను ప్రారంభించిన ప్రధాని

న్యూఢిల్లీ : రాజస్తాన్‌లో మొదటి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని మోడీ బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. జైపూర్- ఢిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను మోడీ ప్రారంభించారు. దీంతో ఇది హై రైజ్ ఓవర్ హెడ్ ఎలక్ట్రిక్ (ఒహెచ్‌ఇ) సెక్టార్‌లో ప్రపంచంలోనే మొట్టమొదటి సెమీ హైస్పీడ్ రైలు కానుంది. ఈ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ సేవలు గురువారం నుండి ప్రారంభం కానున్నాయి. జైపూర్, అల్వార్, గురుగావ్ స్టేషన్‌లలో మాత్రమే ఆగుతుంది. జైపూర్ నుండి ఉదయం 11.00 య గంటలకు బయలుదేరి సాయంత్రం 4.00 గంటలకు ఢిల్లీకి చేరుకోనుంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అజ్మీర్ నుండి ఢిల్లీకి 5 గంటల 15 నిమిషాల్లో చేరుకుంటుంది. ప్రస్తుతం ఈ మార్గంలో అత్యంత వేగవంతమైన రైలు శతాబ్ది ఎక్స్‌ప్రెస్. ఇది ఢిల్లీ నుండి అజ్మీర్‌కు 6గంటల 15 నిమిషాల్లో చేరుకుంటుంది. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ "ఇండియా ఫస్ట్, ఆల్వేస్ ఫస్ట్" స్ఫూర్తిని సుసంపన్నం చేస్తుందని పేర్కొన్నారు. వందేభారత్ రైలు నేడు అభివృద్ధి, ఆధునికత, స్వావలంబన, స్థిరత్వానికి పర్యాయపదంగా మారినందుకు తాను సంతోషిస్తున్నానని అన్నారు. నేటి ప్రయాణం రేపటి అభివృద్ధి చెందిన భారతదేశ ప్రయాణానికి నాంది అవుతుందని అన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించినప్పటి నుండి సుమారు 60 లక్షల మంది ఈ రైళ్లలో ప్రయాణించారని, ఇది ప్రజల సమయాన్ని ఆదా చేస్తోందని అన్నారు.

తమది రైతు ప్రభుత్వం : మంత్రి కొట్టు

గూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తమది రైతు ప్రభుత్వమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెం గ్రామంలో జిల్లాలో తొలిసారిగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయ రంగానికి అవసరమైన అన్నింటినీ తీరుస్తున్నారన్నారు. నిరంతరం 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే జగనన్న వ్యవసాయం పండుగ అని నిరూపించారన్నారు. ముఖ్యమంత్రి జగన్ రైతుల నుంచి మద్దతు ధరకు సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు డబ్బులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా గోనె సంచులు, హమాలీ రవాణా ఛార్జీలను సైతం ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. మొక్కజొన్న బయట మార్కెట్లో 1200 రూపాయలు ఉంటే ప్రభుత్వం 1600 రూపాయలకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. గత సార్వాలో జిల్లాలో 65660 మంది రైతుల నుంచి 3,76 వేల 657 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో ఒక తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి 85 వేల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ దాళ్వాలో జిల్లాలో స్థానిక అవసరాలు పోను 8.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని దానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేశామన్నారు.

జిల్లా సహకార అధికారి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో 378 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భీమవరం ఆర్‌డిఓ దాసి రాజు మాట్లాడుతూ ఎద్దుల బండ్లకు సైతం రవాణా ఛార్జీలు చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, కొమ్ముగూడెం సొసైటీ ఛైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, సెక్రటరీ శర్మ, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ముప్పిడి వెంకట్రామి రెడ్డి పాల్గొన్నారు.

సెల్ టవర్‌పై డిఎస్‌సి 1998 అభ్యర్థులు

- పోస్టుల భర్తీలో రోస్టర్ పద్ధతి పాటించాలి
- ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన
- నిరసనకు కెవిపిఎస్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ మద్దతు


టవర్ ఎక్కిన రమేష్ (పులివెందుల), శ్రీనివాస్ (నెల్లూరు)

ప్రజాశక్తి-మంగళగిరి / అమరావతి బ్యూరో

తమకు న్యాయం చేయాలని కోరుతూ డిఎస్‌సి 1998 అభ్యర్థులిద్దరు సెల్ టవర్ ఎక్కి నిరసన చేపట్టారు. సిఎం వైఎస్ జగన్‌కు చెందిన ఫ్లెక్సీ పట్టుకుని పులివెందులకు చెందిన రమేష్, నెల్లూరుకు చెందిన శ్రీనివాస్ బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని బైపాస్ పక్కనున్న సెల్‌టవర్ ఎక్కారు. రోస్టర్ పద్ధతి ప్రకారం పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఆర్డర్ ఆఫ్ మెరిట్ వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరి పట్టణ సిఐ బి అంకమ్మరావు, పెదకాకాని సిఐ సురేష్‌బాబు అభ్యర్థులతో మాట్లాడి కిందకు దిగాలని కోరారు. తమ ప్రాణాలు పోయినా వెనకాడబోమని, న్యాయం కోసం నిరసన కొనసాగిస్తామని వారు చెప్పారు. రెవెన్యూ అధికారులు నచ్చజెప్పడంతో సాయంత్రం 6:30 గంటలకు టవర్ పైనుంచి కిందకు దిగారు. తమకు న్యాయం జరగకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు 5,887 మందికి ఉద్యోగాలు ఇస్తున్నట్లు గత అసెంబ్లీ సమావేశాల్లో సిఎం జగన్ ప్రకటించారు. ఈ నెల 7న షెడ్యూల్, కౌన్సెలింగ్ తేదీల్లో 4,072 ఉద్యోగాలనే ప్రకటించారు. దీంతో దాదాపు 1,800 మందికి ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొంది. వీటిపై ప్రభుత్వానికి అభ్యర్థులు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు.

కెవిపిఎస్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ మద్దతు

1998 క్వాలిఫైడ్ ఉపాధ్యాయ నియమకాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు న్యాయం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఘటనా స్థలికి మాల్యాద్రితోపాటు డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ నాగేశ్వరావు, కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి వై కమలాకర్, డివైఎఫ్ఐ పట్టణ నాయకులు ఎస్ గణేష్ వచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో బడుగు, బలహీన వర్గాల పేర్లు లేవన్నారు. వెనకబడిన తరగతుల వారికి మంత్రి పదవులిస్తే సరిపోదని, ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. నియామకాలను నిలిపేయడం సాధ్యపడదని, కోర్టుకు వెళ్లాలని, ధర్నాలు చేసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అహంకార పూరిత సమాధానం సరికాదన్నారు. సిఎం, విద్యాశాఖ మంత్రి సత్వరమే జోక్యం చేసుకుని అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


అభ్యర్థులకు న్యాయం చేయాలి - విద్యార్థి యువజన సంఘాలు

1998 క్వాలిఫైడ్ డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలని డివైఎఫ్ఐ, ఎస్‌ఎఫ్ఐ, కెవిపిఎస్ డిమాండ్ చేశాయి. మంగళగిరి ఎన్నారై ఆస్పత్రి ఎదురుగా సెల్‌టవర్‌పై నిరసన తెలుపుతున్న అభ్యర్థులకు సంఘీభావంగా విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో డివైఎఫ్ఐ, ఎస్‌ఎఫ్ఐ, కెవిపిఎస్ నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రామన్న, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్న, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడారు.

గత 25 ఏళ్ల నుంచి అభ్యర్థులు అనేక నిరసనలు, పోరాటాలు చేసినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం వారికి న్యాయం చేయడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 1998 డిఎస్‌సి ఉద్యోగాల కౌన్సెలింగ్‌ను నిలిపేసి రిజర్వేషన్‌ల ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎన్ నాగేశ్వరరావు, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్, నాయకులు సోమేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

బలుసుతిప్పలో 3 కోవిడ్ కేసులు

ప్రజాశక్తి - కాట్రేనికోన (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్పలో మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు బుధవారం నమోదయ్యాయి. పల్లంకుర్రు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ స్వాతి తెలిపిన వివరాల ప్రకారం.. పిహెచ్‌సి పరిధిలోని తీరప్రాంత మత్స్యకార గ్రామమైన బలుసుతిప్పలో ముగ్గురికి కరోనా లక్షణాలు గుర్తించామని తెలిపారు. వైద్య పరీక్షలు చేయగా ముగ్గురికీ కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందన్నారు. ఐదు రోజులపాటు వారిని హోమ్ ఐసోలేషన్‌లో ఉండాలని సూచించామని తెలిపారు. వారికి వైద్య సాయం అందిస్తున్నామని చెప్పారు. అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలను చేస్తామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కరోనా నిబంధనలు పాటించాలని సూచించారు. అనుమానితులు ఎవరైనా ఉంటే స్థానిక పిహెచ్‌సిలో కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ధన్యజీవి సుబ్బారావు

- సంతాప సభలో మంత్రి అమర్‌నాథ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు


సంతాప సభలో నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవిఎస్.శర్మ, సిహెచ్.నర్సింగరావు తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఆయన్ను అందరూ కమ్యూనిస్టు సుబ్బారావు అంటూ ఆప్యాయంగా పిలుస్తారు. ఆయన నమ్మిన సిద్ధాంతం బలమైనది. ఆశయం విశిష్టమైనది.. ఆయన మరణించినా ఉద్యమ రూపంలో బతికుండే ధన్యజీవి, చిరస్మరణీయుడు గొల్లపల్లి సుబ్బారావు' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విశాఖపట్నం జిల్లా గాజువాక సిపిఎం నాయకులు జి.సుబ్బారావు సంతాప సభ బుధవారం షీలానగర్‌లో జరిగింది. సిపిఎం నాయకులు రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తొలుత సుబ్బారావు చిత్రపటానికి ఆ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ 'కమ్యూనిస్టు సుబ్బారావు'గా పిలవబడడం గొప్ప సర్టిఫికెట్ అని కొనియాడారు. గంగవరం పోర్టు ఉద్యమంలో 145 రోజులు జైలు జీవితం గడిపారన్నారు. ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావం, ఏదైనా సాధించాలన్న ధృడ సంకల్పంతో అందరితోనూ సన్నిహిత సంబంధాలు గల వానిగా సుబ్బారావు గాజువాక ప్రాంతంలో పేరుగాంచారన్నారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ సుబ్బారావు మృతిచెందడంతో కుటుంబంలో వ్యక్తిని కోల్పోయినట్లుగా ఉందన్నారు. కార్మిక లోకానికి ఆయన చేసిన సేవలు మరువలేనిదని పేర్కొన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. 1980వ దశకంలో సుబ్బారావు ప్రజా సమస్యలపై పోరాటాల్లో పాల్గొంటూ ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని నిర్మించినట్లు తెలిపారు. కమ్యూనిస్టు ఆశయ సాధన కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు. గాజువాకలో వెయ్యి ఎకరాల ఇనాం భూములను పేదలకు పంచడంలో కీలక ఉద్యమాన్ని నిర్వహించారని తెలిపారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ.. పార్టీతోనూ, ప్రజలతోనూ పెనవేసుకున్న బంధం సుబ్బారావుదని కొనియాడారు. ఆయన బతికుండగానే తాను తుదివరకూ ప్రజా ఉద్యమంతోనే ఉంటానని చెప్పేవారని, ఆయన సతీమణి మణి అదే స్ఫూర్తిని ప్రదర్శించేవారని తెలిపారు. సుబ్బారావు జ్ఞాపకాలు మనలో సజీవంగా ఉంటాయని పేర్కొన్నారు.

కడుపులో ట్యూమర్ తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కడుపులో చిన్నపేగు వద్ద ట్యూమర్ ఏర్పడి తీవ్ర అనారోగ్యం పాలైన వ్యక్తికి గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో అత్యంత క్లిష్టమైన అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారు. దీనిపై వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి, జనరల్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ వై.కిరణ్‌కుమార్ బుధవారం వెల్లడించారు. విజయవాడకు చెందిన 51 ఏళ్ల శ్యామ్యూల్ సునీల్ నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో సిటీ స్కాన్, ఎండోస్కోపి పరీక్షల తరువాత కడుపు కింది భాగంలో జిఐఎస్‌టి (ట్యూమర్) కణితి ఉందని నిర్ధారించారు. ప్రయివేటు వైద్యులను సంప్రదించగా ఆపరేషన్ అత్యంత రిస్కుతో కూడుకుందని, సుమారు రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని తెలపడంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. దాదాపు ఆరు గంటలపాటు వైద్యులు శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. ప్యాంక్రియాస్ గ్రంధికి, కిడ్నీ రక్తనాళాలకు దగ్గరగా కణితి ఉండడం వల్ల ఆపరేషన్ క్లిష్టంగా మారిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి తెలిపారు. వైద్య బృందంలో డాక్టర్ సిహెచ్ చలం, డాక్టర్ నాగ సంతోష్, డాక్టర్ వంశీధర్, డాక్టర్ అనూష, డాక్టర్ వేణుగోపాల్, కోటి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులు

- రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు భూసేకరణకు నిధులు విడుదల చేయాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని రైతు, ప్రజాసంఘాలు హెచ్చరించాయి. గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కుర్రా హరిబాబు అధ్యక్షతన బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ విస్తరణ ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, పర్చూరు మండలాల ప్రజల కలని అన్నారు. వర్షాలపై ఆధారపడిన ఆయా మండలాల ప్రజలకు ఛానల్ పొడిగింపు ద్వారా సాగు, తాగునీటి ఎద్దడి తీరుతుందని తెలిపారు. అనేక పోరాటాలు, ప్రభుత్వాల హామీల తర్వాత ఇటీవల ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిందని, కాని వాటికి కావాల్సిన రూ.113 కోట్లు మాత్రం విడుదల చేయలేదన్నారు. దీంతో ఆ ప్రక్రియ ముందుకు సాగట్లేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ బ్రిటిషు పాలన నుండి నేటి వరకూ గుంటూరు ఛానల్ విస్తరణకు సంబంధించి పాలకుల వాగ్దానాలు ఆచరణ రూపం దాల్చట్లేదన్నారు. ఈ ప్రాంత ప్రజలను కదిలించి ఐక్య ఉద్యమాలు చేయడం ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖరరెడ్డి, కాంగ్రెస్ అనుబంధ రైతు సంఘం రాష్ట్ర నాయకులు లావు అంకమ్మచౌదరి, నల్లమడ రైతు సంఘం నాయకులు ఆచారి, సిపిఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ పొలిట్‌బ్యూరో సభ్యులు మన్నవ హరిప్రసాద్, రైతుకూలీ సంఘం నాయకులు కె.శ్రీధర్, ఎరువాక రైతు సంఘం నాయకులు కోటేశ్వరరావు వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రసంగించారు.

బిసిల కోసం ప్రత్యేక రక్షణ చట్టం

- జగన్ పాలన మొత్తం కోతలే
- 'యువగళం'లో నారా లోకేష్


యువగళం పాదయాత్రలో మొక్కజొన్న రైతుతో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి- పెద్దపప్పూరు, యాడికి (అనంతపురం జిల్లా)

రాష్ట్రంలో తాము అధికారంలోకి రాగానే బిసిల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం 68వ రోజు అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలంలో కొనసాగింది. పసలూరు నుంచి ప్రారంభమైన యాత్ర కొట్టాలపల్లి, కమ్మవారిపల్లి, నగరూరు, తుట్రాలపల్లి, టి కొత్తపల్లి, రామరాజుపల్లి, రాయలచెరువు గ్రామాల మీదుగా కొనసాగింది. రాయలచెరువులో రాత్రికి బస చేశారు. సాయంత్రం రాయలచెరువులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బిసిల వెన్నువిరిచారన్నారు. వారికి అమలవుతున్న సంక్షేమ పథకాలన్నింటిలోనూ కోతలు విధించారని విమర్శించారు. నిధుల్లేని కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, అందులో ఉత్సవ విగ్రహాల్లా ఛైర్మన్లను ఏర్పాటు చేశారన్నారు. కార్పొరేషన్ల ద్వారా ఒక్క రూపాయి కూడా సబ్సిడీ రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు రక్షణగా నిలుస్తామన్నారు. బిసి కార్పొరేష్లను పటిష్టపరిచి, దామాషా పద్ధతిలో నిధులు కేటాయిస్తామని, స్థానిక సంస్థల్లోనూ ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. బిసిలతో పాటు, ముస్లిం, మైనార్టీలు, ఎస్‌సి, ఎస్‌టిలను ఆదుకునే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల దెబ్బకు తాడేపల్లి కంపించిందన్నారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లోనూ ఇదే పునరావృతమవుతుందని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డిది రాజారెడ్డి రాజ్యంగం అయితే, టిడిపిది అంబేద్కర్ రాజ్యాంగమని అన్నారు. కార్యకర్తలకు అండదండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారథి, తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డితో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హిందూజాకు అదనపు చెల్లింపులు

ప్రభుత్వ ఆదేశం అమలు - కమిషన్ ముందు డిస్కాంల భిన్న వైఖరి

ఎం.వేణుగోపాలరావు

విశాఖపట్నంలోని హిందూజా థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకు (1040 మె.వా.) వివాదాస్పద అదనపు చెల్లింపుల వ్యవహారంలో విద్యుత్ పంపి ణీ కంపెనీలు (డిస్కాంలు) కమిషన్ ఉత్తర్వును ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు ఒక పక్క అదనపు చెల్లింపులను ప్రారంభించా యి. హిందూజా ప్రాజెక్టు పెట్టుబడి వ్యయం, చార్జీలు, విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై గతేడాది ఆగస్టు మొదటి తేదీన ఆంధ్రప్రదేశ్ విద్యు త్ నియంత్రణ కమిషన్ (ఎపిఇఆర్సి) ఇచ్చిన ఉత్తర్వులోని అంశాలను ప్రశ్నిస్తూ, వాటిని మార్చాలని కోరుతూ హిందూజా దాఖలు చేసిన రివ్యూ పిటిషన్పై దాఖలు చేసిన కౌంటర్లో రెండు డిస్కాంలు ఇపిడిసిఎల్, ఎస్ పిడిసిఎల్ ప్రభుత్వ ఆదేశానికి భిన్నంగా కమిషన్ ఉత్తర్వు ను సమర్ధించాయి. బుధవారం నాడు రివ్యూ పిటిషన్ కమిషన్ ముందుకు విచారణకు వచ్చినపుడు, వాదనలు చేసేందుకు హిందూజా తర పున సమయం కోరగా, వచ్చే నెల 3వ తేదీకి విచారణను కమిషన్ వాయిదా వేసింది. హిందూజా రివ్యూ పిటిషన్ను వాదిప్రతివాదుల మ ధ్య వివాదంగా తొలుత విచారణకు చేపట్టిన కమిషన్, ఈసారి దానిపై ఆసక్తి గలవారి నుండి అభ్యంతరాలను, సూచనలను ఆహ్వానించి, బహిరంగ విచారణ జరుపుతామని తనంతతాను ప్రకటించింది.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ప్రభుత్వ గ్యారంటీతో రూ. 1234.68 కోట్ల మేరకు రుణాన్ని పొందుతూ, డిస్కాంలు అందులో సగం మొత్తాన్ని ఇప్పటికే హిందూజాకు చెల్లించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వం చెల్లించటానికి అంగీకరిం చిన మొత్తానికి రెట్టింపు మొత్తాన్ని అదనంగా క్లెయిము చేసిన హిందూజా, తన మొత్తం క్లెయిమును విడనాడటం లేదనే షరతుతో మొద టి విడత మొత్తాన్ని తీసుకున్నట్లు సమాచారం.

హిందూజా రివ్యూ పిటిషన్లో లేవనెత్తిన ప్రతి అంశాన్ని వ్యతిరేకిస్తూ, కమిషన్ ఇచ్చిన ఉత్తర్వును పూర్తిగా సమర్ధిస్తూ డిస్కాంలు తమ కౌం టర్ను దాఖలు చేశాయి. హిందూజా రివ్యూ పిటిషన్ను తిరస్కరించాలని కమిషన్ను కోరాయి. 2022 జులై 31కి ముందు కాలంలో హిం దూజా సరఫరా చేసిన, చేయని విద్యుత్కు అదనపు స్థిర చార్జీల చెల్లింపుకు హిందూజా కమిషన్ ఉత్తర్వుకు వక్రభాష్యం చెప్పిందని డిస్కాం లు కౌంటర్లో వాదించాయి. గతేడాది జులై 30వ తేదీకి ముందు కాలానికి ఎపిఈఆర్సి తాత్కాలిక చార్జీ తుది అని గత ఆగస్టు మొదటి తేదీన ఇచ్చిన ఉత్తర్వులో పేర్కొన్న కారణాలతో సక్రమంగా నిర్ణయించిందని డిస్కాములు పేర్కొన్నాయి. డిస్కాంలు కమిషన్ ముందు తీసు కున్న వైఖరిలో పలు అంశాలు ఇమిడి ఉన్నాయి. పైన పేర్కొన్న కాలానికి హిందూజాకు అదనపు చెల్లింపులు చేయాలన్న ప్రభుత్వ ఆదేశం కమిషన్ ఉత్తర్వును ఉల్లంఘించటమేననేది ఒకటి. ఇద్దరు న్యాయనిపుణులు హిందూజాకు అదనపు చెల్లింపులపై ఇచ్చిన అభిప్రాయాలు చట్ట సమ్మతం, న్యాయం సమ్మతం కావనేది మరో అంశం. కమిషన్ ఉత్తర్వు డిస్కాంల, వినియోగదారుల ప్రయోజనాన్ని కాపాడేది, సముచితమైనది కాగా, ప్రభుత్వ నిర్ణయం డిస్కాంల, ప్రజా ప్రయోజనాన్ని దెబ్బతీసేదనేది మరో అంశం.

రివ్యూ పిటిషన్కు కారణాలుగా ఉండాల్సిన ప్రధానాంశాలు హిందూజా పిటిషన్లో కొరవడ్డాయని డిస్కాంలు పేర్కొన్నాయి. తగు పరిశీలన జరిపినప్పటికి గత విచారణ సమయంలో సమర్పించని కొత్త వాస్తవాలను కనుగొనటం ఒకటి. రికార్డులో ప్రస్ఫుటంగా ఏదైనా పొరపాట ఎ కనిపించటం రెండవది. ఏదైనా తగినంత ఇతర కారణం మూడవది. హిందూజా రివ్యూ పిటిషన్లో ఈ మూడు అంశాలు లేవని, అంద ఎవల్ల ఆ పిటిషను కొట్టివేయాలని కమిషన్ను కోరాయి. డిస్కాంల తరపున సీనియర్ న్యాయవాది పి. శివరావు విచారణకు హాజరయ్యారు.

రివ్యూ పిటిషన్పై కమిషన్ బహిరంగ విచారణ జరిపి, ఉత్తర్వు ఇచ్చేనాటికి ప్రభుత్వ ఆదేశం మేరకు డిస్కాంలు మిగిలిన మొత్తాన్ని కూడా హిందూజాకు చెల్లించే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితిలో, రివ్యూ పిటిషన్పై కమిషన్ ఇవ్వనున్న ఉత్తర్వు ప్రజా ప్రయోజనాన్ని ఎలా కాపాడగలుగుతుందనే ప్రశ్న తలెత్తుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇంధనం, విద్యుత్ కొనుగోలు వ్యయం సర్దుబాటు (ఎఫ్ పిపిసిఎ) కింద హిందూజాకు చెల్లించిన మొత్తాలను ట్రూ అప్ క్లెయిము చేస్తే, అది తన ఉత్తర్వుకు విరుద్ధంగా ఉంటే ఆ క్లెయిమును తిరస్కరిస్తా మని 2023-24 సంవత్సరానికి ఇచ్చిన చార్జీల ఉత్తర్వులో కమిషన్ వెలిబుచ్చిన అభిప్రాయం ప్రకారం జరిగితే, ఆ మొత్తాలను డిస్కాంల 3 నష్టాలుగా భరించాల్సి వస్తుంది. ఆ మొత్తాలను హిందూజా నుండి తిరిగి రాబట్టాలని కమిషన్ ఆదేశిస్తే, అది తదుపరి వివాదాలకు దా రి తీస్తుంది. న్యాయం ఆలస్యమైతే న్యాయం జరగనట్లే అనే నానుడి వాస్తవికమైనది.

ఎవరైనా కార్డు రాసినా, పత్రికలలో, ఇతర మాధ్యమాలలో వార్తగా వచ్చినా సంబంధిత అంశాన్ని సుప్రీం కోర్టుతో సహా న్యాయస్థానాలు త మంత తాము విచారణను చేపడుతున్న ఉదంతాలు ఉంటున్నాయి. కమిషన్ ఉత్తర్వును ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వం డిస్కాంలతో అదనపు చెల్లింపులు చేయించేందుకు తీసుకొంటున్న చర్యలను ఉన్న సమాచారం మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి డిస్కాంల వార్షిక ఆదాయ అవసరాలు, చార్జీల సవరణ ప్రతిపాదనలపై కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణలో లిఖిత పూర్వకంగా, మౌఖికంగా కూడా కమిష న్ దష్టికి తెచ్చాము. ఈ చెల్లింపులు జరపకుండా డిస్కాములను ఆదేశించాలని కోరాము.

కమిషన్కు సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలు చ ట్టరీత్యా ఉన్నాయి. సంబంధిత వ్యవహారానికి సంబంధించిన రికార్డులను సమర్పించాలని తనంతతాను ఆదేశించే అధికారం కమిషన్కు ఉ ంది. దానిపై విచారణ జరిపించే అధికారం కూడా కమిషన్కు ఉంది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అధికారం కూడా ఉంది. ఇలాంటి వ్య వహారాలలో కమిషన్ తన అధికారాలను సకాలంలో, సముచితంగా వినియోగిస్తే, విశాల ప్రజా ప్రయోజనాన్ని పరిరక్షించే అవకాశం ఉంది.

డిఎస్‌సి-98 ఉద్యోగాలను పూర్తిగా భర్తీ చేయాలి

- రిజర్వేషన్లు అమలు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 'డిఎస్‌సి-1998' పోస్టులను కుదించడమే కాకుండా రిజర్వేషన్లు అమలు జరపకపోవడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. 98 డిఎస్‌సిలో 7 వేలకు పైచిలుకు ఖాళీలు ఉండగా, 4,534 ఖాళీలు మాత్రమే ఉన్నట్లు ప్రకటించి 4,072 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించారని, పోస్టులు లేవని ప్రకటించిన జిల్లాలకు ఇతర జిల్లాల మాదిరే సర్దుబాటు చేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రకటించిన పోస్టులను రిజర్వేషన్ల కోటా ప్రకారం పూర్తిగా భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో 23 వేల టీచర్ పోస్టుల ఖాళీలు ఉన్నాయని, అధికారంలోకొస్తే వాటిని భర్తీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటి వరకు ఒక్క పోస్టునూ భర్తీ చేయలేదని విమర్శించారు. నాలుగు సంవత్సరాల్లో ఒక్క డిఎస్‌సి కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించలేదని తెలిపారు. వేలాది పోస్టులు ఖాళీలున్నా వాటిని నింపకుండా స్కూళ్లను విలీనం చేసి, తరగతులను కుదించి, ఖాళీలను తగ్గించారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు పొంతనలేని లెక్కలు చెబుతూ, నిబంధనల సాకులు చూపుతూ నిరుద్యోగ యువతను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు.

ఇప్పటికైనా మెగా డిఎస్‌సి నిర్వహించి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ ఖాళీలను పూర్తి చేస్తేనే అందరికీ నాణ్యమైన ప్రభుత్వ విద్య అందుబాటులోకి వస్తుందని సూచించారు. బైజూస్ వంటి కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని టీచర్ల సంఖ్యను కుదిస్తే ఉన్న చదువులు అంటకాగుతాయని వివరించారు. డిఎస్‌సి-98 అర్హులైన అభ్యర్థులందరికీ ఉద్యోగాలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిందని, కటాఫ్ పద్ధతిలో ఎంపిక వల్ల, రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడం వల్ల వందల సంఖ్యలో అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమవుతున్నారని వివరించారు. ఇది ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. కొన్ని జిల్లాలకు మాత్రమే ఎస్‌జిటి పోస్టుల సర్దుబాటు చేస్తున్నారని, ఆ పద్ధతిలోనే అన్ని జిల్లాలకూ సర్దుబాటు చేసి పోస్టులు కల్పించాలని డిమాండ్ చేశారు. జరిగిన లోపాలను సరిదిద్ది 98 డిఎస్‌సి, 2023 మెగా డిఎస్‌సికి వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు.

వృత్తిపట్ల నిబద్ధతతో మంచి ఫలితాలు

- అటవీశాఖ ప్రధాన అధికారి మధుసూదనరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వృత్తిపట్ల నిబద్ధత, ధృడ సంకల్పం ఉంటే ఫలితాలు వాటంతట అవే వస్తాయని రాష్ట్ర అటవీశాఖ ప్రధాన సంరక్షణ అధికారి వై మధుసూదనరెడ్డి అన్నారు. అటవీశాఖలో పనిచేస్తున్న 76 మంది సూపరింటెండెంట్లు, 9 మంది మేనేజర్లకు ప్రభుత్వం గెజిటెడ్ హోదా కల్పించిన సందర్భంగా అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఎంతోకాలంగా చిరకాల వాంఛగా ఉన్న ఈ హోదా సాధించడంలో సిబ్బంది కృషి ఉందని తెలిపారు. అటవీశాఖ అభివృద్ధికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని తెలిపారు. ఎపి ఫారెస్ట్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు పద్మావతి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిసిసిఎఫ్‌లు ఎకె నాయక్, ఖజారియా, గోపినాథ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధుసూదనరెడ్డిని ఘనంగా సన్మానించారు.

'పట్టు' జారుతోంది !

- కేటాయించిన నిధులూ ఖర్చు చేయని వైనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి నోచుకోవడం లేదు. బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేస్తున్నా..ఆ మేరకు కూడా నిధులను ఖర్చు చేయడం లేదు. దీంతో పట్టు పరిశ్రమ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల కింద ఈ శాఖకు రూ.9,971.79 కోట్లు కేటాయించారు. ఇందులో కేవలం రూ.2,880.8 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన రూ.7,090.99 కోట్లు రెవెన్యూ హెడ్ కింద చూపారు. 2022-23 బడ్జెట్ అంచనాలు రూ.9,899.40 కోట్లు కేటాయించి, సవరణల సమయంలో రూ.6,559.53 కోట్లకు కుదించారు. 2023-24లో కేంద్ర సహాయ రాష్ట్ర అభివృద్ధి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.1,586.90 కోట్లు, షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక కాంపోనెంట్ ప్లాన్ కింద మరో రూ.87.81 కోట్లు, ట్రైబల్ ఏరియా సబ్‌ప్లాన్ కింద ఇంకో రూ.42.36 కోట్లు, రాష్ట్ర పట్టు పురుగుల పెంపకం పథకాల అమలు కోసం రూ.900 కోట్లు, షెడ్యూల్డ్ కులాలకు ప్రత్యేక అంశ ప్రణాళిక కింద రూ.11.43 కోట్లు, షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళిక కోసం రూ.252.30 కోట్లు కేటాయించారు. కేటాయింపులు చేసినా..ఆ నిధులను ఖర్చు చేయకపోతే పట్టు పరిశ్రమ ఎలా అభివృద్ధి చెందుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

'రాహుల్' విషయంలో కోర్టు తీర్పును గౌరవించాల్సిందే

- మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ విషయంలో కోర్టు తీర్పును ఎవరైనా గౌరవించాల్సిందేనని మాజీ సిఎం, బిజెపి నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విభజన హామీలు అమలు చేయడం సాధ్యం కాదని, ఫలితంగా కాంగ్రెస్ పార్టీ నష్టపోతుందని రాష్ట్ర విభజన సమయంలో అధిష్టానానికి చెప్పి కాంగ్రెస్ పార్టీని వీడానన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో ఆయన మాట్లాడారు. చాలా ప్రాంతీయ పార్టీలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లా పనిచేస్తున్నాయనేది తమ అభిప్రాయమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు విషయంలో జాతీయ విధానాన్నే అమలు చేస్తున్నారని, నష్టం వచ్చే పరిశ్రమలు నడిపితే ప్రజాధనం వృథా అవుతుందన్నారు. ప్లాంటును లాభాల్లోకి ఎలా తేవాలనేది కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. బిజెపిలో పదవులు ఆశించి చేరలేదని, రానున్న ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేయాలా? లేదా అనే విషయం బిజెపి అగ్రనాయకత్వం నిర్ణయిస్తుందన్నారు. మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి పురంధేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఎఫ్ గీతాతో మంత్రి సీతారామన్ భేటీ



వాషింగ్టన్ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపినాథ్‌తో భేటీ అయ్యారు. అమెరికా పర్యటనలో ఉన్న సీతారామన్ ప్రపంచ బ్యాంకు వార్షిక సదస్సులో పాల్గొన్నారు. ఈ భేటీలో రుణ సమస్యలు, క్రిప్టో కరెన్సీ, ప్రపంచ ఆర్థిక పరిణామాలు తదితర అంశాలపై చర్చించారు. సీతారామన్‌తో మంచి చర్చలు జరిగాయని, జి20కి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్ రుణ సమస్యలు, క్రిప్టో సవాళ్లపై పురోగతి సాధిస్తుందని గీతా గోపినాథ్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఐఎంఎఫ్‌లో కీలక హోదాలో నియమితులైన గీతాను మంత్రి ప్రశంసించారు.

వాకపల్లి ఘటనపై నేడు వెబినార్

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

వాకపల్లి అత్యాచార ఘటనపై నేడు వెబినార్ జరుగుతుందని ఐద్వా నాయకులు రమాదేవి, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నాయకులు దుర్గాభవానీ, ఐప్వా నాయకులు అరుణ తదితరులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ వెబినార్లో ఎక్కువమంది పాల్గొనాలని కోరారు.

సమగ్ర శిక్షలో అభ్యర్థులకు జీతాలు ఇవ్వాలి

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగు ఉద్యోగులకు మార్చి, ఏప్రిల్ నెల జీతాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి కోరారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. వారికి జీతాలు చెల్లించడంతోపాటు వేతనాలు పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారని, అయినా స్పందన లేదని తెలిపారు.

అమ్మకానికి ట్విట్టర్..!

- సరైన వ్యక్తి దొరికితే వదిలేస్తా
- ఎలన్ మస్క్ వెల్లడి

వాషింగ్టన్ : ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్‌ను నడపడం ఎలన్ మస్క్‌తో కావడం లేదని సంకేతాలు వస్తోన్నాయి. ఆ విషయం ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ మాటల్లోనే స్పష్టమయ్యింది. సరైన వ్యక్తి దొరికితే సంస్థను అమ్మేస్తానని బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మస్క్ పేర్కొనడమే ఇందుకు నిదర్శనం. గతేడాది ఈ సంస్థను 44 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.5 లక్షల కోట్లు)కు మస్క్ కొనుగోలు చేశారు. కొనుగోలు అనంతరం ఆయన అనుభవాలను బిబిసితో పంచుకున్నారు. ట్విట్టర్‌ను కొనుగోలు చేసినందుకు తానేమీ బాధపడటం లేదన్నారు. " గత కొన్ని నెలలుగా చాలా ఒత్తిడితో కూడుకున్న పరిస్థితి. పనిభారం సవాల్‌గా ఉంది. ఆఫీసులో నిద్రపోవాల్సి వస్తుంది." అని మస్క్ పేర్కొన్నారు.

ఎక్స్‌లో విలీనం

ఎక్స్ అనే ఎవ్రీథింగ్ యాప్‌లో ట్విట్టర్‌ను కలిపేసినట్టు ఆ సంస్థ మంగళవారం తెలిపింది. ప్రస్తుతం ట్విట్టర్ సంస్థ స్వతంత్ర కంపెనీగా మనుగడలో లేదంటూ ఓ కేసు నిమిత్తం కోర్టుకు సమర్పించిన సమాచారంలో మస్క్ స్పష్టం చేశారు. తాను ట్విట్టర్‌ను కొనుగోలు చేస్తే తన ఎక్స్‌లో కలిపేస్తానని మాస్క్ ఐదేళ్ల క్రితమే తెలిపారు. తాజాగా ఈ పరిణామాన్ని ధృవీకరిస్తూ తాజాగా ఎలాన్ మస్క్ 'ఎక్స్' అనే అక్షరాన్ని ట్వీట్ చేశారు. ట్విట్టర్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత సగం మంది పైగా ఉద్యోగులను మస్క్ తొలగించారు. నిర్వహణలో అనేక మార్పులు చేపట్టారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు కొరియన్ బ్యాంక్ నిధులు

అహ్మాదాబాద్ : కొరియాకు చెందిన ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ బ్యాంక్‌తో ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ బ్యాంకుతో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా కొరియన్ బ్యాంక్ నుంచి 300 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.2400 కోట్లు) రుణ మద్దతును పొందనుంది. కొరియన్ ఎగ్జిమ్‌బ్యాంక్‌తో చేసుకున్న ఒప్పందం భారత్, కొరియా మధ్య వాణిజ్యం, పెట్టుబడులకు మద్దతు ఇస్తూ మరింత బలోపేతం కావడానికి దోహదం చేయనుందని ఆ బ్యాంక్ పేర్కొంది.

మయన్మార్ సైనిక జుంటాపై చర్యలు తీసుకోండి

- అంతర్జాతీయ సమాజాన్ని కోరిన ప్రతిపక్షాల నేతలు

నెపిడా : మయన్మార్ సైనిక జుంటాపై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలని మయన్మార్ ప్రతిపక్ష నేతలు కోరారు. ఈ మేరకు ప్రతిపక్ష పార్టీలు, జుంటాను వ్యతిరేకించే జాతుల గ్రూపులతో కూడిన జాతీయ ఐక్యతా సంప్రదింపుల మండలి (ఎన్‌యుసిసి) ఒక ప్రకటన జారీ చేసింది. మయన్మార్‌లోని సైనిక పాలకులు యుద్ధ నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. మయన్మార్‌లోని సాగాయింగ్ ప్రావిన్స్‌లోమంగళవారం సైన్యం చేసిన వైమానిక దాడుల్లో పిల్లలు, మహిళలతో సహా 60మంది పౌరులు మరణించిన నేపథ్యంలో ఈ డిమాండ్ వెలువడింది. యుద్ధ విమానం పౌర ఆవాసాలపై బాంబు దాడులు చేయడంతో పాటూ ఐదు నిముషాల తర్వాత రెండు రాకెట్లు, మెషిన్ గన్ దాడులు కూడా చోటు చేసుకున్నాయి. చిన్, కచిన్, సాగాయింగ్ ప్రాంతాల్లో పౌరులపై మయన్మార్ మిలటరీ మరిన్ని వైమానిక దాడులు జరిపే అవకాశం వుందని ఎన్‌యుసిసి వర్గాలు తెలిపాయి. మంగళవారం నాటి దాడికి ముందు రోజు చిన్ రాష్ట్రంలోని ఫలమ్‌టౌన్‌షిప్‌లో జరిగిన దాడిలో ముగ్గురు మహిళలతో సహా 9మంది పౌరులు మరణించారు. మయన్మార్‌లోని మెజారిటీ ప్రాంతాలు ఎత్నిక్ రెసిస్టెంట్ ఆర్గనైజేషన్స్ (ఇఆర్‌ఓఎస్) నియంత్రణలో వున్నాయి. ఈ దాడుల్లో మరణించినవారికి న్యాయం జరిగేలా చూసేందుకు తాము కట్టుబడి వున్నామని ఎన్‌యుసిసి తెలిపింది.

విదేశీ మద్దతుదారులకు గట్టి హెచ్చరికలే !

- తైవాన్ చుట్టూ విన్యాసాలపై చైనా

బీజింగ్ : తైవాన్‌ను చుట్టుముడుతూ ఇటీవల చైనా చేసిన వైమానిక, సముద్ర విన్యాసాలు తైవాన్ స్వాతంత్ర్య అనుకూల రాజకీయ నేతలకు, వారి విదేశీ మద్దతుదారులకు తీవ్ర హెచ్చరిక అని చైనా ప్రతినిధి బుధవారం తెలిపారు. జాయింట్ స్వార్డ్ పేరుతో మూడు రోజుల పాటు పెద్ద ఎత్తున సాగించిన వైమానిక, సముద్ర విన్యాసాలు సోమవారంతో ముగిశాయి. గత వారంలో తైవాన్ అధ్యక్షురాలు త్సాయి ఇంగ్ వెన్ కాలిఫోర్నియాలో అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌తో భేటీ అయిన నేపథ్యంలో చైనా హెచ్చరికలు వెలువడ్డాయి. తైవాన్ జలసంధిలో, చుట్టుపక్కల జలాల్లో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఇటీవల పలు చర్యలను చేపట్టింది. తైవాన్ స్వాతంత్ర్య అనుకూల శక్తులు విదేశీ శక్తులతో కుమ్మక్కవడాన్ని నిరసిస్తూ హెచ్చరికగా చైనా ఈ విన్యాసాలు చేపట్టిందని తైవాన్ వ్యవహారాల కార్యాలయ ప్రతినిధి ఝూ ఫెంగ్లియాన్ తెలిపారు. దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించుకోవడానికి ఇది అవసరమైన చర్య అని ఆమె వ్యాఖ్యానించారు. తైవాన్ తమ స్వంత భూభాగమని, అవసరమైతే బలవంతంగానైనా తమ నియంత్రణలోకి తెచ్చుకోగలమని చైనా చెబుతోంది. తైవాన్‌లోని మెజారిటీ ప్రజలు ప్రస్తుతమున్న డీ ఫ్యాక్టో స్వతంత్ర హోదాను కొనసాగించడానికే సుముఖంగా వున్నారు. తైవాన్ ఇప్పటికే స్వతంత్ర దేశంగా వున్నందున లాంఛనంగా ప్రకటించాల్సిన అవసరం లేదని త్సాయి పేర్కొంటున్నారు.

'వందేభారత్' సరే... ప్యాసింజర్ రైళ్లేవి..?

- కోవిడ్ పేరుతో సికింద్రాబాద్- తిరుపతి మధ్య 16 ప్యాసింజర్ రైళ్లు రద్దు

- కరోనా తగ్గుముఖం పట్టినా పునరుద్ధరించని వైనం
- సామాన్యులు రైలు ఎక్కలేని దుస్థితి
- ఆదాయమే పరమావధిగా 'రైల్వేశాఖ'



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అతి తక్కువ సమయంలోనే దూర ప్రాంతాలకు చేరుకోడానికి భారతీయ రైల్వే సికింద్రాబాద్- తిరుపతి మధ్య 'వందేభారత్' రైలును తీసుకొచ్చింది. ఈ రైలును ప్రధానమంత్రి మోడీ స్వయంగా సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చి ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. వందే భారత్ రైలు సికింద్రాబాద్- తిరుపతి మధ్య ఎనిమిదిన్నర గంటల్లో వాయువేగంతో ప్రయాణిస్తుందని, సరసమైన ధరలతో ప్రయాణికులకు ఆహ్లాదకరమైన సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చామని మోడీ ప్రకటించారు. అయితే నిరుపేదలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్ల రద్దు పరిస్థితేంటని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ జనరల్ బోగీలను తగ్గించి సామాన్యులు రైలుఎక్కే పరిస్థితి లేకుండా చేశారు. తిరుపతి నుంచి నలుమూలలకు ప్రయాణించే 16 ప్యాసింజర్ రైళ్లను కోవిడ్ బూచి పేరుతో రద్దు చేసేశారు. రైతులకు, చిరువ్యాపారులకు, చిరు ఉద్యోగులకు, కూలీలకు అందుబాటులో లేకుండా చేశారు. దీన్నిబట్టి కేంద్ర రైల్వేశాఖ ఆదాయమే పరమావధిగా పనిచేస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతి నుంచి వివిధ ప్రాంతాలకు 2021కి ముందు వరకు 16 ప్యాసింజర్ రైళ్లు నడిచేవి. తిరుపతి - గుంతకల్ (2), తిరుపతి - కాట్పాడి (4), తిరుపతి - హుబ్లీ (2), తిరుపతి - గూడూరు (3), తిరుపతి - మచిలీపట్నం (1), తిరుపతి - పాండిచ్చేరి (1), తిరుపతి - మద్రాస్ (2), తిరుపతి - ధర్మవరం (1) ప్యాసింజర్ రైళ్లు సామాన్యులకు అందుబాటులో ఉండేవి. కోవిడ్ కారణంగా కొన్ని నెలల పాటు ఏ రైలూ పట్టాలెక్కలేదు. కోవిడ్ తగ్గుముఖం పట్టిన తరువాత కేవలం ఎక్స్‌ప్రెస్‌లను మాత్రమే పునరుద్ధరించారు. ప్యాసింజర్ రైళ్లను స్పెషల్ ట్రెన్‌లుగా మార్చేశారు. గతంలో సంక్రాంతి, దసరా రద్దీ దృష్ట్యా స్పెషల్ ట్రెన్‌లను నడిపేవారు. ప్రస్తుతం ప్యాసింజర్ రైళ్లలో 40 శాతం ఛార్జీలను పెంచి ఏడాదంతా 'స్పెషల్' పేరుతో నడుపుతున్నారు. ప్యాసింజర్ రైలు అంటే పేదల బండి. ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు, బస్సు ఛార్జీలు చెల్లించలేనివారు ప్యాసింజర్ రైళ్లనే ఎక్కువగా ఆశ్రయించేవారు. తిరుపతి నుంచి గూడూరుకు ప్యాసింజర్ రైలులో రూ.35 ఛార్జీ ఉండేది. దాన్నే రూ.90 చేశారు. తిరుపతి నుంచి చిత్తూరుకు రూ.25 ఛార్జీ ఉంటే ప్రస్తుతం రూ.60కి పెంచారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి



కోవిడ్ సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను వెంటనే కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలి. ఛార్జీలను పెంచి రైలుబండిని పేదలకు దూరం చేశారు. వందేభారత్ రైల్లో వేలకు వేలు ఛార్జీలు వసూలు చేస్తూ డబ్బున్నవారికి అందుబాటులోకి తెచ్చారు. నారాయణాద్రి రూట్‌లో నడుస్తున్న వందేభారత్ రైల్లో నాలుగు స్టాపింగ్‌లే ఉన్నాయి. అదే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ 14 స్టాపింగ్‌లలో నిలుపుతూ ఆయా ప్రయాణికులకు అందుబాటులో ఉంది. ప్యాసింజర్ రైళ్లు ఉద్యోగులకు, చిరువ్యాపారులకు, వలస కూలీలకు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ప్యాసింజర్ రైళ్లు లేకపోవడంతో వారికి 'స్పెషల్ ఎక్స్‌ప్రెస్'లలో ప్రయాణం భారంగా మారింది.

- సుదర్శన్‌రాజు, రైల్వే మజ్దూర్ సంఘ్ గౌరవాధ్యక్షులు, గుంతకల్

అదాని గ్రూపులో కొనసాగుతున్న ఎల్‌ఐసి పెట్టుబడులు

- హిండెన్‌బర్గ్ రిపోర్ట్ తర్వాత పెరిగిన వాటాలు

న్యూఢిల్లీ : అదాని గ్రూపునపె తీవ్ర విమర్శలు వస్తున్న వేళ మరోవైపు ఆ సంస్థలో లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) పెట్టుబడుల పరంపర మాత్రం కొనసాగుతుంది. అదానిపై హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌నకు తోడు ప్రతిపక్షాల విమర్శలు పెరుగుతున్న ప్రస్తుత సమయంలోనూ ఎల్‌ఐసి వాటాలు పెరగడం గమనార్హం. అదాని కంపెనీలపై ఆర్థిక అవకతవకాలు, మోసాలపై ఆరోపణాలు వెళ్లువెత్తడంతో ఇటీవల ఆ కంపెనీల షేర్లు భారీ పతనాన్ని చవి చూశాయి. దీంతో ఎల్‌ఐసి తీవ్ర నష్టాలను ఎదురు చూసింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికం (క్యూ4)లో అనేక మ్యూచువల్ ఫండ్ సంస్థలు, విత్త సంస్థలు అదాని గ్రూపులో వాటాలను తగ్గించుకోగా.. ఎల్‌ఐసి వాటాలు మాత్రం స్వల్పంగా పెరిగాయి. నాలుగు అదాని కంపెనీల్లో ఎల్‌ఐసి వాటాలు పెరగ్గా మరో రెండింటిలో తగ్గాయి. గడిచిన క్యూ4లో అదాని ఎంటర్‌ప్రైజెస్‌లో ఎల్‌ఐసి వాటా 4.23 శాతం నుంచి 4.26 శాతానికి పెరిగింది. అదాని గ్రీన్ ఎనర్జీలో 8 బేసిస్ పాయింట్లు పెరిగి 1.36 శాతానికి చేరాయి. అదానీ టోటల్ గ్యాస్‌లో 5.96 శాతం వాటా 6.02శాతానికి ఎల్‌ఐసి వాటా పెంచుకుంది. అదానీ గ్రూప్‌లోని అంబుజా సిమెంట్స్‌లో 6.33 శాతంగా ఉన్న వాటాను 6.30 శాతానికి కోత పెట్టుకుంది. అదాని సెజ్‌లో వాటాలను 9.14 శాతం నుంచి 9.12 శాతానికి తగ్గించుకుంది. అదాని గ్రూపు కంపెనీల్లో మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు తమ వాటాను 1.19 శాతం నుంచి 0.87 శాతానికి తగ్గించుకున్నాయి. అదాని కంపెనీల్లో పెట్టుబడులుపెట్టిన ఎంఎఫ్ ఇన్వెస్టర్ల సంఖ్య 31 నుంచి 27కు తగ్గింది.

కర్నాటక బిజెపిలో అసమ్మతి సెగలు

- టికెట్ దక్కని నేతల తిరుగుబాటు
- పార్టీకి మాజీ డిప్యూటీ సిఎం లక్ష్మణ్ రాజీనామా
- రాజకీయాలకు మంత్రి అంగారా గుడ్‌బై



బెంగళూరు : మరికొన్నిరోజుల్లో జరగబోయే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల కోసం తొలి జాబితాను బిజెపి విడుదల చేయడంతో ఆ పార్టీలో అసమ్మతి సెగలు రేగాయి. మంగళవారం రాత్రి 189 మంది అభ్యర్థులతో బిజెపి జాబితాను విడుదల చేసింది. తొమ్మిది మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించింది. వీరిలో ఒక మంత్రి, మరో మాజీ మంత్రి కూడా ఉన్నారు. సీనియర్లను పక్కనపెట్టి 52 కొత్త ముఖాలను అభ్యర్థులుగా ప్రకటించింది. దీనిపై పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. జాబితాలో పేరు లేకపోవడంతో మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సావడి ఏకంగా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గురువారం సాయంత్రం ఒక బలమైన నిర్ణయానికి వస్తానని, శుక్రవారం నుంచి రంగంలోకి దిగుతానని ఆయన చెప్పారు. మంత్రి అంగారా అయితే రాజకీయాలకు గుడ్‌బై చెప్పేశారు. దక్షిణ కన్నడ జిల్లాలోని సులియా నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన ఈ మేరకు సంచలన ప్రకటన చేశారు. ఈ నెల 20వ తేదీ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కావడంతో బిజెపి పరిస్థితి మరింత దారుణంగా మారింది. తిరుగుబాటుదారుల సంఖ్యపై అప్పటికి పూర్తి సమాచారం అందే అవకాశం ఉంది. ప్రస్తుత ఎమ్మెల్యేలలో అనిల్ బెనాకే (బెళగావి ఉత్తర), హాలదీ శ్రీనివాస్ శెట్టి (కుందపురా), ఎస్. అంగార (సులియా), మహదేవప్ప శివలింగప్ప యాదవాడ్ (రామదుర్గ్), రమణ లమానీ (షిరాహట్టి), డీఎం బసవంత్ (కిత్తూరు) సహా పలువురికి పార్టీ అధిష్టానం టికెట్ నిరాకరించింది. దీనిపై యాదవాడ్, బెనాకే మద్దతుదారులు తమ తమ నియోజకవర్గాల్లో ఇప్పటికే నిరసన గళం విన్పిస్తున్నారు. ఉడిపిలో ప్రస్తుత ఎమ్మెల్యే రఘుపతి భట్‌కు టికెట్ నిరాకరించిన బిజేపీ నాయకత్వం యశ్‌పాల్ సువర్ణకు అభ్యర్థిత్వం కట్టబెట్టింది. అయితే గతంలో హిజాబ్ నిషేధంపై సువర్ణ చేసిన వ్యాఖ్యలు పార్టీకి ఇప్పుడు ఇబ్బందికరంగా మారాయి. మరోవైపు తనకు టికెట్ నిరాకరించడాన్ని భట్ బాహాటంగానే నిరసిస్తున్నారు. టికెట్ ఇస్తామంటూ చివరి నిమిషం వరకూ తనను ఊరించారని, చివరికి మొండిచేయి చూపారని ఆక్రోశం వెళ్లగక్కారు. టికెట్ ఇవ్వడం లేదని ముందుగానే చెప్పి ఉంటే సీనియర్ నేత ఈశ్వరప్ప మాదిరిగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండే వాడినని చెప్పారు. పుత్తూర్ ఎమ్మెల్యే, దక్షిణ కన్నడ బీజేపీ అధ్యక్షుడు సంజీవ మతందార్‌కు కూడా నిరాశే ఎదురైంది.



చైనా, బ్రెజిల్ మధ్య బంధం బలోపేతం!

- నాలుగు రోజుల పర్యటనకు చైనా చేరుకున్న లూలా
- 20 ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు?



బ్రసీలియా, బీజింగ్ : బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా బుధవారం నుండి నాలుగు రోజుల పాటు చైనాలో అధికార పర్యటన జరుపుతున్నారు. లూలా పర్యటనతో అభివృద్ధి చెందుతున్న దేశాలు అతి పెద్ద, ఆర్థిక వ్యవస్థలు కలిగిన చైనా, బ్రెజిల్‌లు రాజకీయ, ఆర్థిక సంబంధాలతో పాటూ మొత్తంగా ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త శకాన్ని ఆవిష్కరిస్తాయని భావిస్తున్నారు. మొత్తంగా ప్రపంచ దేశాల్లోకి సానుకూల ప్రేరణ, ఉత్సాహాన్ని నింపుతాయని పరిశీలకులు పేర్కొంటున్నారు. చైనావిదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ మంగళవారం పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, వందలాదిమంది వాణిజ్య ప్రముఖులు, రాష్ట్రాల గవర్నర్లు, కాంగ్రెస్ సభ్యులు, మంత్రులతో కూడిన అతి పెద్ద ప్రతినిధి బృందంతో లూలా చైనాలో పర్యటిస్తున్నారని, ఈ పర్యటనకు ఉభయ పక్షాలు అధిక ప్రాముఖ్యతను ఇస్తున్నాయని చెప్పారు. బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా చైనాలో పర్యటించడం ఇది మూడోసారి. వాస్తవానికి మార్చిలోనే ఈ పర్యటన జరగాల్సి వుంది. అయితే ఫ్లూ, న్యుమోనియాతో లూలా బాధపడుతుండడంతో పర్యటనను రీ షెడ్యూల్ చేశారు. బ్రెజిల్ పక్షంతో కలిసి పనిచేసేందుకు చైనా ఆసక్తిగా ఎదురుచూస్తోందని వెన్‌బిన్ పేర్కొన్నారు. వివిధ రంగాల్లో పరస్పరం లబ్ది చేకూర్చగల, స్నేహ సహకారాన్ని పెంచుకునేందుకు ఈ పర్యటనను అవకాశంగా తీసుకోవాలని భావిస్తున్నాయి. తద్వారా వర్ధమాన దేశాల సంఘీభావం, సహకారం, ప్రపంచ సవాళ్ళపై ఉమ్మడి ప్రతిస్పందనకు మరింత సానుకూల శక్తిని తీసుకురావడానికి ప్రయత్నించాలని భావిస్తున్నాయని వాంగ్ వెన్‌బిన్ పేర్కొన్నారు. షాంఘై నగరంలో బ్రిక్స్ నూతన అభివృద్ధి బ్యాంక్ హెడ్‌గా బ్రెజిల్ మాజీ అధ్యక్షురాలు దిల్మా రౌసెఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో లూలా పాల్గొననున్నారు. బీజింగ్‌లో అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని, పార్లమెంట్ స్థాయీ సంఘం చైర్మన్ తదితర ప్రముఖులతో భేటీ కానున్నారు. ఈ పర్యటన సందర్భంగా దాదాపు 20 ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు జరుగుతాయని భావిస్తున్నారు.


మెరుగైన వేతనాల కోసం...

- ఇంగ్లండ్‌వ్యాప్తంగా వేలాదిమంది డాక్టర్ల సమ్మె



లండన్ : వేతనాలపై చర్చలు జరిపేందుకు చేసిన విజ్ఞప్తులను ప్రభుత్వం తిరస్కరిస్తుండడంతో ఇంగ్లండ్‌లో వేలాదిమంది ఆస్పత్రి డాక్టర్లు తమ విధులను బహిష్కరించి, ఐదు రోజుల సమ్మెకు దిగారు.బుధవారం ఇది రెండో రోజుకు చేరుకుంది. ఇంగ్లండ్‌వ్యాప్తంగా పలుచోట్ల ఏర్పాటు చేసిన పికెటింగ్‌ల్లో పాల్గొన్న మెడికోలు వేతనాలు సరిగా లేకపోవడం వల్ల పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఫుడ్ బ్యాంక్‌లను ఉపయోగించుకోవడం, డబ్బుల కోసం తల్లిదండ్రులపై ఆధారపడడం వంటివి తప్పడం లేదని, అందువల్లే సరైన వేతనాల కోసం పోరాడాల్సిందేనని నిర్ణయించినట్లు చెప్పారు. వీరిలో కొంతమందికి గంటకు కేవలం 14పౌండ్లు మాత్రమే వస్తున్నాయి. 15ఏళ్ళ క్రితం నాటి వేతనాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సవాళ్ళతో కూడిన తమ రొటీన్ బిజీ బిజీగా వుంటుందని ఒక్కోసారి రోగులకు అవసరమైన సంరక్షణ కూడా తీసుకోలేకపోతున్నామని డాక్టర్ డొమినిక్ ఫెయిర్‌బ్రాస్(23) తెలిపారు. ఎన్‌హెచ్‌ఎస్‌కు సరిగా నిధులు లేకపోవడంతో ఆస్పత్రులు సిబ్బంది కోసం పోరాటాలు చేయాల్సి వస్తోంది. ఎన్‌హెచ్‌ఎస్‌లో 47వేల మంది నర్సులతో పాటూ 1,40,000మంది సిబ్బంది కొరతగా వున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు పెంచడానికి ప్రభుత్వం సముఖంగా లేదని డాక్టర్ ఫెయిర్‌బ్రాస్ అన్నారు. స్వదేశంలో వుండి ఎదుగుదలకు సరైన అవకాశాలు లేకపోవడంతో తన సహచరులు చాలా మంది ఆస్ట్రేలియా,న్యూజీలాండ్, ఐర్లాండ్ వంటి దేశాల వైపు దృష్టి సారిస్తున్నారని అన్నారు. కాగా ప్రస్తుత పరిస్థితుల్లో వరుసగా నాలుగు రోజుల పాటు బిఎంఎ సమ్మెకు పిలుపివ్వడం తీవ్ర విచారకరమైన అంశమని ఆరోగ్య మంత్రి స్టీవ్ బార్క్లే వ్యాఖ్యానించారు.

మహీంద్రా మాజీ ఛైర్మన్ కేషుబ్ మహీంద్రా కన్నుమూత



ముంబయి : మహీంద్రా అండ్ మహీంద్రా గౌరవ ఛైర్మన్ కేషుబ్ మహీంద్రా మరణించారు. 99 ఏళ్ల కేషుబ్ బుధవారం ముంబయిలో కన్నుమూశారు. 1947లో మహీంద్రా గ్రూప్‌లో చేరిన కేషుబ్ 48 సంవత్సరాల పాటు కంపెనీకి ఛైర్మన్‌గా నాయకత్వం వహించారు. ప్రస్తుత ఎంఅండ్ఎం ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాకు మేనమామ అవుతారు. 1963 నుంచి 2012 వరకు ఛైర్మన్‌గా కొనసాగి.. అనంతరం తన వారసుడిగా మేనల్లుడు ఆనంద్ మహీంద్రాకు తన బాధ్యతలను అప్పగించారు. మహీంద్రా గ్రూపును వాహన రంగం నుంచి సాఫ్ట్‌వేర్, రియాల్టీ, రక్షణ, ఇంధన తదితర బహుళ రంగాల్లోకి విస్తరించిన ఘనత కేషుబ్‌దే.

చిలీలో పనివేళలు తగ్గింపు

- ఐదేళ్లలో 45 నుండి 40గంటలకు కుదింపు

శాండియాగో : వచ్చే ఐదేళ్ళలో పని వారాన్ని 45 గంటల నుండి 40గంటలకు తగ్గించడానికి ఉద్దేశించిన బిల్లును చిలీ పార్లమెంట్ అత్యధిక మెజార్టీతో ఆమోదించింది. వామపక్ష సంఘటన ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మికుల హక్కుల పురోగతిగా అభివర్ణించింది. 127-14 ఓట్లతో దిగువ సభ ఈ చర్యను ఆమోదించింది. మూడు వారాల క్రితం సెనెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గతేడాది మార్చిలో అధికారంలోకి వచ్చిన అధ్యక్షుడు గాబ్రియెల్ బొరిక్ తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నెరవేర్చారు. మే 1వ తేదీలోగా ఈ బిల్లుపై సంతకం చేసి చట్టంగా తేనున్నారు. కార్మికుల హక్కులను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మార్పులు చేశామని కార్మిక శాఖ మంత్రి జెనెటి జారా తెలిపారు. ఈ బిల్లును ఆరేళ్ళ క్రితం ప్రవేశపెట్టినప్పటికీ, వామపక్ష ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే దీనికి మోక్షం లభించింది. పని వారాన్ని చిలీలో తగ్గించడం ఇది రెండవసారి. మొదటగా 2005లో 48గంటలు వున్న పని కాలాన్ని 45గంటలకు కుదించారు. ఇప్పుడు 45 గంటల నుండి 40గంటలకు తగ్గించారు. ఈ చర్య పట్ల కార్మికులు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబంతో, పిల్లలతో ఈ సమయం గడిపేందుకు ఉపకరిస్తుందని సంతోషపడు తున్నారు.

ఇది పత్రికా స్వేచ్ఛపై సెన్సార్‌షిప్ !

ఐటి నిబంధనల చట్టానికి సవరణలపై ఐఎన్‌ఎస్ వ్యాఖ్య

న్యూఢిల్లీ : ఐటి నిబంధనల చట్టం, 2021కి చేసిన సవరణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్‌ఎస్) బుధవారం కేంద్రాన్ని కోరింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సమాచారం బూటకమా లేక తప్పుదారి పట్టించేదా అని తనిఖీ చేసి ముద్ర వేసేందుకు నిజ నిర్ధారణ సంస్థను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వాన్ని అనుమతించే నిబంధన భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించడమే కాగలదని, సెన్సార్‌షిప్‌తో సమానమవుతుందని ఐఎన్‌ఎస్ పేర్కొంది. కొత్తగా సవరించిన నిబంధనల ప్రకారం, నిజ నిర్ధారణ సంస్థను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖకు అధికారం వుంటుందని ఐఎన్‌ఎస్ తెలిపింది. బూటకపు సమాచారమని భావించిన దాన్ని తొలగించడానికి సంబంధించి కూడా ఇటువంటి సంస్థకు విస్తృతాధికారాలను ఇవ్వడం నిరంకుశ చర్య అని ఐఎన్‌ఎస్ విమర్శించింది. ఎదుటి పక్షాల వాదనలను వినికుండా చర్యలు తీసుకోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. పైగా ఇటువంటి సంస్థకు పాలనా యంత్రాంగం ఏ రీతిన వుండబోతోందో కూడా ఆ నిబంధనల్లో లేదని పేర్కొంది.

ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యాంశాల తొలగింపును వెనక్కి తీసుకోవాలి

- ఎఐఎడబ్ల్యుయు డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్‌సిఇఆర్‌టి చరిత్ర సిలబస్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులను ఆల్ ఇండియా అగ్రికల్చరల్ వర్కర్స్ యూనియన్ (ఎఐఎడబ్ల్యుయు) కేంద్ర వర్కింగ్ కమిటీ ఖండించింది. ఈ మేరకు బుధవారం ఎఐఎడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయ రాఘవన్, బి.వెంకట్ ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో పాఠ్యాంశాల తొలగింపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'కింగ్స్ అండ్ క్రానికల్స్'కి సంబంధించిన అధ్యాయాలు, అంశాలు మొఘల్ కోర్టులు, 2002 గుజరాత్ అల్లర్లు, కుల వ్యవస్థకు సంబంధించిన అన్ని సూచనలు, నిరసనలు, సామాజిక ఉద్యమాలపై అధ్యాయాలను, మహాత్మా గాంధీని హిందూ తీవ్రవాది గాడ్సే హత్య చేయడం, గాంధీ హత్య తరువాత రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)పై విధించిన నిషేధం వంటి ప్రస్తావనలు తొలగించారని తెలిపారు. పదో తరగతికి సంబంధించి నవీకరించబడిన ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యాంశాలు 'డెమోక్రటిక్ పాలిటిక్స్' పాఠ్యపుస్తకం నుండి 'ప్రజాస్వామ్యం, వైవిధ్యం,' 'ప్రజా పోరాటాలు, ఉద్యమం,' 'ప్రజాస్వామ్యానికి సవాళ్లు' అనే అధ్యాయాలను తొలగించారని అన్నారు. ఇది హిందూ రాష్ట్రానికి సంబంధించిన ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనను ప్రోత్సహించడానికి, దేశ బహువచన చరిత్రను తుడిచివేయడానికి చేసిన ప్రయత్నమని విమర్శించారు. ఇది చాలా ఆందోళనకరమైనదని, రాజ్యాంగంలో ఊహించిన ప్రజాస్వామ్య, లౌకిక దేశాన్ని విశ్వసించే సమాజంలోని అన్ని వర్గాలు ప్రతిఘటించాలని పిలుపు ఇచ్చారు. విద్య నిజమైన ఉద్దేశ్యం నిష్పాక్షిక దృక్పథాన్ని అందించడం, దేశంలోని మొఘలులు, ఇతర మైనారిటీల చరిత్ర లేకుండా మన చరిత్ర అసంపూర్ణమని పేర్కొన్నారు. దేశ విభజన కారణంగా ఏర్పడిన మతపరమైన ఉద్రిక్తతలు, తీవ్రవాదుల పాత్రను మరచిపోవ డాన్ని ఎలా ఊహించగలమని అన్నారు. ఈ వాస్తవాలు ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి ఎప్పటికీ వ్యతిరేకమని, అందువల్ల యువ మనస్సుల నుండి వాస్తవికతను దాచాలనుకుంటున్నారని అన్నారు.

భారత్‌లో తీవ్ర మానసిక ఆరోగ్య సంక్షోభం

న్యూఢిల్లీ : దేశ ప్రజానీకంలో మానసిక అశాంతి పెరిగిపోతోంది. కుటుంబాల ఆరోగ్య బడ్జెట్‌పై ఇది ప్రతికూల ప్రభావం చూపుతోంది. దేశంలోని 20 శాతం కుటుంబాలలో ఒక్కరైనా మానసిన రుగ్మతతో బాధపడుతున్నారు. పేదరికం వారిని కుంగదీస్తోంది. భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) జరిపిన తాజా అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2018 జూలై-డిసెంబర్ మధ్యకాలంలో నిర్వహించిన జాతీయ శాంపిల్ సర్వే (ఎన్‌ఎస్‌ఎస్)లో 1.18 లక్షల కుటుంబాలకు చెందిన 5.76 లక్షల మందిని ఇంటర్వ్యూ చేశారు. ఈ సర్వే సందర్భంగా 6,679 మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. దేశంలో ఈ తరహా సర్వే నిర్వహించడం ఇదే మొదటిసారి. ఆరోగ్య పరిరక్షణ కోసం కుటుంబాలు చేస్తున్న వ్యయంలో 18.1 శాతం మానసిక అశాంతి పైనే అవుతోంది. అసాధారణ ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తన, సంబంధాలు, మానసిన అనారోగ్యాలు, ఒత్తిడి, మతిభ్రమణం, మేధోసంబంధమైన బలహీనతలు వంటి వాటిని మానసిక ఆరోగ్య అంశాలుగా వర్గీకరించారు.

దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే.. డామన్ డయ్యూ (23.4 శాతం), హిమాచల్‌ప్రదేశ్ (23.9 శాతం), సిక్కిం (31.9 శాతం) వంటి చిన్న ప్రాంతాలలోనే మానసిక రుగ్మతలపై పెడుతున్న ఖర్చు ఎక్కువగా ఉంటోంది. పెద్ద రాష్ట్రాలకు సంబంధించి మహారాష్ట్ర (21.3 శాతం), తెలంగాణ (22.2 శాతం)లలో ఖర్చు ఎక్కువగా ఉంటోంది. ఈ అధ్యయనం ప్రకారం 59.5 శాతం కుటుంబాలు ఆకస్మికంగా వచ్చిపడే ఆరోగ్య సమస్యలపై ఎక్కువ ఖర్చు పెడుతున్నాయి. భారత్ తీవ్రమైన ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఆరోగ్య సమస్యలలో ఆరో వంతు మానసిక ఆరోగ్యానికి సంబంధించినవేనని సర్వే ప్రస్తావించింది. ఒత్తిడి, వ్యాకులత, మానసిక అనారోగ్యాలు, మనోవైకల్యం వంటివి వీటిలో ఉన్నాయి. 'మొత్తంమీద 20.7 శాతం కుటుంబాలు పేదరికంలోకి వెళ్లిపోతున్నాయి. ఆరోగ్య సంబంధమైన ఖర్చులను తగ్గించుకోవాలంటే మానసిక ఆరోగ్య సమస్య లను ముందుగానే గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు సత్వరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది' అని అధ్యయన సహ రచయిత, కొచ్చిలోని అమృత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ సెంటర్ అధ్యాపకుడు డాక్టర్ డెన్నీ జాన్ తెలిపారు. మానసిన అనారోగ్యాలపై అవుతున్న ఖర్చును తగ్గించేందుకు ఆయా కుటుంబాలకు ఆర్థికంగా సాయపడాల్సి ఉంటుందని ఈ అధ్యయనం సూచించింది.

ఐఎంఎఫ్ గీతాతో మంత్రి సీతారామన్ భేటీ

వాషింగ్టన్ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపినాథ్‌తో భేటీ అయ్యారు. అమెరికా పర్యటనలో ఉన్న సీతారామన్ ప్రపంచ బ్యాంకు వార్షిక సదస్సులో పాల్గొన్నారు. ఈ భేటీలో రుణ సమస్యలు, క్రిప్టో కరెన్సీ, ప్రపంచ ఆర్థిక పరిణామాలు తదితర అంశాలపై చర్చించారు. సీతారామన్‌తో మంచి చర్చలు జరిగాయని, జి20కి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్ రుణ సమస్యలు, క్రిప్టో సవాళ్లపై పురోగతి సాధిస్తుందని గీతా గోపినాథ్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఐఎంఎఫ్‌లో కీలక హోదాలో నియమితులైన గీతాను మంత్రి ప్రశంసించారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం కొత్త నాటకం

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టుకు అపీలుకు కూడా వెళ్లలేని విధంగా ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం శోచనీయమన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రయివేటీకరణ చేయడం తప్ప ఒక్క నూతన పరిశ్రమనూ నెలకొల్పలేదని, కొత్తగా ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదని తెలిపారు. అప్పులను ఎగ్గొట్టే వ్యాపారవేత్తలకే బ్యాంకులు కూడా రుణాలు ఇస్తున్నాయని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.3 లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నా బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదని అన్నారు. జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ మరొకసారి అధికారంలోకి రావడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో మోడీ ఇచ్చిన హామీ ఏదీ నెరవేర్చలేదు సరికదా, సామాన్య ప్రజలపై విపరీతంగా ధరల భారాన్ని మోపారని తెలిపారు. నరేంద్ర మోడీకి అదాని, అంబానీలు తప్ప ప్రజలు కనిపించడం లేదని విమర్శించారు.

బిజెపిపై ఐక్య పోరు

(మొదటి పేజీ తరువాయి)

మరిన్ని పార్టీలను కలుపుకొస్తాం: నితీష్ కుమార్


నితీష్ కుమార్ మాట్లాడుతూ సాధ్యమైనన్ని పార్టీలను సమైక్యపరచి, కలిసికట్టుగా పని చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. "దేశంలో మరిన్ని పార్టీలను ఏకం చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తాం" అని అన్నారు. అంతకు ముందు ఆర్జేడి అగ్ర నేత లాలూ ప్రసాద్ యాదవ్ ను ఆయన కుమార్తె మీసా భారతి నివాసంలో నితీష్ కుమార్ కలిశారు.

దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది: కేజ్రీవాల్

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ను ఆయన నివాసంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, తేజస్వి యాదవ్ కలిశారు. అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ "ప్రతిపక్ష పార్టీలన్నింటినీ ఒకే తాటిపైకి తీసుకురావడానికి నితీష్ కుమార్ మంచి చొరవ తీసుకున్నారు. మేము దీనికి మద్దతిస్తాం" అని అన్నారు. దేశం చాలా క్లిష్ట పరిస్థితిల్లో ఉందని ఆయన అన్నారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఎన్నడూ లేనంత అవినీతికర ప్రభుత్వం నేడు ఉందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఇప్పటికే డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రేతో సహా పలువురితో మాట్లాడారు.



ఐకమత్యం



ఐకమత్యం అనే అడవిలో జంతువులు, పక్షులు అన్నీ కలిసి మెలిసి ఆనందంగా జీవించేవి. అందులో చిలుక, కాకి, కోయిల, నెమలి ఒక బృందంగా ఏర్పడి సంగీత, నాట్య కళాక్షేత్రం ఏర్పాటు చేసుకున్నాయి. చిలుక పాటలు రాసేది. కాకి దానికి సంగీతం అందించేది. కోయిల పాట పాడేది. ఆ పాటకు తగ్గట్టుగా నెమలి నాట్యం చేసేది. ఇలా అడవిలో ఎలాంటి పెళ్ళిళ్ళు, పేరంటాలుకు వెళ్లి ఆ నాలుగు పక్షులు వినోదం అందించేవి. దాంతో అడవిలో ఈ జీవులకు మంచి పేరు వచ్చింది. శుభకార్యం జరుపుకున్న అడవి జీవులు ఈ బృందానికి కొంత ఆహారాన్ని అందించేవి. వాటిని సమానంగా తినేవి.

ఇదంతా గమనించిన ఓ జిత్తులమారి నక్క ఎలాగైనా వారి మధ్య గొడవలు పెట్టి విడదీయాలని ఓ పథకం పన్నింది. చిలుక దగ్గరకు వెళ్ళి నువ్వు పాటలు రాయక పోతే మిగతా వారికి పేరు వచ్చేదా ? కనుక నువ్వే గొప్ప వారి కన్నా అన్నది. చిలుక నిజమే కదా అని ఆలోచనలో పడింది. నక్క కాకి దగ్గరకు వెళ్ళి నువ్వు సంగీతం ఇవ్వకుంటే మిగతా వారికి పేరు వచ్చేదా? కనుక నువ్వే గొప్ప వారి కన్నా అన్నది. కోయిల దగ్గరకు వెళ్ళి నువ్వు పాడకపోతే మిగతా వారికి పేరు వచ్చేదా? కనుక వారికన్నా నువ్వే గొప్ప అని చెప్పింది. చివరకు నక్క నెమలి దగ్గరకు వెళ్ళి నువ్వు నాట్యం చేయకపోతే మిగిలిన వారికి పేరు వచ్చేదా?అని అన్నది. జిత్తులమారి నక్క నలుగురి మధ్య చిచ్చు పెట్టి ఏం జరుగుతుందో చూద్దాం అని ఎదురు చూస్తోంది.

ఈ విషయం అంతా గమనించిన ఏనుగు, అడవికి రాజు అయిన సింహానికి జరిగిందంతా పూసి గుచ్చినట్లు చెప్పింది. అంతా విన్నా సింహం తన ఐకమత్యం రాజ్యానికి అనైక్యత వస్తోందని గ్రహించి ఆ నాలుగు పక్షుల్ని పిలిపించి 'సంగీతం లేకపోతే పాటకు అందం రాదు. అ పాటకు తగిన స్వరంతో పాడే వారు లేకపోతే పాటకు రూపం రాదు. ఆ పాటకు తగిన నాట్యం లేకపోతే అందరిని అలరించదు. కనుక అందరూ గొప్ప వాళ్ళే, అందరు కలిస్తేనే ఐకమత్యం, ఆనందం' అని అన్నది. సూక్ష్మం గ్రహించిన నాలుగు పక్షులు తమ తప్పును తెలుసుకున్నాయి. అప్పటినుండి నాలుగు పక్షులు యధావిధిగా సంగీత, నాట్య ప్రదర్శన కొనసాగించాయి. ఈ గొడవకు కారణమైన నక్కకు సింహం వారి ప్రదర్శనకు కావల్సిన వాయిద్యాలను సమకూర్చి వాటిని వారి ప్రదర్శన చేసే చోటుకు ఎల్లప్పుడు మోసుకుని వెళ్ళాలని ఆదేశించింది. గొడవ పెట్టి ఆనందిద్దామనుకున్న నక్క నెత్తి మీద తాటికాయి పడ్డట్టు అయ్యింది.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
77802 77240

నేను గీసిన బొమ్మ



పి.మేఘన,
4వ తరగతి,
పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

శునకాలకు శిక్షణ

ఏదైనా ఓ కేసు చేధించాలన్నా, నిందితుల ఆధారాలు సేకరించాలన్నా ముందుగా వచ్చేది పోలీస్ కుక్కలు. ఈ కుక్కలే కీలకంగా ఉండి ఎన్నో కేసులను చేధించిన సందర్భాలు ఉన్నాయి. మరి ఈ కుక్కలకు శిక్షణ ఇవ్వడం అంటే మామూలు విషయం కాదు. ఆ శిక్షణ చాలా కఠినంగా ఉంటుంది. శిక్షకులకు చాలా ఓపిక, పరిశీలనా శక్తి ఉండాలి. ఇంతవరకూ శిక్షకులుగా ఉన్నది మగ అధికారులే! ఈ సంవత్సరం మొదటిసారిగా ఈ అవకాశాన్ని ఎనిమిది మంది మహిళలకు ఇచ్చారు సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) అధికారులు. అయితే ఈ శిక్షణా కాలంలో మగవాళ్ల కంటే చాలా తక్కువ సమయంలో మహిళలే ఆ జంతువులు చాలా దగ్గరయ్యాయని, శిక్షణలో ఇచ్చిన టాస్కులు కూడా చాలా త్వరగా చేశాయని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఈశ్వర్ సింగ్ దుహన్ అంటున్నారు.




గత ఏడాది పారా మిలటరీ దళం జంతు విభాగంలో హర్యానాకు చెందిన ఎనిమిది మంది మహిళా పోలీసులను తీసుకుంది. వీరు జనవరి నుంచి పోలీసు శాఖ ఉపయోగిస్తున్న కుక్కలకు, గుర్రాలకు శిక్షణ ఇచ్చారు. ఈ జంతువులు గత ఏడాది ఐటిబిపి నుంచి నేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ డాగ్స్‌గా ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఎనిమిది కుక్కలు మాలినోయిస్ జాతికి చెందినవి. టఫీ, రోనీ, స్పార్క్, ఆక్సెల్, చార్లీ, జూలీ, మీరా .. వాటి పేర్లు. శిక్షణ ప్రారంభం నుంచే ఆ కుక్కలను, గుర్రాలను మహిళా సిబ్బంది మంచి చేసుకున్నారు. వాటికి ఆహారం పెట్టడం, వ్యాయామాలు చేయించడం, గొంతును గుర్తు పట్టడంలో శిక్షణ ఇచ్చారు. తర్వాత నుంచి ప్రతి రోజూ ఆరు గంటల పాటు గ్రౌండ్‌కు తీసుకెళ్లి శిక్షణ ఇచ్చారు. కుక్కలకు ప్రత్యేకంగా బాంబు స్క్వాడ్, క్లూస్ టీం విభాగాల్లో ట్రైనింగ్ ఉంటుంది. ఆ సమయంలో ఎంతో ధైర్య సాహసాలతో శిక్షణ ఇచ్చారు. ఈ జంతువులు సైనిక విభాగాల్లో పనిచేసేందుకు, నేరాలు జరిగిన సమయాల్లో సహాయం చేసేలా పూర్తి శిక్షణ పొందాయి. పేలుడు పదార్థాలను గుర్తించడంలో నైపుణ్యం సాధించాయి. అన్ని పరీక్షల్లోనూ పాసైన ఈ కుక్కలను పెట్రోల్ ఎక్స్‌ప్లోజివ్ డిటెక్షన్ డాగ్స్‌గా నియమిస్తున్నారు.



ఈ మహిళా సిబ్బంది గుర్రపు స్వారీ చేయడం, లోడింగ్‌లో, లోడెడ్ మూల్స్ కదలిక వంటి అంశాలను నేర్పించారు. పూర్తిగా గుర్రాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ గుర్రాలు పర్వత ప్రాంతాల్లో ఉన్న సైనిక సిబ్బందికి ఆహారం తీసుకెళ్లేందుకు సహాయపడతాయి. ఇతర ప్రాంతాల్లోనూ వాహనాలు అందుబాటులో లేనప్పుడు ఈ గుర్రాలను వినియోగిస్తారు. శత్రువుల కంటపడకుండా ఉండేలా, టెర్రరిస్టు ప్రమాదాలను గుర్తించేలా కూడా ఈ జంతువులు నైపుణ్యం పొందాయి. ఈ ఎనిమిది మంది మహిళలు వారి గుర్రాలకు, కుక్కలకు కెప్టెన్లుగా వ్యవహరించారు. వారు ఆరు నెలల పాటు ఎంతో కఠినమైన శిక్షణను ఈ జంతువులకు ఇచ్చి, తీర్చిదిద్దారు.

జాగ్రత్తలు తీసుకోండి



కోవిడ్-19 లాగా హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వ్యాప్తి చెందుతుందని వైద్యులు అంటున్నారు. ఈ క్రమంలో ఇంట్లో పిల్లలు, వృద్ధులు ఉన్న వారు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ వైరస్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు సూచిస్తున్నారు.

- గొంతు నొప్పి, 3-5 రోజుల పాటు జ్వరం ఉంటుంది. చల్లని పదార్థాలు గానీ, కూల్‌డ్రింగ్స్ తాగకూడదు.
- 3 వారాల పాటు దగ్గు తగ్గదు. కొద్దిమందిలో ఆయాసం కూడా కనిపిస్తోంది.
- చలిగా ఉండటం, వాంతులు, ముక్కులో నుంచి నీళ్లు కారడం, తుమ్ములు ఉంటాయి. ఎక్కడపడితే అక్కడ చీదడం, ఉమ్మడం చేయకూడదు.
- ముఖానికి తప్పనిసరిగా మాస్క్ పెట్టుకోవాలి. బయటకు వెళ్లేవారు. గుంపుగా కూర్చుని పని చేసేవారు తరుచూ చేతులు శుభ్రం చేసుకోవాలి.
- గుంపులుగా చేరి మాట్లాడుకోవడం చేయకూడదు. షేక్‌హ్యాండ్ ఇవ్వకూడదు.
- తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేయి అడ్డం పెట్టుకోవాలి.
- కొంచెం కొంచెంగా రోజులో ఎక్కువ నీళ్లు తాగాలి.
- జ్వరం, ఒళ్లు నొప్పులుగా ఉంటే వైద్యులను సంప్రదించాలి. వారి సూచన మేరకు మందులను వేసుకోవాలి.



తియ్యని చెరకు రసం

ఎండలు మండుతున్న వేళ చల్లని పానీయాలు తాగేందుకు ఇష్టపడతాం. అయితే వేసవిలో కూల్‌డ్రింక్స్‌కి బదులు చెరకు రసం తాగితే ఎంతో మేలు.

- చెరకు రసం అలసట, నిస్సత్తువను తగ్గించి తక్షణ శక్తిని అందిస్తుంది.
- శరీరాన్ని రీహైడ్రేట్ చేస్తుంది.
- చెరకులో పిండిపదార్థాలు, ఫైబర్, పొటాషియం, జింక్, ఫాస్ఫరస్, క్యాల్షియం, ఐరన్ లాంటి మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్-ఎ, బి, సి కూడా మెండుగా ఉంటాయి. దీంతో చెరుకు రసం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ప్రొటీన్ స్థాయిలు పెరుగుతాయి. - మూత్రపిండాల ఆరోగ్యానికి కూడా మంచిది.
- అలాగే క్రమం తప్పకుండా చెరకు రసం తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- ఇందులోని ఫ్లేవనాయిడ్స్, యాంటీఆక్సిడెంట్లు, ఇతర ఫెనోలిక్ కాంపౌండ్స్ వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకుంటాయి.
- చెరకు రసం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు..

- అయితే కొంతమంది చెరకురసం ఆరోగ్యానికి మేలు చేస్తుందని.. ఎక్కువగా తాగుతారు. ఒకేసారి రెండు గ్లాసుల కంటే ఎక్కువ చెరకు రసం తాగితే.. మీ ఆరోగ్యానికి హాని జరిగే ప్రమాదం ఉంది.
- చెరకు రసం అధికంగా తీసుకోవడం వల్ల విరేచనాలు, మలబద్ధకం, డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉంది.
- అలాగే 20 నిమిషాల కంటే ఎక్కువసేపు నిల్వ ఉంచింది తాగకూడదు. ఒకవేళ తాగితే శరీరానికి మంచిది కాదు.
- నిల్వ ఉన్న చెరుకురసం ఆక్సీకరణ చెంది, కడుపు నొప్పి, వాంతులు, కళ్లు తిరగడం వంటి సమస్యలకు కారణమవుతుంది. కాబట్టి తాజాగా చేసిన చెరకు రసం తాగడం మంచిది.
- చెరకు రసంలో పొలికోసనాల్ అధికంగా ఉంటాయి. పొలికోసనాల్ అధికంగా ఉండటం వల్ల నిద్రలేమి సమస్య వచ్చే అవకాశం ఉంది. ఈ సమస్య ముదిరితే.. మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.
- చెరకు రసంలో కేలరీలు, చక్కెర పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎక్కువగా తీసుకుంటే బరువు త్వరగా పెరుగుతారు.
- బరువును అదుపులో ఉంచుకోవాలంటే.. రోజుకు ఒక గ్లాసు చెరకు రసం మాత్రమే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.
- చెరకులో ఉండే పోలికోసనాల్ రక్తాన్ని పలుచగా చేస్తాయి. దీని వల్ల రక్తం గడ్డకట్టదు. గాయం కారణంగా రక్తస్రావం అయినప్పుడు.. రక్తం గడ్డకట్టదు.
- కాబట్టి ఆరోగ్యం కోసం మితంగా చెరుకు రసం తీసుకోవడం ఉత్తమం.



ప్రశాంత్ నీల్‌తో

ప్రభాస్ 'రావణం'

ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ 'సలార్' ప్రాజెక్టు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని హోంబలే ఫిలిమ్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. తాజా సమాచారం ప్రకారం వీరిద్దరి కాంబినేషనల్లో మరో ప్రాజెక్టు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని దిల్‌రాజు స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రభాస్‌తో 'రావణం' అనే భారీ ప్రాజెక్టును నిర్మిస్తానని ప్రకటించారు. ఈ ప్రాజెక్టుని ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తారన్నారు. తాజాగా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'ప్రశాంత్ నీల్ స్క్రిప్ట్ వర్క్‌ను చివరి దశకు తీసుకు వచ్చారు. ప్రభాస్‌తో సినిమాను చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం వారిద్దరు కలసి 'సలార్' చేస్తున్నారు. 'సలార్' అనంతరం ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ మూవీ చేస్తారు. ఎన్టీఆర్ ప్రాజెక్టు అనంతరం ప్రశాంత్ నీల్ 'రావణం' పై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తారు' అని దిల్ రాజు పేర్కొన్నారు.

అనారోగ్యానికి గురయ్యా : సమంత



హీరోయిన్ సమంత టైటిల్ రోల్ ప్లే చేస్తున్న పాన్ ఇండియా మూవీ 'శాకుంతలం'. ఈ నెల 14న ఈ సినిమా ఐదు భారతీయ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతోంది. గత వారం రోజులుగా సమంత 'శాకుంతలం' ప్రమోషన్స్‌లో పాల్గొనడంతో ఇప్పుడు అనారోగ్యానికి గురైంది. తనకు జ్వరం వచ్చిందని, గొంతు కూడా పోయిందని సోషల్ మీడియా ద్వారా సమంత తెలిపింది. సినిమా మరో రెండు రోజుల్లో విడుదల కాబోతున్న నేపథ్యంలో చిత్ర బృందం చివరి నిమిషం వరకూ ప్రమోషన్స్‌ను ప్లాన్ చేసింది. అందులో భాగంగా బుధవారం సాయంత్రం ఎంఎల్ఆర్ఐటీ వార్షికోత్సవంలో పాల్గొనవల్సి ఉంది. కానీ తాను ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నానని సమంత తెలిపింది.



'డెవిల్' షూటింగ్ కంప్లీట్

హీరో నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తున్న కొత్త చిత్రం 'డెవిల్'. అభిషేక్ పిక్చర్స్ ప్రొడ్యూస్ చేస్తున్న 'డెవిల్' సినిమాలో కళ్యాణ్ రామ్ 'బ్రిటిష్ స్పై'గా నటిస్తున్నాడు. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా షూటింగ్ పూర్తి అయినట్లు మేకర్స్ తెలిపారు. నవీన్ మేడారం దర్శకత్వంలో వహించిన ఈ సినిమా గురించి ఎలాంటి అప్డేట్స్ ఇవ్వకుండానే సినిమా పూర్తి చేశారని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ స్టార్ట్ అయ్యాయి. సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. రావణాసుర సినిమాకి మంచి మ్యూజిక్ ఇచ్చిన హర్షవర్ధన్ రామేశ్వరన్ సంగీతం అందించారు. కళ్యాణ్ రామ్ కెరీర్‌లోనే ఇది భారీ బడ్జట్ సినిమా అని మేకర్స్ అంటున్నారు.

'బిచ్చగాడు-2' రెండో పాట విడుదల



'బిచ్చగాడు-2 చిత్రం నుంచి తాజాగా సెకండ్ సాంగ్ విడుదలైంది. 'చెల్లి వినవే.. నా తల్లీ వినవే.. నీ అన్నను కానూ అమ్మను నేను.. చిట్టీ వినవే.. నా బుజ్జీ కనవే.. నీ పుట్టూ మచ్చై ఉంటా తోడూ' అంటూ సాగే ఈ గీతాన్ని భాష్య శ్రీ రాయగా అనురాగ్ కులకర్ణి ఆలపించారు. సంగీతం విజయ్ ఆంటోనీ అందించారు. అనాథలైన హీరో, అతని సోదరి చిన్నతనంలో అనుభవించిన కష్టాలు, సమస్యల నేపథ్యంలో సాగే గీతంలా కనిపిస్తోంది. 'బ్రతుకులే వీధిపాలైనా.. నిన్ను రథములో తిప్పుకోనా.. భూమి బద్దలైపోయి రెండు ముక్కలైపోయినా.. ఊయలల్లే నేను మారి నిన్ను మోయనా..' అంటూ ఆర్ద్రతతో నిండిన సాహిత్యంతో ఉందీ పాట. ఈ సినిమాలో హీరోగా నటించి, డైరెక్షన్ చేస్తూ, మ్యూజిక్ అందించడంతో పాటు ఎడిటింగ్ సైతం విజయ్ ఆంటోనియే చేస్తున్నారు. ఇది అతని సొంత బ్యానర్ విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ పై నిర్మితం అవుతోంది. అతి త్వరలో జనం ముందుకు రాబోతున్న ఈ సినిమాలో కావ్య థాపర్ హీరోయిన్‌గా నటించింది.



రాజమౌళి ప్రాజెక్టులో మహేష్ పాత్రకు స్ఫూర్తి అదే..

రాజమౌళి తన తర్వాతి సినిమాను మహేశ్ బాబుతో చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ వర్కింగ్ టైటిల్‌గా 'ఎస్ఎస్ఎంబీ29' అని వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా ఫారెస్ట్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోంది. పాన్ ఇండియాగా పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా సమాచారం ప్రకారం 'ఎస్ఎస్ఎంబీ29'లో మహేశ్ బాబు పాత్రను లార్డ్ హనుమాన్ స్ఫూర్తితో రాస్తున్నారని సమాచారం. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఈ ఏడాది చివరలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశం ఉంది. సినిమా షూటింగ్‌ను అధిక భాగం అమెజాన్ అడవుల్లో జరుపుతారని తెలుస్తోంది. ఇండియన్ మూవీ హిస్టరీలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. పలు ఇంటర్నేషనల్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మించడానికి పోటీపడుతున్నాయని కూడా సమాచారం. డిస్నీ ఇండియా, సోనీ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకు వస్తున్నాయి. వీఎఫ్ఎక్స్‌ను లాస్ ఏంజెలెస్‌లో చేయాలని నిర్ణయించుకున్నారు.



'భువన విజయమ్' నుంచి వీడియో

సునీల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'భువన విజయమ్'. క్రైం కామెడీ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని యలమంద చరణ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌తో పాటు 'కథన కదనమున...' లిరికల్ వీడియో సాంగ్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. మేకర్స్ ఇప్పుడు మరో అప్‌డేట్ అందించారు. తాజాగా భువన విజయమ్ నుంచి బర్త్ ఆఫ్ భువన విజయమ్ పేరుతో వీడియోను లాంచ్ చేశారు. ఫీలింగ్ స్టార్ ప్రీతమ్ కుమార్ పాత్రలో సునీల్ కనిపించబోతున్నట్టు తెలియజేశాడు చరణ్. ఈ చిత్రంలో థర్టీ ఇయర్స్ పృథ్వీరాజ్, జబర్దస్త్ రాఘవ, షేకింగ్ శేషు, గోపరాజు రమణ, ధన్ రాజ్, వెన్నెల కిశోర్, శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీమతి లక్ష్మి సమర్పణలో హిమాలయ స్టూడియో మ్యాన్షన్స్ బ్యానర్‌పై కిరణ్, వీఎస్‌కే ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

గెలిపించిన సందీప్

బట్లర్ అర్ధసెంచరీ

చెన్నైపై మూడు పరుగుల తేడాతో రాజస్తాన్ విజయం



చెన్నై: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లో బుధవారం మరో ఉత్కంఠ మ్యాచ్ జరిగింది. చివరి బంతి వరకు సాగిన ఈ మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌పై రాజస్తాన్ రాయల్స్ మూడు పరుగుల తేడాతో గెలిచింది. ఛేదనలో భాగంగా చెన్నై చివరి ఓవర్లో 21 పరుగులు చేయాల్సి రాగా.. సందీప్ కిషన్ వేసిన ఓవర్లో తొలి మూడు బంతులకే చెన్నై 14పరుగులు చేసింది. ఆ తర్వాత సందీప్ కిషన్ చివరి 3బంతులకు 3పరుగులే ఇచ్చి రాజస్తాన్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు.

టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్‌కు యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్(10) నిరాశపరిచినా.. జాస్ బట్లర్(52) అర్ధసెంచరీకి తోడు పడిక్కల్(38), అశ్విన్(30), హెట్‌మైర్(30నాటౌట్) బ్యాటింగ్‌లో చెలరేగారు. బట్లర్.. పడిక్కల్(38)తో కలిసి 2వ వికెట్‌కు 77పరుగులు జతచేశారు. ఆ తర్వాత కెప్టెన్ సంజు(0) డకౌటైనా.. అశ్విన్, హెట్‌మెయిర్ సాయంతో బట్లర్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. వేగంగా పరుగులు రాబట్టే క్రమంలో ధృవ్ జోరెల్(4), హోల్డర్(0) వికెట్ల సమర్పించుకొన్నారు. ఆకాశ్ సింగ్, దేశ్‌పాండే, జడేజాకు రెండేసి, మొయిన్‌కు ఒక వికెట్ దక్కాయి.

బట్లర్ @ 3వేల పరుగులు


రాజస్తాన్ రాయల్స్ ఓపెనర్ జాస్ బట్లర్ ఐపిఎల్‌లో మూడువేల పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. సీఎస్‌కేతో మ్యాచ్ సందర్భంగా బట్లర్ ఈ ఫీట్ సాధించాడు. బట్లర్ 85 ఇన్నింగ్స్‌ల్లో 3వేల మార్క్‌ను అందుకోవడం ద్వారా అరుదైన రికార్డు సాధించాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగంగా మూడువేల పరుగుల మార్క్‌ను అందుకున్న మూడో ఆటగాడిగా బట్లర్ నిలిచాడు. ఈ జాబితాలో క్రిస్ గేల్ తొలి స్థానంలో ఉన్నాడు. గేల్ 75 ఇన్నింగ్స్‌ల్లో 3వేల పరుగుల మార్క్‌ను అందుకోగా.. కేఎల్ రాహుల్ 80 ఇన్నింగ్స్‌ల్లో ఈ మార్క్ అందుకొని రెండో స్థానంలో ఉన్నాడు. ఇక నాలుగో స్థానంలో డేవిడ్ వార్నర్(94 ఇన్నింగ్స్‌లు), ఐదో స్థానంలో ఫాఫ్ డుప్లెసిస్(95 ఇన్నింగ్స్‌లు) ఉన్నారు. ఛేదనలో చెన్నై ఓపెనర్ కాన్వే(50), రహానే(31) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. చివరి 3ఓవర్లలో 50కి పైగా పరుగులు చేయాల్సి రావడం, ధోనీ(32), జడేజా(25) పోరాడినా ప్రయోజనం లేకపోయింది. దీంతో చెన్నై జట్టు 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 172పరుగులే చేయగల్గింది.


ఐపిఎల్‌లో నేడు..
పంజాబ్ × గుజరాత్
(వేదిక: మొహాలీ; రా.7.30గంIIలకు)

యూరో 2032 హక్కులకు ఇటలీ బిడ్

రోమ్: 2032 యూరోపియన్ ఛాంపియన్‌షిప్ ఆతిథ్యానికి ఇటలీ ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఎఫ్ఐజిసి) బిడ్ దాఖలు చేసింది. ఈ మేరకు యూరోపియన్ ఫుట్‌బాల్ గవర్నింగ్ బాడీకి యుఇఎఫ్ఏ బుధవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇటలీ బిడ్‌ను దక్కించుకున్న పక్షంలో మిలన్, టూరిన్, వెరోనా, జెనోవా, బోలోగ్నా, ఫ్లోరెన్స్, రోమ్, నెపుల్స్, బారి, కాగ్లియారీలలో టోర్నమెంట్ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎఫ్ఐజిసి ఆ బిడ్‌లో పేర్కొన్నట్లు యుఇఎఫ్ఏ తెలిపింది. అలాగే 2028 లేదా 2032 యూరో టోర్నమెంట్ ఆతిథ్యానికి టర్కీ కూడా బుధవారం బిడ్ దాఖలు చేసిందని పేర్కొంది. అలాగే 2028 యూరో ఆతిథ్యానికి బ్రిటన్, ఐర్లాండ్ ఉమ్మడి బిడ్‌లను సమర్పించాయి. ఈ టోర్నమెంట్ ఆతిథ్యానికి ఈ రెండు దేశాలు బిడ్‌లు దాఖలు చేయడం ఇది ఆరోసారి. అక్టోబర్‌లో రెండు టోర్నమెంట్‌ల ఆతిథ్యానికి సంబంధించి అత్యధిక ఓట్లు వచ్చిన దేశానికి ఆతిథ్య హక్కులు అప్పగించనున్నట్లు యూరోపియన్ బాడీ ఎగ్జిక్యూటీవ్ కమిటీ తెలిపింది.

ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ షకీబ్, హెన్రిటే





దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్లేయర్ ఆఫ్ ది మంత్ (మార్చి నెలకుగాను) అవార్డును బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్-అల్-హసన్, రువాండా మహిళా క్రికెటర్ హెన్రిటే ఇషిమ్వే(రువాండ) ప్లేయర్ ఎంపికయ్యారు. షకీబ్-అల్-హసన్ ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలుచుకోవడం ఇది రెండోసారి. తాజాగా ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడంతో షకీబ్ మార్చి నెలకుగాను అవార్డు గెలుచుకున్నట్లు ఐసిసి బుధవారం ట్విటర్ వేదికగా వెల్లడించింది. ఇక రువాండాకు చెందిన 19ఏళ్ల మహిళా క్రికెటర్ దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన టి20 ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి తొలిసారి ఈ అవార్డును దక్కించుకుంది.

ఫైనల్‌కు అతిమ్ పంగల్

అండర్-20 రెజ్లింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్



అస్తానా(కజకిస్తాన్): ఇక్కడ జరుగుతున్న అండర్-20 మహిళల రెజ్లింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అతిమ్ పంగల్ ఫైనల్‌కు చేరి స్వర్ణ పతక పోటీకి సిద్ధమైంది. 18ఏళ్ల అతిమ్.. 53కిలోల విభాగం సెమీస్‌లో అద్భుత ప్రదర్శనతో 8-1పాయింట్ల తేడాతో ఉబ్జెకిస్తాన్‌కు చెందిన అక్టేంజేపై విజయం సాధించింది. అలాగే భారత్‌కు చెందిన మరో నలుగురు రెజ్లర్లు ప్రత్యర్థులపై నెగ్గి కాంస్య పతక పోటీకి సిద్ధమయ్యారు. బుధవారం జరిగిన 53కిలోల విభాగంలో అన్న మాలిక్ జపాన్‌కు చెందిన సే-నంజోపై తీవ్రంగా గాయపడ్డా.. పతక పోటీకి అర్హత సాధించగా.. మనీషా(65కిలోలు), రీతికా(72కిలోలు), సోనమ్ మాలిక్(62కిలోలు) ప్రత్యర్థులపై గెలిచి కాంస్య పతక పోటీకి సిద్ధమయ్యారు. ఇక నిషా దహియా(68కిలోలు) రజిత పతకం, ప్రియా(76కిలోలు) కాంస్య పతకాలను సాధించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68